సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 343

బుధవారం 4-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి’



**ఏడు రోజుల నష్టాలకు బ్రేక్**

480 పాయింట్ల లాభంతో 38,624కు చేరిన సెన్సెక్స్ -బిజినెస్‌లో



**భారత్ X ఇంగ్లండ్**

మహిళల టి20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ ప్రత్యర్థుల ఖరారు -స్పోర్ట్స్‌లో

● #SheInspiresUs

## మహిళలకే అంకితం



ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తినిచ్చే మహిళల జీవితాలైనా, అలాంటి మహిళల గురించి తెలిసినవారైనా #SheInspiresUs హ్యాష్ ట్యాగ్‌తో షేర్ చేయాలని.. అందులో ఎంపిక చేసిన వాటిని తన సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా ప్రపంచం ముందు ఉంచుతానని ప్రధాని మోదీ తెలిపారు

- 5లో

● రెండో రోజూ...

## ‘షేమ్’ సీన్



ఢిల్లీ అల్లర్లపై వరుసగా రెండో రోజూ పార్లమెంటు ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న, సమర్థిస్తున్న వర్గాల మధ్య ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లపై పార్లమెంట్లో చర్చ జరిపేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ.. విపక్షం ఆందోళనను విరమించలేదు.

- 5లో

● పౌరసత్వ సవరణ చట్టం

## సుప్రీంకు ఐరాస



వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టంపై తమను కోర్టు సహాయకారిగా నియమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం మంగళవారం సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఆ చట్టం తమ అంతర్గత వ్యవహారమని భారత్ స్పష్టం చేసింది.

- 5లో

## ఎన్‌పీఆర్‌పై అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం

ఏపీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్..



సాక్షి, అమరావతి: ఎన్‌పీఆర్‌లో ప్రతిపాదించిన కొన్ని ప్రశ్నలు ఏపీలోని మైనార్టీలలో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ అంశంపై తమ పార్టీలో విస్తృతంగా చర్చించామని తెలిపారు. ఎన్‌పీఆర్‌కు సంబంధించి 2010లోని అంశాలనే ఇప్పుడూ పాటించాలని కేంద్రాన్ని కోరతామన్నారు. ఈ మేరకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెడతామని వెల్లడించారు. ఈ మేరకు జగన్ ట్విట్టర్‌లో మంగళవారం స్పందించారు.

## విద్యుత్ ఉద్యోగుల కరువు భత్యం పెంపు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల కరువు భత్యం 8.866% నుంచి 12.866 శాతానికి పెంచుతూ తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పెరిగిన డీఏ జనవరి 1, 2020 నుంచి వర్తించనుంది.





నిమిషం ఆలస్యమైనా

## నో ఎంట్రీ..

- ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోండి
- నేటి నుంచే ఇంటర్మీడియెట్ పరీక్షలు
- ఉదయం 9 గం. నుంచి 12 గం. వరకు
- 23 వరకు కొనసాగనున్న పరీక్షలు

- వివరాలు 3లో

## రూ. 1,700 కోట్లతో ‘సాగర్’ పునరుజ్జీవం

- సీతారామ ద్వారా నాగార్జునసాగర్‌కు నీటి పంపిణీ
- ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక

- వివరాలు 4లో

## భూ ఆక్రమణ.. వాల్టా ఉల్లంఘన!

- 1.21 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం
- రేవంత్‌రెడ్డి భూమి అక్రమ మ్యుటేషన్ల వ్యవహారంపై తుది నివేదిక

- వివరాలు 4లో

మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. హాజరైన మంత్రులు, అధికారులు



# కోవిడ్ కట్టడికి 100 కోట్లు

- వైరస్ విస్తరించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3 వేల పడకలు కేటాయింపు
- గాంధీ, ఫీవర్, చెస్ట్, మిలిటరీ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు
- చికిత్సపై అధ్యయనానికి కేరళకు 15 మంది డాక్టర్ల బృందం
- ఉపసంఘం భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి ఈటల
- 50 వేల మాస్కులు పంపాలని కేంద్ర మంత్రికి విన్నపం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ప్రవేశించిన కోవిడ్ మహమ్మారి మరింత విస్తరించకుండా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వైరస్ వ్యాప్తిని నివారించేందుకు రూ.100 కోట్లు కేటాయించినట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఫీవర్, చెస్ట్ ఆస్పత్రులు, కంటోన్మెంట్‌లోని మిలిటరీ ఆస్పత్రితోపాటు వికారాబాద్ లోని టీబీ ఆస్పత్రిలోనూ ప్రత్యేక వార్డులను సిద్ధం చేసినట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న ప్రైవేటు మెడికల్ అనుబంధ ఆసుపత్రుల్లో 3 వేల పడకలను అందుబాటులో ఉంచాలని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వాటిలో కొన్నింటిని సాధారణ ఐసొలేషన్ కోసం, కొన్నింటిని ప్రత్యేక చికిత్స కోసం ముందు జాగ్రత్తగా తీసుకున్నట్లు వివరించారు. మంత్రి ఈటల నేతృత్వంలోని ఆరోగ్య మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం కోవిడ్‌పై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితా రాణా, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, పలు శాఖల ఉన్నతాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. వైరస్ మిగతా 2వ పేజీలో ▶

**బెంబేలొద్దు.. బేఖాతరూ చేయొద్దు**

నిరంతర నిఘా... 2లో

## నిలకడగా కరోనా బాధితుని ఆరోగ్యం..

- గాంధీలో 12 మంది, ఫీవర్‌లో ఒకరు అడ్మిట్ - 2లో
- 45 మంది నుంచి నమూనాల సేకరణ.. రిపోర్టులు నేడు వచ్చే చాన్స్

## కామారెడ్డిలో కోవిడ్ కలకలం

కామారెడ్డి క్రైం/నిజామాబాద్ అర్బన్/ఇందల్‌వాయి: హైదరాబాద్‌లో కోవిడ్ కేసు నమోదైన మరుసటి రోజే రాష్ట్రంలో మరో కేసు కలకలం రేపింది. కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి జ్వరం, తుమ్ములతో వచ్చిన వ్యక్తిని

- జ్వరం, తుమ్ములతో కామారెడ్డి ఆస్పత్రికి ఎల్లారెడ్డిపల్లి వాసి
- వారం క్రితమే దుబాయ్ నుంచి రాక
- కోవిడ్ లక్షణాలనే అనుమానంతో గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేసిన వైద్యులు

కోవిడ్ లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేయడం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కల్లోలం సృష్టించింది. ఇందల్‌వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన బాల్‌రాజ్(40) మిగతా 2వ పేజీలో ▶

● బడ్జెట్ భారీగా..

# 1.60 లక్షల కోట్లు

**2020-21 బడ్జెట్ అంచనా..**

| 10,000 కోట్లు | 6,000 కోట్లు |
|---|---|
| సాగునీటి రంగానికి కేటాయింపు ఇలా.. | రుణమాఫీకి ఇచ్చే మొత్తం.. |

- పింఛన్లకు రూ. 12 వేల కోట్లు..
- జీతభత్యాలు, సబ్సిడీలు, వడ్డీలకు కలిపి రూ. 47 వేల కోట్లు
- పట్టణ, పల్లె ప్రగతికి రూ. 7,300 కోట్లు..
- ఈనెల 8న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం





సాక్షి, హైదరాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020–21) రూ.1.6 లక్షల కోట్ల మేర అంచనాలతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ రూపొందిస్తున్నట్లు సమాచారం. 2019–20 బడ్జెట్ ప్రతిపాదిత అంచనాలు, వాస్తవిక రాబడులు, ఆర్థిక మాంద్యం, వచ్చే ఏడాది రాబడుల అంచనా, ప్రభుత్వ ప్రాధాన్య రంగాలకు నిధుల కేటాయింపు ప్రాతిపదికన వాస్తవిక బడ్జెట్‌ను ప్రజల ముందుంచాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే వృద్ధి రేటు 10 శాతానికి అనుగుణంగా 2019–20 బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.1.46 లక్షల కోట్లకు అదనంగా మరో 12–16 వేల కోట్లు కలిపి 2020–21 బడ్జెట్ తయారీ కోసం ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. అయితే రూ.1.65 లక్షల కోట్ల అంచనాతో ఈసారి బడ్జెట్‌కు తుదిరూపు ఇస్తున్నారనే చర్చ జరిగినా, కరోనా వైరస్ ప్రభా వం దేశీయ మార్కెట్లపై ఉండటం, ఆ మేర పన్నురాబడులపై ప్రభావం ఉం టుందనే అంచనా, వచ్చే ఏడాది మొదటి త్రైమాసికం వరకు ఆర్థిక మాంద్యం ప్రభావం ఉండే అవకాశాలున్న నేపథ్యంలో ఈసారి బడ్జెట్ అంచనాలు రూ.1.6 లక్షల కోట్ల వరకు ఉం టాయని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రాజెక్టులకు ఈసారి అప్పులే..**

ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం ఈసారి సాగునీటి రంగానికి రూ.10 వేల కోట్ల లోపే బడ్జెట్ కేటాయింపులుంటాయని తెలుస్తోంది. వీటికి అదనంగా అప్పులు కలిపి రూ.23 వేల కోట్ల వరకు ప్రతిపాదనలుండే అవకాశాలున్నాయి. సాగునీటి రంగంతో పాటు రైతు రుణమాఫీకి రూ.10 వేల కోట్ల వరకు కేటాయించనున్నట్లు సమాచారం. రైతు రుణమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరం అవుతాయని బ్యాంకులు అంచనా వేయగా, 2019–20లో కేటాయించిన రూ.6 వేల కోట్లకు అదనంగా మరో రూ.18 వేల కోట్లు ఈసారి బడ్జెట్‌లోనే కేటాయించి ఈ ఏడాది పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి రూ.6వేల కోట్లు కేటాయించి ఈ ఏడాది నుంచి రుణమాఫీ అమలు ప్రారంభించాలనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. 57 ఏళ్లకు కుదించిన మిగతా 3వ పేజీలో ▶









ఇదండీ సంగతి





# రోజుకు 21 మంది

**7,845**

**2018లో రాష్ట్రంలో బలవన్మరణాలు**

- చిన్న చిన్న సమస్యలకూ ఆత్మహత్యలు..
- కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాలే అధికం
- ఆత్మహత్యల రేటులో తెలంగాణకు 5వ స్థానం
- ఎన్‌సీఆర్‌బీ 2018 గణాంకాలు

**ఆత్మహత్యకు కారణాలివే..**

| | |
|---|---|
| కుటుంబ సమస్యలు | 30.4% |
| అనారోగ్యం | 17.7% |
| వివాహ సమస్యలు | 6.2% |
| మాదకద్రవ్యాల బానిసలు | 5.3% |
| ప్రేమ సమస్యలు | 4% |

సాక్షి, హైదరాబాద్

● తమ్ముడికి ట్యాబ్ ఇచ్చి, తనకు ఇవ్వలేదన్న కోపంలో ఆరో తరగతి పిల్లాడు ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు..

● అప్పు తీర్చలేననే భయంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన భార్య, ఇద్దరు కొడుకులను చంపి.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు..

‘ఆత్మీయులు లేనివారే ఆత్మహత్యలకు పాల్పడతారు. చనిపోవాలంటే చాలా ధైర్యం కావాలి. ఆ ధైర్యంలో ఒక్క శాతం సమస్యను పరిష్కరించడానికి కేటాయిస్తే.. తప్పకుండా వారు నూటికి నూరు శాతం సఫలీకృతులవుతారు’ఇదీ మానసిక నిపుణుల అభిప్రాయం.

పరిష్కారం లేని సమస్యంటూ లేదు ఈ ప్రపంచంలో. సులువుగా నొప్పి తెలియకుండా ఎలా చావాలో నెట్‌లో వెతికే యువత.. అదే సమయాన్ని తమ సమస్య పరిష్కారం కోసం వెతికితే బతకొచ్చన్న సంగతి విస్మరిస్తున్నారు. కారణాలేవైనా.. దేశంలో ఏటా దాదాపున 1.3 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. జాతీయ సగటు ప్రకారం.. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రతి లక్ష మందిలో 10.2 మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తెలంగాణలో రోజుకు 21 మంది తనువు చాలిస్తున్నారు.

**ఏడో స్థానంలో తెలంగాణ..**

2018 నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2018లో దేశం మొత్తం మీద 1,34,516 మంది వ్యక్తిగత సమస్యలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రాల వారీగా చూస్తే.. 17,972 ఆత్మహత్యలతో మహారాష్ట్ర మిగతా 3వ పేజీలో ▶





గాంధీలో... అమెరికా నుంచి ఇటీవల వచ్చిన మహిళకు వైద్యుల స్క్రీనింగ్



కోవిడ్ వార్డు వద్ద మాస్కులతో పోలీసుల పహారా


ఆస్పత్రి ఓపీ విభాగంలో మాస్కులతో...



# బెంబేలొద్దు.. బేఖాతరూ చేయొద్దు!



కోవిడ్.. ఈ పేరు వింటేనే ప్రపంచం హడలిపోతోంది. పొరుగుదేశం చైనాను అతలాకుతలం చేసిన ఈ వైరస్ తొలి రోజుల్లో కేరళకు వచ్చినా, దాన్ని సమర్థంగా ఎదుర్కొన్నాం. తాజాగా హైదరాబాద్‌లో ఆ మహమ్మారి జాడ బయటపడటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే, ప్రజలెవరూ భయాందోళనలకు గురికావొద్దని.. అప్రమత్తంగా ఉంటే చాలని ప్రభుత్వం సూచిస్తోంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రించొచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. – సాక్షి, హైదరాబాద్

### దగ్గరగా ఉంటేనే సోకుతుంది

మిగతా వైరస్‌ల తరహాలో కోవిడ్–19 కూడా ఒకరి నుంచి ఒకరికి సంక్రమిస్తుంది. అయితే, ఎక్కడో దూరంగా ఉన్న బాధితుడి నుంచి ఇతరులకు వచ్చే అవకాశం ఉండదు. ఆ వైరస్ సోకినవారికి చేరువగా ఉన్నప్పుడు మాత్రమే ఇది సంక్రమించే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఈ వైరస్ వస్తే, అదే ఇంట్లో ఉండే మిగతావారికి కూడా ఇది సోకే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. బాధితుడితో కలిసి ఒకే వాహనంలో ప్రయాణించినా, సినిమాహాళ్లు వంటి ప్రదేశాల్లో కలిసి ఉన్నా, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నా.. ఈ వైరస్ అతడి నుంచి సంక్రమించే చాన్స్ ఉంటుంది.



- **జ్వరం:** దీని తొలి సంకేతం జ్వరం రావడం. సాధారణ పరిస్థితిలో వచ్చే తరహాలోనే ఈ వైరస్ సోకినవారికి జ్వరం ఉంటుంది. దాని తీవ్రతలో పెద్ద మార్పేంటూ ఏమీ ఉండదు.
- **జలుబు:** సాధారణ జలుబు లక్షణాలుంటాయి. ముక్కు కారుతుంటుంది.
- **పొడి దగ్గు:** జలుబుతోపాటు పొడి దగ్గు కూడా ఇబ్బంది పెడుతుంది.
- **శ్వాసలో ఇబ్బంది:** ఈ వైరస్ సోకినవారు శ్వాసకు సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒక్కోసారి ఊపిరి అందనట్టుగా అనిపిస్తుంది.
- కొంతమందిలో కండరాల నొప్పులు, అయోమయంగా ఉండటం, తీవ్ర తలనొప్పి, గొంతు బొంగురుపోవటం, ఛాతీలో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కూడా ఉంటాయి. చైనాలోని వూహాన్‌లో తొలుత వైరస్ బారినపడ్డ 99 మంది లక్షణాలను ఇటీవల అక్కడి ఆసుపత్రి విడుదల చేసింది. వీరిలో జ్వరంతో వచ్చినవారు 83 మంది ఉండగా మిగతా వారిలో పై లక్షణాలు కూడా కనిపించాయి.

### అదుపులోకి రాకుంటే ప్రమాదమే



కోవిడ్ సోకిన వెంటనే చికిత్స మొదలుపెడితే వెంటనే అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. మన దేశంలో తొలుత ముగ్గురు కేరళ వాసులు ఈ మహమ్మారి బారిన పడ్డారు. వెంటనే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై వారికి ప్రత్యేక శ్రద్ధతో చికిత్స ప్రారంభించింది. ఫలితంగా వారు వెంటనే కోలుకోగలిగారు. అయితే, సకాలంలో చికిత్స అందకపోతే వ్యాధి తీవ్రత పెరిగితే చేయి దాటే ప్రమాదం ఉంటుంది. అలాంటివారిలో కొందరికి శ్వాస తీసుకోవటంలో అత్యంత తీవ్రమైన ఇబ్బందులు(సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఏర్పడతాయి. న్యుమోనియా, కిడ్నీలు దెబ్బతినే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. ఇవి చివరకు మరణానికి దారి తీస్తాయి.

### వెంటనే గుర్తించాలి

మన దేశంలో సాధారణ జలుబు, జ్వరం, దగ్గు సహజంగా వస్తుంటాయి. వీటికి డాక్టర్ వద్దకు వెళ్లకుండా సొంతంగా మందులు వేసుకుంటూ ఉంటారు. కానీ, ప్రస్తుతం పొడి దగ్గు, జలుబుతో కూడిన జ్వరం ఉంటే మాత్రం ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కోవిడ్ సోకిన తర్వాత చికిత్స కోసం పరిగెత్తడం కంటే అది రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ఈ వైరస్‌కు ప్రత్యేక చికిత్స లేకపోవటంతో మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- **చేతులు కడుక్కుంటూ ఉండాలి:** కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు, ఇతరులు తిరిగిన ప్రాంతాల్లో చేతులు ఉంచినప్పుడు వెంటనే శుభ్రం చేసుకోవాలి. ఆ ప్రాంతంలో అంతకుముందు ఎవరైనా తుమ్మినప్పుడు వారి నోటి నుంచి వెలువడ్డ వైరస్ అక్కడ ఉండే అవకాశం ఉంటుంది. బస్సుల్లో ప్రయాణించినప్పుడు ఎక్కువ మంది చేతులు ఉంచిన చోటనే మనం కూడా చేతులు ఉంచాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి సందర్భంలో చేతులు తిరిగి మొహంపై పెట్టుకునేలోపు శుభ్రం చేసుకోవాలి.

### పరిశుభ్రతే మందు



- **కరచాలనం వద్దు:** మనకు తెలియకుండానే చేతులతో ఏవేవో పనులు చేస్తుంటాం. గోక్కోవటం, ముక్కు, నోట్లో వేళ్లు పెట్టుకోవటం వంటివి చేసినప్పుడు వైరస్ చేతుల్లోకి చేరుతుంది. ఇతరులతో కరచాలనం చేసినప్పుడు వారికి కూడా ఆ వైరస్ సోకుతుంది. అందుకే కరచాలనానికి పూర్తి దూరంగా ఉండాలి.
- తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు చేతి రుమాలు అడ్డుపెట్టుకునే అలవాటు చేసుకోవాలి.
- జనసమ్మర్థం ఉండే ప్రాంతాలైన రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, మార్కెట్లకు వెళ్లకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించటం ఉత్తమం. కనీసం కర్చీఫ్ అయినా కట్టుకోవాలి.
- అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలకు దూరంగా ఉండాలి.
- చాలా రకాల వైరస్‌లు జంతువుల నుంచే వస్తాయి. కోవిడ్ విజృంభిస్తున్న తరుణంలో విదేశాల నుంచి వచ్చే మాంసాన్ని భుజించటం సరి కాదు.
- వైరస్‌లు తొలుత గొంతు భాగంలో సెటిల్ అయి.. తర్వాత విస్తరిస్తాయి. దీనిని నివారించేందుకు అల్లం, తులసి, పసుపు, మిరియాలు, దాల్చిన చెక్కలాంటివి (ఏదైనా ఒకటి) అవసరమైనంతమేర నీటిలో వేసి ఉడికించి తాగాలి.

### 24 రోజుల వరకు బతికుంటుందట..

కోవిడ్ శరీరంలోకి చేరిన రెండు రోజుల నుంచి 12 రోజుల్లో ప్రభావం చూపుతుంది. అనుమానిత లక్షణాలతో ఆస్పత్రిలో చేరిన తర్వాత 12 రోజుల వరకు దాని లక్షణాలు నిర్ధారణ కాకుంటే, ఇక ఆ వైరస్ ప్రభావం లేదని తేలినట్టే. అయితే, అతి ప్రమాదకర వ్యాధులతో బాధపడేవారిలో మాత్రం దాదాపు 24 రోజుల వరకు వైరస్ బతికే ఉంటుందని, ఆలోపు ఎప్పుడైనా అది వారిపై ప్రభావం చూపించొచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

# కోవిడ్ కట్టడికి 100 కోట్లు



▶ మొదటి పేజీ తరువాయి

వ్యాపించకుండా ఏయే శాఖలు ఏయే చర్యలు తీసుకోవాలో మంత్రులు దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి ఈటల మీడియాతో మాట్లాడారు. కోవిడ్ విస్తరించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైరస్ సోకిన బాధితుని పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటున్నాడని తెలిపారు. కోవిడ్‌కు ఇవ్వాల్సిన చికిత్సపై అధ్యయనం చేసేందుకు 15 మంది డాక్టర్లు, జిల్లా వైద్యాధికారుల బృందాన్ని కేరళకు పంపిస్తున్నామని చెప్పారు. వైరస్ కట్టడికి కేంద్రం మార్గదర్శకాలు పాటిస్తున్నామన్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్, కార్యదర్శి ప్రీతి సుడాన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడానని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో కొరత ఉన్న నేపథ్యంలో ఢిల్లీ నుంచి 50 వేలు మాస్కులు పంపించాలని అడిగామని చెప్పారు.

**ఎవరికీ షేక్ హ్యాండ్ ఇవ్వొద్దు...**

కోవిడ్ వైరస్ గాలి ద్వారా వ్యాపించదని, అయితే రోగి దగ్గినా, తుమ్మినా తుంపర్లు గాలిలో 12 గంటల పాటు ఉంటాయని, వాటి ద్వారా వైరస్ వ్యాపించే ప్రమాదముందని ఈటల తెలిపారు. వైరస్ భయం పోయేదాకా ప్రజలు షేక్ హ్యాండ్ ఇవ్వడం మానేయాలని సూచించారు. ఆప్తులకూ నమస్కారమే చేయాలన్నారు. కోవిడ్ వైరస్ సోకిన వాళ్లు మాస్కులు ధరిస్తే సరిపోతుందని, అందరూ ధరించాల్సిన అవసరం లేదని ఈటల సూచించారు. కానీ దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కర్చీఫ్ లేదా చెయ్యి అడ్డం పెట్టుకోవాలన్నారు. శానిటైజర్లు వినియోగించాలని, తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హోటళ్లు, థియేటర్లు, స్కూళ్లు, కాలేజీల వంటి జన సమ్మర్ధ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. బస్సులు, రైళ్లలో ప్రయాణిస్తున్నవారు కూడా జాగ్రత్తలు వహించాలన్నారు. జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ఈ చర్యలన్నీ వైరస్ వ్యాపించకుండా ముందు జాగ్రత్తలో భాగమేనని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మన దగ్గర అధిక ఉష్ణోగ్రతలు, తేమ శాతం తక్కువగా ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో వైరస్ విస్తరించే అవకాశం తక్కువని మంత్రి చెప్పారు.

**రోగుల ట్రావెల్ హిస్టరీ కనుక్కోండి...**

రోగుల ట్రావెల్ హిస్టరీ అడగాలని, బయటి దేశాలకు వెళ్లొచ్చిన వారితో సన్నిహితంగా మెలిగారేమో కనుక్కోవాలని ప్రైవేటు ఆసుపత్రులకు ఈటల విజ్ఞప్తి చేశారు. ట్రావెల్ హిస్టరీ, విదేశాలకు వెళ్లొచ్చిన వాళ్లతో సన్నిహితంగా మెలిగిన వాళ్లు వస్తే వెంటనే వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. కోవిడ్ వైరస్ వ్యాప్తి, లక్షణాలపై అవగాహన కల్పించేందుకు భారీ ప్రచారం నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందన్నారు.

**అంతా ప్రశాంతంగా ఉండాలని ప్రార్థిస్తున్నా...**

కోవిడ్ కేసు తెలంగాణలో నమోదు కావడంతో తనకు నిద్ర కూడా పట్టడంలేదని మంత్రి ఈటల రాజేందర్ విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. సోమవారం రాత్రి 12 గంటలకు నిద్రపోయానని, మళ్లీ ఉదయం 4 గంటలకే మెలకువ వచ్చిందన్నారు. అంతా ప్రశాంతంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. 88 మంది అనుమానితుల్లో ఎవరికీ పాజిటివ్ రాకూడదని దేవుడిని ప్రార్థించానన్నారు. నిద్రాహారాలు మాని కోవిడ్ వైరస్ రాకుండా అందరూ పనిచేస్తున్నారన్నారు.


మంగళవారం మహేంద్రహిల్స్‌లోని కోవిడ్ బాధితుడి ఇంటి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు

# బస్సులో ఉన్నప్పుడు వైరస్ లేదు!

**కోవిడ్ బాధిత యువకుడి కేసులో వైద్య, ఆరోగ్యశాఖ నిర్ధారణ**

సాక్షి, హైదరాబాద్: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ తొలి కోవిడ్ బాధితుడు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులో వచ్చినప్పుడు ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తేల్చాయి. అక్కడి నుంచి వచ్చాకే జ్వరం ప్రారంభమైందని తెలిపాయి. ఇక హైదరాబాద్ వచ్చాక తన కుటుంబంలో 13 మంది సభ్యులతో కలిసి ఉన్నాడని నిర్ధారించాయి. ఆయన బెంగళూరులోని గ్లోబల్ టెక్నాలజీ పార్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడని తేలింది. హైదరాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లో అతడి కుటుంబం ఉంటోంది. ఆ యువకుడు బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చిన బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితోపాటు అపోలో ఆస్పత్రిలో అతడు కాంటాక్ట్ అయిన 50 మంది వైద్య సిబ్బందిని కూడా గుర్తించారు. మొత్తమ్మీద కుటుంబ సభ్యులతో కలిపి 88 మందిని అతడు కలుసుకున్నట్టు నిర్ధారణకు వచ్చారు. వారిలో 45 మందిని గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు అతడితో కలిసి ఉన్నవారిలో 36 మందికి కోవిడ్ అనుమానిత లక్షణాలు కనిపించాయని అధికార వర్గాలు తెలిపాయి.

**ఏ రోజు ఎక్కడెక్కడ ఉన్నాడంటే?**

- కోవిడ్ బాధితుడు ఫిబ్రవరి 15న బెంగళూరు నుంచి దుబాయ్ వెళ్లాడు.
- గతనెల 16 నుంచి 19 వరకు అక్కడే ఉన్నాడు. సింగపూర్‌కి చెందిన అతడి కంపెనీ ఉద్యోగితో కలిసి పనిచేశాడు.
- 20న తిరిగి బెంగళూరు వచ్చాడు.
- 20, 21 తేదీల్లో ఆఫీసుకు వెళ్లాడు.
- 21న హైదరాబాద్ బయలుదేరాడు.
- 22న ఉదయం హైదరాబాద్ చేరుకున్నాడు. జ్వరం రావడంతో అపోలోలో పరీక్షలు చేయించుకున్నాడు.
- ఆ తర్వాత నాలుగైదు రోజులకు కోవిడ్ లక్షణాలు మొదలయ్యాయి.
- 27న సికింద్రాబాద్ అపోలోలో చేరి 29 వరకు చికిత్స చేయించుకున్నాడు.
- 27న అతడికి చెస్ట్ ఎక్స్‌రే చేశారు. అందులో బైలేటరల్ లోయర్ లోబ్ న్యుమోనియా అని విశ్లేషణ ఉంది.
- ఈనెల 1న గాంధీలో చేరాడు.
- సాయంత్రం 4.30 గంటలకు కోవిడ్ అనుమానిత కేసుగా స్క్రీనింగ్ టెస్ట్ చేశారు. అర్ధరాత్రి ఒంటిగంటకు మరో నమూనా తీసుకున్నారు.
- 2న ఉదయం 9 గంటలకు అతడికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు.
- పుణేకు పంపిన శాంపిల్స్‌లోనూ పాజిటివ్‌గా తేలడంతో తెలంగాణలో తొలి కోవిడ్ కేసు నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది.

### నిలకడగా బాధితుడి ఆరోగ్యం

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్న మహేంద్రహిల్స్‌కు చెందిన యువకుడి (24) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. బాధితుడు న్యుమోనియాతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. మరో ఏడుగురు అనుమానితుల మెడికల్ రిపోర్టులు మంగళవారం వచ్చాయి. వీరిందరికీ నెగిటివ్ అని తేలింది. తాజాగా గాంధీ ఆస్పత్రిలో మరో 45 మంది అనుమానితుల నుంచి నమూనాలు సేకరించారు. వీరిలో 12 మందిని ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేసి, మిగిలినవారిని హోం ఐసోలేషన్‌కు సిఫార్సు చేశారు. వీరి రిపోర్టులు బుధవారం వచ్చే అవకాశం ఉంది. మరోవైపు కోవిడ్ అనుమానిత లక్షణాలతో ఓ వ్యక్తి నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో చేరారు. నెదర్లాండ్‌కు చెందిన ఆ వ్యక్తి(45) దుబాయ్ మీదుగా హైదరాబాద్ కోకాపేటకు వచ్చారు. ఆయనకు జ్వరం రావడంతో చికిత్సం కోసం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి వెళ్లగా.. కోవిడ్ అనుమానంతో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఆయన మంగళవారం ఫీవర్ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు ఆయన్ను ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేసుకుని, నమూనాలు సేకరించి, వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి పంపించారు.

# ..కోవిడ్ కలకలం

▶ మొదటి పేజీ తరువాయి

కొంతకాలం క్రితం దుబాయ్ వెళ్లాడు. వారం క్రితమే స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. జ్వరం, తుమ్ములు ఎక్కువగా ఉండటంతో మంగళవారం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అతన్ని పరీక్షించిన వైద్యులు కోవిడ్ లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో 108 అంబులెన్స్‌లో బాల్‌రాజ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కామారెడ్డి ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ స్పందిస్తూ సదరు ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడితో మాట్లాడానని, పేషెంట్ పరిస్థితి ప్రకారం కోవిడ్ లక్షణాలు పెద్దగా లేవన్నారు. నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం మాట్లాడుతూ దుబాయ్ నుంచి వచ్చాకే బాధితుడికి జలుబు, జ్వరం వచ్చిందని అతని కుటుంబ సభ్యులు చెప్పారన్నారు.

- మంత్రి కేటీఆర్ స్పష్టీకరణ
- ప్రముఖులతో సందేశాలు ఇప్పించాలని ఆదేశం
- కోవిడ్‌పై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

# మరణాల రేటు తక్కువ



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ మరణాల రేటు తక్కువని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో వచ్చిన ఇతర వైరస్‌లతో పోలిస్తే ఈ వైరస్‌తో మరణాల రేటు అతి తక్కువగా ఉందని, కాబట్టి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. వైరస్ నియంత్రణకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని తెలిపారు. కోవిడ్‌పై మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరిగింది. మంత్రులు ఎర్రబెల్లి, ఈటల ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవిడ్‌పై ఏం చేయాలి, ఏం కావాలో చెప్పాలని అధికారులను కేటీఆర్ కోరారు. టోల్ ఫ్రీ నంబర్ పెద్దదిగా ఉందని, దాని స్థానంలో సులువుగా గుర్తుండే వాటిని ఏర్పాటు చేయాలని చెబుతూ '104'ను ఏర్పాటు చేసుకోవాలని కేటీఆర్ సూచించారు.

**ప్రముఖులతో వీడియోలు..**

ప్రస్తుతం కోవిడ్‌పై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను పోగొట్టేందుకు ప్రముఖులతో సందేశాలు ఇప్పించాలని సూచించారు. ఇప్పటికే ఉర్దూలో హోం మంత్రి మహమూద్ అలీ, టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జాలతో వీడియో సందేశాలను రూపొందించామన్నారు. సినీ, క్రీడాకారులు, ఇతర రంగాల ప్రముఖులతో కోవిడ్‌పై అవగాహన వీడియోలు రూపొందించాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర చోట్ల ఉన్న హోర్డింగ్స్‌లో మెజారిటీ హోర్డింగ్స్ అన్నీ కూడా కోవిడ్ అవగాహనపైనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**మెడికల్ కాలేజీల్లో ఐసోలేషన్..**

అత్యవసర ఆరోగ్య పరిస్థితి వచ్చే అవకాశం ఉండటంతో హైదరాబాద్ పరిధిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలనూ ఐసోలేషన్ కోసం వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. ప్రస్తుత పరిస్థితిని మెడికల్ ఎమర్జెన్సీ కింద హ్యాండిల్ చేయాలని ఆదేశించారు. మాస్కుల వల్ల ఉపయోగం ఉండదని, దాన్ని ముక్కుకు తగిలించుకొని పదేపదే సరిజేసుకోవడం వల్ల చేతులకు ఎక్కువ కాంటాక్ట్ అవుతుందని, దాంతో ఇతరులకు త్వరగా సోకే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

# నిరంతర నిఘా

సాక్షి, హైదరాబాద్: జలుబు, జ్వరం, ఇతరత్రా కోవిడ్ అనుమానిత లక్షణాలతో వచ్చే వారిని గుర్తించేందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆయా ఆసుపత్రులు అనుమానిత కేసులను తక్షణమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోవిడ్ కంట్రోల్ రూంకు తెలియజేయాలని సూచించింది. కోవిడ్ నేపథ్యంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్‌లతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. ఈ భేటీకి ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలను కూడా ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పలు సూచనలు చేశారు. అలాగే ఉపసంఘం వివిధ శాఖలకు దిశానిర్దేశం చేసింది. ప్రైవేటు ఆసుపత్రుల్లోని నిఘా వ్యవస్థ అనుమానిత కేసులను గుర్తించి వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో ఏదో ఒక దానికి తరలించాలని కోరింది. ఆరోగ్యశాఖతో సమన్వయం కోసం ప్రతి ప్రభుత్వశాఖ ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించింది. కోవిడ్‌కు సంబంధించి తమ ప్రభుత్వ శాఖలో అవసరమైన సమాచారాన్ని అందించడానికి నోడల్ అధికారి బాధ్యత వహించాలి. ఆయా శాఖల పని ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పనిచేసే చోట తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సురక్షిత పద్ధతులను ప్రోత్సహించాలి. బహిరంగ సభలు, గ్రూప్ సమావేశాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత శాఖ నోడల్ ఆఫీసర్ కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలి. నివారణ చర్యల కోసం హోర్డింగ్‌లను ఏర్పాటు చేయాలి. కంట్రోల్ రూంల ఫోన్ నంబర్లు, కాల్ సెంటర్, ఐసోలేషన్ వార్డుల వివరాల జాబితాను ప్రచారం చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకుండా చూసుకోవాలి. ఏదైనా అనుమానాస్పద కేసు వస్తే కంట్రోల్ రూం నెంబర్ 040–24651119కు లేదా 104 నంబర్‌కు ఫోన్ చేయాలి. అలాగే idsptelangana@yahoo.comకు మెయిల్ చేయవచ్చు.

- ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం
- అనుమానిత కేసులపై కంట్రోల్ రూంకు తెలపాలని సూచన
- వివిధ ప్రభుత్వ శాఖలకు బాధ్యతల అప్పగింత

**వివిధ శాఖలు చేయాల్సిందిదీ...**



- **విద్యాశాఖ:** పాఠశాల పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. సబ్బు లేదా ఆల్కహాల్ ఆధారిత హ్యాండ్–రబ్‌లతో చేతిని శుభ్రపరచడాన్ని ప్రోత్సహించాలి. డిటర్జెంట్‌తో స్కూల్ డోర్లు, హ్యాండిల్స్, తాళాలను శుభ్రపరచాలి. ఫ్లూ లక్షణం ఉన్న పిల్లలు ఇంట్లోనే ఉండేలా ప్రోత్సహించాలి. వైద్యులను సంప్రదించాలని సూచించాలి.
- **సమాచారశాఖ:** మీడియాలో వార్తలు, కథనాలు సరైన విధంగా వచ్చేలా చూడాలి. అనవసరమైన భయాందోళన పరిస్థితులను సృష్టించకుండా చర్యలు చేపట్టాలి. రాష్ట్ర ఆరోగ్యశాఖ సహకారంతో అవగాహన కల్పించడానికి ప్రింట్, విజువల్, సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలి. తీసుకోవలసిన జాగ్రత్తలపై టీవీ, రేడియోలను ఉపయోగించుకోవాలి.



- **పోలీస్‌శాఖ:** కోవిడ్ లక్షణాలున్న వ్యక్తులతో కలసి తిరిగిన వారి వివరాలను గుర్తించడంలో ఆరోగ్య శాఖకు అవసరమైన సాయాన్ని అందించాలి. సోషల్ మీడియా కథనాలు, వార్తలపై అప్రమత్తంగా ఉండాలి. ప్రతికూల, అనవసరమైన భయాందోళనలను నివారించడానికి కృషి చేయాలి.



- **రవాణాశాఖ:** ప్రజారవాణాలో ఎవరికైనా కోవిడ్ లక్షణాలుంటే సంబంధిత వ్యక్తితో కలసి ప్రయాణించే ఇతరుల వివరాలను సేకరించాలి. తద్వారా సంబంధిత డేటాను ఆరోగ్య శాఖకు అందుబాటులో ఉంచాలి. ప్రొటోకాల్ ప్రకారం సంబంధిత వ్యక్తులను గుర్తించడంలో ఆరోగ్యశాఖకు సాయం చేయాలి.



- **పర్యాటకశాఖ:** టూరిస్టుల వివరాలన్నింటినీ రిజిస్టర్ చేయాలి. ఫోన్, ఈ–మెయిల్ ఐడీలతో వివరాలు తీసుకోవాలి. దేశ, విదేశీ పౌరులు ఇతర దేశాలకు వెళ్లారా లేదా తెలుసుకోవాలి. వారు హోటల్, రిసార్ట్స్, హోమ్ స్టే, లాడ్జీలలో ఉంటే తక్షణమే గుర్తించేలా చర్యలు తీసుకోవాలి. రోగ లక్షణాలేమైనా ఉంటే ఆయా ప్రయాణికుల వివరాలను సంబంధిత డీఎంహెచ్‌వోలకు తెలియజేయాలి.



- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు:** గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ కార్యదర్శుల ద్వారా ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలి.



- **మున్సిపల్‌శాఖ:** కోవిడ్ నివారణ, నియంత్రణ చర్యలపై ఆటోలు, దేవాలయాలు, చర్చిలలో ప్రచారం చేయాలి. మైక్‌లలో ప్రకటనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించడంతోపాటు తల్లులకు లక్షణాల గురించి చెప్పాలి. పట్టణాల్లో సామూహిక సమావేశాలను రద్దు చేయాలి. రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

## బీసీ జనగణన చేపట్టండి: ఆర్. కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: జనాభా సేకరణ 2021లో భాగంగా బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా బీసీల సమస్యల పరిష్కారానికి బీసీల జనగణన ఉపయోగపడనుందని, కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టేలా కేంద్రాన్ని ఒప్పించాలని మోదీకి రాసిన లేఖలో కోరారు. జనాభా లెక్కలను చేపట్టేందుకు హోంశాఖ విడుదల చేసిన 32 కాలమ్స్ ప్రొఫార్మాలో కులాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలు, మతాలకు సంబంధించి హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వంటివి పేర్కొన్నారే తప్ప బీసీలకు సంబంధించిన కాలమ్ లేదన్నారు. ఈ ప్రొఫార్మాలో బీసీ కులాల వారీ కాలమ్‌ను అదనంగా జతచేయాలని డిమాండ్ చేశారు. బీసీల జనగణన కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాల్సిన అవసరం లేదన్నారు. సిద్ధాంతాలు, ఆదర్శాలను ప్రచారం చేయడమే కాదు వాటిని ఆచరించి చూపుతుందనే నమ్మకం బీజేపీకి ఉందని, కులాల వారీగా బీసీ జనగణనను చేపడతామని 2010లో ఆ పార్టీ చెప్పిన దాన్ని ఆచరణలో తేవాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

### గవర్నర్‌కు విన్నవించిన టీపీయూఎస్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేలా చూడాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేసింది. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రాంచంద్రరావు నేతృత్వంలో టీపీయూఎస్ నేతలు హనుమంతరావు, నవాత్ సురేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్, పెంటయ్య, ఉష మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. 63 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించేలా చర్యలు చేపట్టాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ ప్రకటించి, టీచర్లకు పదోన్నతులు ఇచ్చేలా చూడాలని కోరారు. పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ జీవో ఇచ్చినా అమలు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

## రైతు సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం



సాక్షి, హైదరాబాద్: రైతు సమస్యలపై రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తోందని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు విసిగిపోయే దశకు చేరుకున్నారని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ మీడియా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు. రైతుబంధు కొంత మందికే వచ్చిందని, మెజార్టీ రైతులు రైతుబంధు నిధులు రాలేదన్న బాధతో ఉన్నారని చెప్పారు. మార్కెట్లకు వెళ్లిన రైతుకు మద్దతు ధర లభించడం లేదని, పంట నష్టపోయిన రైతును ఇప్పటివరకు ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మార్చకుండా వచ్చే ఎన్నికల వరకు ఆయననే కొనసాగించాలని, ఒకవేళ మార్చాలనుకుంటే పార్టీకి విధేయంగా ఉన్న వాళ్లకే పగ్గాలు అప్పజెప్పాలని సూచించారు.

## ఈ బడ్జెట్‌లో ఎంబీసీ కులాలకు న్యాయం

### ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఎంబీసీ కులాలన్నింటికీ ఈసారి న్యాయం చేసినట్టు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తనను కలిసిన తెలంగాణ విశ్వకర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులకు మంత్రి ఈ మేరకు హామీ ఇచ్చారు. మంత్రి కార్యాలయంలో మంగళవారం హరీశ్‌రావును కలసిన సమితి ప్రతినిధులు 6 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంబీసీలకు ఆర్థిక, సామాజిక న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లోనైనా న్యాయం చేయాలని కోరారు. విశ్వకర్మలకు చెందిన ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ, ఎంపీ పదవులను కేటాయించడంతోపాటు రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృత్తి నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి హామీ చట్టాన్ని వర్తింపచేయాలన్నారు. 55 ఏళ్లు పైబడిన వారికి రూ.5 వేల పింఛన్, టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమలు నెలకొల్పే వారికి తగిన ప్రోత్సాహాన్ని కల్పించాలని కోరారు. రూ.500 కోట్లతో 200 ఎకరాల్లో సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మంత్రిని కలసిన వారిలో సమితి అధ్యక్షులు రుద్రోజు శివలింగాచారి, చెన్నోజు శ్రీనివాసులు వాసుదేవాచారి తదితరులు ఉన్నారు.

## 'గీత కార్మికుల సంక్షేమానికి కృషి'



సాక్షి, హైదరాబాద్: గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అమరవేని నర్సాగౌడ్, కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూశాయని ఆరోపించారు. అదే కేసీఆర్ ప్రభుత్వం దళిత, బహుజన, మైనారిటీ వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మోకుదెబ్బ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధి రాములుగౌడ్, తోడ్పనూరి సత్యగౌడ్, బాలసాని సురేశ్‌గౌడ్, పన్యాల మమతగౌడ్, ఆకుల దేవేందర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 'అభయహస్తం'పై కమిటీ

సాక్షి, హైదరాబాద్: వడ్డీలేని రుణాలు, అభయహస్తం పథకాలను సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని ఈ కమిటీలో సభ్యులుగా ఆర్థికశాఖ కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సభ్యులుగా ఉండనున్నారు. ఈ కమిటీ పథకాల నిర్వహణ, తదితరాలపై చర్చించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 'చెరువులు, ప్రభుత్వ భూములపై సర్వే'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వం స్పందించి హైదరాబాద్, చుట్టుపక్కల చెరువులు, ప్రభుత్వ భూములన్నింటిపై సర్వే నిర్వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆక్రమణలకు గురైన భూమిని రక్షించాలని, ఆక్రమణదారులు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా కఠినచర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపింది. నీటిపారుదల శాఖ పరిధిలోని చెరువులను రెవెన్యూశాఖకు బదిలీ చేసేవరకు ఇతరులు ఆక్రమించడం నిషేధమని, బదిలీ చేయడానికి కూడా కేబినెట్ తీర్మానం తప్పనిసరి అని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఇవేవీ లేకుండానే పెద్దఎత్తున భూఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వభూములను చూపినా పట్టాలివ్వడానికి ప్రభుత్వంలో కదలిక లేకపోగా.. వందలాది ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతుంటే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.

## 'ఆర్టిస్టులకు హెల్త్‌కార్డులివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: టీవీ ఆర్టిస్టులకు హెల్త్‌కార్డులివ్వాలని తెలంగాణ మూవీ అండ్ టీవీ ఆర్టిస్టుల సంఘం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ని కోరింది. మంగళవారం సంఘం ప్రతినిధులు పృథ్వీరాజ్, సైదులు, ఆశ, లక్ష్మీ తదితరులు మంత్రిని వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తమ సంఘంలోని 800 మంది సభ్యులకు గుర్తింపుకార్డులు, హెల్త్ కార్డులు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరారు.



# నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

## నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 4 నుంచి 23 వరకు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటిరోజు ప్రథమ సంవత్సర పరీక్షలు ద్వితీయ భాష పేపర్‌తో ప్రారంభం కానుండగా, 5 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ద్వితీయ భాష పేపర్‌తో ప్రారంభం కానున్నాయి. పరీక్ష సమయం కంటే నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని, విద్యార్థులు వీలైనంత ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఇంటర్ బోర్డు సూచించింది. ఉదయం 8 గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని, 8.30 గంటలకు పరీక్ష హాల్‌లో విద్యార్థులు తమ సీట్లలో కూర్చోవాలని పేర్కొంది. పరీక్ష 9 గంటలకు ప్రారంభం అవుతుందని, ఆలోగా విద్యార్థులంతా పరీక్ష హాల్‌లో ఉండాలని చెప్పింది. నిర్ణీత సమయానికి మించి ఆలస్యమైతే అనుమతించేది లేదని స్పష్టం చేసింది. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని తెలిపింది. ఈ పరీక్షలకు మొత్తం 9,65,875 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. బుధవారం ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4,80,531 మంది విద్యార్థులు హాజరు కానుండగా, అందులో 2,36,430 బాలురు, 2,44,101 మంది బాలికలు హాజరు కానున్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 4,85,345 మంది విద్యార్థులు హాజరు కానుండగా, అందులో 2,46,378 మంది బాలురు, 2,38,966 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారు.

### ఆర్టీసీ ఉచిత ప్రయాణం



ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం (నేడు) నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఉచిత ప్రయాణం కల్పించనుంది. ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించాలనుకునే విద్యార్థులు ఇంటర్ హాల్‌టికెట్, టీఎస్ఆర్టీసీ జారీ చేసిన ఏదైనా రూట్ బస్‌పాస్‌ను చూపించాలని, లేదంటే అనుమతించరని తెలిపింది. అలాగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించాలనుకునేవారు అదనంగా రూ.20 కాంబినేషన్ టికెట్ కొనాలని టీఎస్ఆర్టీసీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.

### పాటించాల్సిన ప్రధాన జాగ్రత్తలు..

- సెంటర్ లొకేటర్ యాప్ సహకారంతో పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చు. అందులో చూపించే సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- ఉదయం 9 గంటలలోపు పరీక్ష హాల్లో ఉండాల్సిందే. ఆ తర్వాత అనుమతించరు.
- వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌ను ఇన్విజిలేటర్‌కు అప్పగించి, వారి నుంచి జవాబు బుక్‌లెట్, ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్ తీసుకోవాలి. హాల్‌టికెట్ లేకుండా పరీక్ష హాల్లోకి అనుమతించరు.
- జవాబుల బుక్‌లెట్‌లో 24 పేజీలు ఉన్నాయా.. లేదా చూసుకోవాలి. ఏమైనా తేడా ఉంటే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లి, మార్చుకోవాలి.
- హాల్‌టికెట్‌లో పేర్కొన్నట్లుగా సరైన సబ్జెక్టు ప్రశ్నపత్రాన్ని తీసుకోవాలి.
- ప్రశ్నపత్రంపై హాల్‌టికెట్ నంబర్ మాత్రమే రాయాలి.
- విద్యార్థి సంతకం, జవాబు పత్రం నంబరు ఫొటో ఐడెంటిటీ షీట్‌లో రాయాలి.
- పరీక్షలు రాసేందుకు బ్లూ/బ్లాక్ బాల్‌పెన్ మాత్రమే వినియోగించాలి.
- మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అప్పగించి, హాల్‌టికెట్‌ను తీసుకోవాలి.
- మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్‌కు తీసుకెళ్లొద్దు.
- ప్రశ్నపత్రం, హాల్‌టికెట్‌పై ఏమీ రాయకూడదు.
- పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌తో, మరే ఇతర అధికారులతో తప్పుగా ప్రవర్తించొద్దు.
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి.
- విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తితే ఫోన్ చేసేలా కంట్రోల్ రూం (040–24600110, 040–24732369)ను ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాటు చేసింది.

### ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి

ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా, భయానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కోరారు. సరైన ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమై, బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. సమయానికంటే ముందే పరీక్ష కేంద్రం చేరేలా చూసుకోవాలని కోరారు. భయం, ఆందోళన, ఒత్తిడికి గురైనట్లు ఎవరైనా విద్యార్థులు భావిస్తే ఇంటర్మీడియెట్ బోర్డు నియమించిన సైకాలజిస్టులను ఫోన్‌లో (7337225803) సంప్రదించి, సలహాలు తీసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు విషమ పరీక్ష!

**ఫీజులు వసూలు చేసి ఇంటర్ బోర్డుకు చెల్లించని శ్రీమేధా'వి' కాలేజీ**

**నేటి నుంచే పరీక్షలు.. అయినా విద్యార్థులకు అందని హాల్‌టికెట్లు..**

**చొరవ చూపిన ఇంటర్ బోర్డు.. హాల్‌టికెట్ల జారీకి అనుమతి**

సాక్షి, హైదరాబాద్: తెల్లారితే ఇంటర్ పరీక్షలు.. అయినా ఆ కాలేజీ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వలేదు. అడిగితే ఇదిగో వస్తాయి.. అదిగో వస్తాయి.. అంటూ యాజమాన్యం విద్యార్థులను మభ్య పెట్టింది. చివరికి ఇంటర్ బోర్డు అధికారులను కలసే వరకు అసలు విషయం తెలియలేదు. వారి నుంచి ఫీజులను వసూలు చేసిన యాజమాన్యం బోర్డుకు చెల్లించలేదని తెలిసింది. హైదరాబాద్ (కొత్తపేట) లోని శ్రీమేధా'వి'కాలేజీ యాజమాన్యం చేసిన తప్పుకు విద్యార్థులు అసలు పరీక్షలకు ముందు మరో కఠిన పరీక్షనే ఎదుర్కొన్నారు. బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, మంగళవారం రాత్రి వరకు కూడా వారి హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాలేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతూ ఇంటర్మీడియట్ బోర్డును సంప్రదించారు.

**స్పందించిన ఇంటర్ బోర్డు..**

ఇటు విద్యార్థులకు హాల్‌టికెట్లు అందని విషయంపై తెలంగాణ ఇంటర్ బోర్డు వెంటనే స్పందించింది. విద్యార్థుల ఫీజు చెల్లించడం మర్చిపోయామని కొత్తపేటలోని శ్రీమేధా'వి'కాలేజీ యాజమాన్యం తెలిపిందని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి హాల్‌టికెట్లు జారీ చేసేందుకు అనుమతించామని బోర్డు తెలిపింది. 48 మంది విద్యార్థుల జాబితాతో మంగళవారం తమ వద్దకు కాలేజీ యాజమాన్యం వచ్చిందని బోర్డు వెల్లడించింది. వారిలో 11 మంది ఫస్టియర్ కాగా మిగిలిన వారు సెకండియర్ విద్యార్థులున్నారని తెలిపింది. మరో ఘటనలో హన్మకొండకు చెందిన బీఆర్ అంబేడ్కర్ వొకేషనల్ కాలేజీ కూడా మంగళవారం దాదాపు 30 మంది విద్యార్థుల జాబితాతో బోర్డును ఆశ్రయించింది. కాగా, వీరికి గత నెల 20వ తేదీనే ప్రాక్టికల్ పరీక్షలు ముగిశాయి. ఇప్పుడు వీరిని థియరీ పరీక్షలకు అనుమతించినా ఫెయిల్ కిందే లెక్క.. అందుకే వీరిని మేలో జరగనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరవ్వాలని సూచించింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన రెండు కాలేజీల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు స్పష్టం చేసింది.



మంగళవారం రాత్రి ఇంటర్ బోర్డు వద్ద హాల్‌టికెట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

## భద్రత కోసం కేంద్రానికి దరఖాస్తు చేసుకోండి

### రేవంత్‌రెడ్డికి హైకోర్టు సూచన

సాక్షి, హైదరాబాద్: తనకు 4 ప్లస్ 4 భద్రత కల్పించేలా కేంద్రానికి మరోసారి దరఖాస్తు చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డికి హైకోర్టు సూచించింది. రెండు వారాల్లోగా దరఖాస్తు చేసుకుంటే అది అందిన ఆరు వారాల్లో కేంద్ర హోంశాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 4ప్లస్4 భద్రత ఉన్న తనకు తెలంగాణ వచ్చాక టీఆర్ఎస్ ప్రభుత్వం 2ప్లస్2కు తగ్గించిందని, కేంద్ర భద్రత కల్పించాలని 2019 ఆగస్టు 28న కేంద్ర హోం శాఖకు చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉందని పేర్కొంటూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో రిట్ దాఖలు చేశారు.




దీనిపై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పైవిధంగా ఉత్తర్వులు జారీచేసింది. రేవంత్‌రెడ్డికి ఎలాంటి ప్రమాదం లేదని, ఇప్పుడున్న భద్రత సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. కేంద్ర హోం శాఖకు రేవంత్‌రెడ్డి చేసుకున్న దరఖాస్తులో తేదీ లేదని కేంద్ర ప్రభుత్వం తరఫున సహాయ సొలిసిటర్ జనరల్ చెప్పారు.

# రోజుకు 21 మంది

▶ మొదటి పేజీ తరువాయి

మొదటి స్థానంలో ఉండగా, 13,896 మరణాలతో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా 13,255 ఆత్మహత్యలతో పశ్చిమ బెంగాల్, 11,775 ఆత్మహత్యలతో మధ్యప్రదేశ్, 11,561 మరణాలతో కర్ణాటక నిలిచాయి. ఆరో స్థానంలో 8,237 ఆత్మహత్యలతో కేరళ ఉన్నాయి. కాగా, దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ ఈ విషయంలో 2.2 శాతం ఆత్మహత్యల రేటు (4,849 ఆత్మహత్యలు) మాత్రమే కలిగి ఉండటం గమనార్హం.

**రేటు పరంగా చూస్తే..**

ప్రతి లక్ష మందిలో ఎంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారీగా గణాంకాలను చూస్తే తెలంగాణ 5వ స్థానంలో ఉంది. జాతీయ సగటు చూసుకుంటే లక్షమందిలో 10.2 శాతం మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. అండమాన్ నికో బార్‌లో 41, పుదుచ్చేరిలో 33.8, సిక్కింలో 30.2, ఛత్తీస్‌గఢ్‌లో 24.7, కేరళలో 23.5, తెలంగాణలో 21.2 ఆత్మహత్యలతో జాతీయ సగటు కన్నా అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 2016లో తెలంగాణలో ఈ రేటు 24.5 శాతంగా ఉండేది. అక్షరాస్యతలో వెనుకబడిన రాష్ట్రంగా పేరున్న బిహార్ ఈ విషయం లో అట్టడుగున ఉండటం గమనార్హం. ఇక్కడ ఆత్మహత్యల శాతం ప్రతి లక్ష మందిలో 0.4 శాతం మాత్రమే కావడం విశేషం.

### అసలు సమస్య అదే



డిప్రెషన్‌ను గుర్తించకపోవడమే ఆత్మహత్యలకు మూలం. జీవితంలో పైకి వచ్చిన చాలామంది సెలబ్రిటీలు తర్వాత కాలంలో పూర్వపు గుర్తింపు, ఆదరణ దక్కట్లేదనో, తమ సమస్యకు ఎవరూ పరిష్కారం చూపట్లేదన్న కారణాలతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. ఇలాంటివారు సమాజానికి దూరంగా ఒంటరిగా ఉంటారు. నిర్వేదంగా, నిస్తేజంగా మాట్లాడతారు. ఈ లక్షణాలు కనిపిస్తే వారికి తగిన చికిత్స అందించినా.. ఆత్మీయులు, సన్నిహితులు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించే యత్నం చేయాలి.

–డాక్టర్ వీరేంద్ర, సైకాలజిస్ట్

### అవి కాన్‌సంట్రేషన్ క్యాంప్స్



ర్యాంకుల పేరిట స్కూళ్లు, కాలేజీల్లో పిల్లలను కాన్‌సంట్రేషన్ క్యాంపుల్లాంటి హాస్టళ్లలో పెడుతున్నారు. ఒత్తిడిని అలవాటు చేస్తూ, విజయాలను చూపిస్తున్నారే తప్ప.. ఓడిపోతే ఏం చేయాలనేది ఎవరూ నేర్పట్లేదు. ఇలాంటివారు జీవితంలో మంచి ఉద్యోగాలు సంపాదించినా.. వృత్తిగత, వ్యక్తిగత సమస్యలు ఎదురుకాగానే ప్రాణాలు తీసుకుంటున్నారు. అపజయాల నుంచి పాఠాలు నేర్చుకోగలిగే సామర్థ్యం విద్యార్థులకు నేర్పినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుంది.

– డాక్టర్ శారదా, ప్రొఫెసర్ ఉస్మానియా వర్సిటీ

# అగ్గి తెగులుపై వ్యవసాయశాఖ అప్రమత్తం

### వ్యవసాయశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: యాసంగిలో వరి పంటకు సోకిన అగ్గితెగులుపై వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన నివారణ చర్యలను పాటించాలని రైతులకు సూచించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా 37,42,588 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగుచేశారు. ఈ పంట వివిధ దశలో ఉండగా, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అగ్గి తెగులు సోకినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. ఈ అగ్గితెగులు ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉండటంతో, వ్యవసాయ విస్తరణాధికారులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులకు చీడపీడల యాజమాన్యంపై శాస్త్రీయ, సాంకేతిక సలహాలు అందజేయాలని జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం వ్యాధి సోకేందుకు అనుకూల వాతావరణమున్న నేపథ్యంలో శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు.



### సూచనలివే..

- రెతులు నత్రజని ఎరువులు వేయడం కొన్ని రోజులు ఆపాలి. ముందుగా తెగులును నివారించుకొని మళ్లీ మామూలు పరిస్థితులు నెలకొన్నప్పుడు నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో ఎక్కువ దఫాలుగా వేసుకోవాలి.
- నాటిన పొలంలో, గట్ల పైన గడ్డి జాతుల మొక్కలను లేకుండా చూసుకోవాలి.
- మొక్కలలో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు వీలుగా పొలం దమ్ము సమయంలో ఒకసారి, చిరుపొట్ట దశలో మరోసారి పొటాష్ ఎరువును మ్యురేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 10–15 కిలోలు రెండు దఫాలుగా వాడాలి.
- అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్, మాంకోజెట్ మిశ్రమాన్ని 2.5 మి.లీటర్లు, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా యశోప్రతికూలీనే 1.5 మి.లీ. లీటరు నీటిలో, లేదా కసుగామైసిన్ 2.5 మి.లీ /లీటరు నీటితో పిచికారి చేసుకోవాలి.

## కాలుష్య పరిశ్రమలపై కాకి లెక్కలా?

### జీహెచ్‌ఎంసీపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శాస్త్రిపురంలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై సమగ్ర నివేదికను అందజేయాలని జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది. పొంతన లేని వివరాలతో అఫిడవిట్లు దాఖలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈనెల 11న జరిగే విచారణకు హైకోర్టుకు హాజరుకావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2012 నాటి కేసులో ఉన్న కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించింది. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ సమర్పించిన నివేదికల్లో పొంతన లేని అంశాలు ఉండటంపై హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. కోర్టుకు వివరాలు ఇవ్వడంలోనే ద్వంద్వ విధానాలతో ఆటలాడతారా అని ప్రశ్నించింది. ఒక రిపోర్టులో 3 పరిశ్రమలే ఉన్నాయని చెప్పారని, గట్టిగా ప్రశ్నిస్తే 198 పరిశ్రమలు ఉన్నాయని మరో నివేదికలో చెప్పారని ధర్మాసనం తప్పుపట్టింది. కాలుష్య పరిశ్రమలపై తాము న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి జీవీ సుబ్రమణ్యంతో తెప్పించుకున్న నివేదికలో శాస్త్రిపురంలో సుమారు 250 పరిశ్రమలు ఉన్నాయని తమ వద్ద సమాచారం ఉందని వెల్లడించింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ తొలుత మూడే పరిశ్రమలని, నోటీసులందుకున్నాక 198 ఉన్నాయనడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

# 1.60 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వయసు ఆధారంగా అర్హులైన కొత్త పింఛన్‌దారులకు పెన్షన్ కింద రూ.12 వేల కోట్లు, జీతభత్యాలు, సబ్సిడీలు, వడ్డీలకు కలిపి రూ.47 వేల కోట్లు కేటాయింపులు అవసరం అవుతాయి. వీటితో పాటు పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలకు రూ.7,300 కోట్లు, రూ.10 వేల కోట్లు విద్యుత్ రాయితీలు ప్రతిపాదించి మిగిలిన మొత్తాన్ని ఉపకార వేతనాలు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మి, విద్య, సంక్షేమం, హోం శాఖలకు కేటాయించేలా బడ్జెట్ కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి కేసీఆర్ ఆపద్బంధు, కుట్టు మిషన్ల పంపిణీ పథకాలకు మాత్రమే కొత్తగా నిధులుంటాయని, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు, నిరుద్యోగ భృతి లాంటి జోలికి వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. ఈ బడ్జెట్‌ను ఈనెల 8న అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సగటున రూ.27,659 కోట్లు..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ గణాంకాలను పరిశీలిస్తే 2014–15 నుంచి చివరి 2 నెలల్లో సగటున రూ.27,659 కోట్ల ఆదాయం వచ్చింది. 2015 జనవరిలో రూ.38 వేల కోట్లు ఉన్న ఆదాయం మార్చి నాటికి రూ.63 వేల కోట్లకు చేరింది. 2015–16లో కూడా చివరి రెండు నెలల్లో రూ.25 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చింది. తర్వాతి ఏడాది చివరి 2 నెలల ఆదాయం రూ.34 కోట్లు రాగా, 2017–18లో రూ.25 వేల కోట్లకు తగ్గింది. 2018–19లో జనవరి నుంచి మార్చి వరకు రూ.27,610 ఆదాయం వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి వరకు వచ్చిన రూ.1.05 లక్షల కోట్లకు ఆ మొత్తాన్ని కలిపితే రూ.1.33 కోట్లకు పైగా ఈసారి ప్రభుత్వ ఆదాయం ఉండవచ్చన్నది ఆర్థిక శాఖ వర్గాల అంచనా. ఈ ఆదాయానికి కేంద్రం నుంచి ఇచ్చే రుణాలు, ఇతర మార్గాల ద్వారా వచ్చే మరికొంత ఆదాయం కూడా అదనం కానుంది. మొత్తంమీద 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.1.47 కోట్ల అంచనాలతో ప్రభుత్వం బడ్జెట్ పెట్టగా రూ.1.35–1.37లక్షల కోట్ల వరకు మొత్తం ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

**కాగ్ వెల్లడించిన వివరాల ప్రకారం గత ఆరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంచనాలు, ఆ ఏడాది జనవరి నెలలో, మార్చి వరకు వచ్చిన ఆదాయం వివరాలు (రూ.కోట్లలో)**

| సంవత్సరం | అంచనాలు | జనవరి | మార్చి |
|---|---|---|---|
| 2014-15 | 97,563.61 | 38,107.32 | 63,323.29 |
| 2015-16 | 1,11,974.82 | 70,131.93 | 96,051.29 |
| 2016-17 | 1,27,266.59 | 83,505.81 | 1,17,799.40 |
| 2017-18 | 1,44,986.52 | 90,330.81 | 1,15,587.75 |
| 2018-19 | 1,67,859.35 | 97,944.19 | 1,25,554.70 |
| 2019-20 | 1,37,226.53 | 1,05,922.53 | 1,33,491 |

(నోట్: ఇందులో బడ్జెట్ అంచనాలు పన్ను, పన్నేతర రాబడులు, అప్పులు, గ్రాంట్ఇన్ ఎయిడ్‌లు మాత్రమే. ఇతర ఆదాయ వనరులతో పోలిస్తే అంచనాలు ఏటా పెరుగుతాయి. 2019–20లో మార్చి నాటికి ఆదాయం కూడా అంచనా మాత్రమే. గత ఐదేళ్లలో జనవరి నుంచి మార్చి వరకు వచ్చిన ఆదాయాలను లెక్కగట్టి సగటున వచ్చిన మొత్తాన్ని 2020 జనవరి నాటికి వచ్చిన ఆదాయానికి కలిపి అంచనా వేసింది మాత్రమే)

# ఆ రోజు మహిళలకే అంకితం

**ఒక్క చాన్స్, ఒకే ఒక్క చాన్స్. మహిళలకు ఒక సూపర్ ఛాన్స్ వచ్చింది. వారి ఆలోచనల్ని ప్రపంచానికి పంచుకునే అరుదైన అవకాశం ఇది. స్ఫూర్తినిచ్చే మహిళల జీవితాలైనా, అలాంటి మహిళల గురించి తెలిసినవారైనా ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా వారి జీవిత కథల్ని షేర్ చేసే అవకాశం ఇది. దీంతో వారి పోస్టులు క్షణాల్లోనే ప్రపంచవ్యాప్తంగా ప్రధాని ఫాలోవర్లకు చేరిపోతాయ్.**

- స్ఫూర్తినిచ్చే మహిళల జీవిత గాథలు షేర్ చేయండి
- # SheInspiresUs అంటూ పిలుపునిచ్చిన ప్రధాని
- సోషల్ సన్యాసం తీసుకుంటారన్న ప్రచారానికి తెరదించిన మోదీ



సామాజిక మాధ్యమాల నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్టు ట్వీట్ చేసి దేశవ్యాప్త చర్చకు తెరలేపిన ప్రధాని మోదీ అన్ని రకాల ఊహాగానాలకు తెరదించారు. తన సోషల్ మీడియా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను అందరిలోనూ స్ఫూర్తిని నింపే మహిళలకి ఆదివారం అంకితం ఇస్తున్నట్టుగా మంగళవారం మరో ట్వీట్ ద్వారా స్పష్టం చేశారు. 'ఈ మహిళా దినోత్సవాన్ని (మార్చి 8) పురస్కరించుకొని నా సోషల్ మీడియా ఖాతాలను ఏ మహిళల జీవితాలైతే అందరిలోనూ స్ఫూర్తిని నింపుతాయో, వారు చేసే పనులు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయో వారికి అంకితం ఇస్తున్నాను. అలాంటి మహిళల నిజ జీవిత గాథలు లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తాయి' అని ట్వీట్ చేశారు. 'మీరు అలాంటి మహిళ అయినా, లేదంటే అలాంటి స్ఫూర్తిని రగిల్చే మహిళల గురించి మీకు తెలిసినా వారి జీవిత గాథల్ని # SheInspiresUs అన్న హ్యాష్ ట్యాగ్‌తో షేర్ చేయండి' అని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా వచ్చిన పోస్టుల్లో ఎంపిక చేసిన కొన్నింటికి ప్రధాని అకౌంట్ ద్వారా షేర్ చేసే అవకాశం లభిస్తుంది. ఇక యూట్యూబ్‌లో మోదీ అకౌంట్ ద్వారా వీడియోలు పోస్టు చేసే అవకాశం వస్తుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తర్వాత ఆ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా ఫాలోవర్లు ఉన్న రాజకీయనాయకుడు మోదీయే. ఆయనకి ట్విట్టర్‌లో 5.33 కోట్లు, ఫేస్‌బుక్‌లో 4.4 కోట్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో 3.52 కోట్ల ఫాలోవర్లు ఉన్నారు. ప్రధాని కార్యాలయం ట్విట్టర్ ఖాతాను 3.2 కోట్ల మంది ఫాలో అవుతున్నారు.

**విదేశీ మాధ్యమాలను నిషేధించడానికేనా?**

వచ్చే ఆదివారం సోషల్ మీడియా నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్టుగా ప్రధాని ట్వీట్ వెలువడగానే రకరకాల వదంతులు చెలరేగాయి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడానికి మోదీ ట్వీట్ సంకేతమా అని సందేహం వ్యక్తం చేశారు. మరోవైపు స్వదేశీ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించడానికే మోదీ ఈ ట్వీట్ చేసి ఉంటారని ఆరెస్సెస్ నేతలు ఆశగా ఎదురు చూశారు. చాలా కాలంగా మన దేశంలో తయారైన యాప్‌లే వాడాలని డిమాండ్ చేస్తున్నట్టు స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో కన్వీనర్ అశ్వని మహాజన్ తెలిపారు. అయితే మోదీ అభిమానులు ఆయన సోషల్ మీడియా నుంచి వెళ్లిపోతే తామూ బయటకు వచ్చేస్తామంటూ లక్షలాది మంది ట్వీట్ చేశారు. ఐ విల్ ఆల్సో లీవ్ హ్యాష్‌ట్యాగ్ భారీగా ట్రెండ్ అయింది. **– న్యూఢిల్లీ**

### సోషల్ మీడియా హాస్యాలతో సమయం వృథా: రాహుల్

**మో**దీ సామాజిక మాధ్యమాల ద్వారా విదూషకుడి పాత్ర పోషిస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'ప్రియమైన ప్రధాని గారూ, మీ సోషల్ మీడియా అకౌంట్లలో ఒక జోకర్‌లా హాస్యాన్ని పండిస్తూ సమయాన్ని వృథా చేసే బదులు కరోనా సవాళ్లను ఎదుర్కోవడంపై దృష్టి పెట్టండి' అని రాహుల్ మంగళవారం ట్వీట్ చేశారు. వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలో సింగపూర్ ప్రధాని తమ పౌరులను ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగాన్ని రాహుల్ పోస్టు చేస్తూ, ఏదైనా ఇలా చేయాలంటూ ప్రధానికి హితవు పలికారు. నిజమైన నాయకుడంటే సంక్షోభ పరిస్థితుల నుంచి ప్రజల్ని బయటకు తీసుకురావాలని అన్నారు.'ప్రతీ దేశానికి ఆ నాయకుల శక్తి సామర్థ్యాలను పరీక్షించే సమయం వస్తుంది. ప్రస్తుతం భారత్‌లో కరోనా వైరస్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కోవడంలోనే నాయకుల సమర్థత బయటకి వస్తుంది' అని రాహుల్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# రెండో రోజూ.. 'షేమ్' సీన్

- ఢిల్లీ అల్లర్లపై చర్చకు పట్టుబట్టిన విపక్షం; హోలీ తరువాత చర్చిద్దామన్న ప్రభుత్వం
- లోక్‌సభలో స్వల్ప తోపులాట; సభలో వేరే పక్షం వైపు వెళ్తే సమావేశాల నుంచి బహిష్కరిస్తానన్న స్పీకర్



లోక్‌సభలో నిరసన తెలుపుతున్న విపక్ష సభ్యులు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అల్లర్లపై వరుసగా రెండో రోజు పార్లమెంటు ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న, సమర్థిస్తున్న వర్గాల మధ్య ఈశాన్య ఢిల్లీలో జరిగిన తీవ్ర స్థాయి అల్లర్లపై పార్లమెంట్లో చర్చ జరిపేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ.. విపక్షం ఆందోళనను విరమించలేదు.

**లోక్‌సభలో..**

ఢిల్లీ అల్లర్లపై తక్షణమే చర్చ జరగాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్‌సహా విపక్ష సభ్యులు మంగళవారం సభ కార్యకలాపాలను స్తంభింపజేశారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, డీఎంకే సహా పలు విపక్ష పార్టీల సభ్యులు ఢిల్లీ అల్లర్లపై వెంటనే చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ఇవ్వసాగారు. జీరో అవర్‌లో ఈ అంశాలను లేవనెత్తాలని, ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించనివ్వాలని స్పీకర్ కోరినా వారు పట్టించుకోలేదు. మార్చి 11న చర్చ జరుగుతుందని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించినప్పటికీ.. విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇవ్వసాగారు. కొందరు సభ్యులు స్పీకర్ పోడియంకు దిగువన ఉండే సెక్రటరీ జనరల్ స్నేహలత శ్రీవాస్తవ ఎన్‌క్లోజర్‌ను గట్టిగా తట్టడం కనిపించింది. 'దేశ ప్రయోజనాల కోసం మనం పని చేస్తున్నాం. దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని హోలీ పండుగను శాంతి, సౌభ్రాతృత్వాలతో జరుపుకుందాం. ఆ తరువాత మార్చి 11న ఢిల్లీ అల్లర్లపై చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అయినా, గందరగోళం ఆగలేదు. రెండు పర్యాయాలు వాయిదా పడిన అనంతరం, మధ్యాహ్నం సభ మరోసారి సమావేశమైంది. కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌధురి వెల్‌లో అధికార పక్ష సభ్యులు కూర్చున్న వైపు వెళ్లడంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య మళ్లీ గొడవ ప్రారంభమైంది. చౌధురి తరహాలోనే అధికార పక్షంవైపు వెళ్లేందుకు ఇతర విపక్ష సభ్యులు చేసిన ప్రయత్నాలను బీజేపీ సభ్యులు అడ్డుకున్నారు. ఈ సమయంలో అధిర్ రంజన్ చౌధురితో పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ లాకెట్ చటర్జీ గట్టిగా వాదించడం, వారికి కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ సర్దిచెప్పడం కనిపించింది. ఈ సమయంలోనే పలువురు కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఒకరినొకరు తోసుకున్నారు. గందరగోళం కొనసాగడంతో సభను స్పీకర్ బుధవారానికి వాయిదా వేశారు. ఈ గందరగోళం మధ్యనే ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సహకార బ్యాంకులను పటిష్టపరిచేందుకు ఉద్దేశించిన బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.

**రాజ్యసభలో..**

ఢిల్లీ అల్లర్లపై నిరసనల నేపథ్యంలో రెండు పర్యాయాలు వాయిదా పడిన అనంతరం రాజ్యసభ మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ సమావేశమైంది. అప్పుడు, రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ప్రపంచమంతా చర్చిస్తున్న, ఆందోళన వ్యక్తం చేస్తున్న ఢిల్లీ అల్లర్లపై వెంటనే సభలో చర్చ జరపకపోవడం వింతగా ఉందని వ్యాఖ్యానించారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని అధికార పక్ష నేత తావర్ చంద్ గహ్లోత్ ప్రకటించారు. చైర్మన్ వెంకయ్యానాయుడుని సంప్రదించి చర్చ జరిగే తేదీని ప్రకటిస్తామని డెప్యూటీ చైర్మన్ హరివంశ్ తెలిపారు. గందరగోళం కొనసాగుతుండటంతో హరివంశ్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు, ఉదయం ఆర్థిక శాఖకు సంబంధించిన కొన్ని పత్రాలను సభ ముందుంచేందుకు ఆ శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ లేచి నిల్చున్న సమయంలోనూ విపక్ష సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అడ్డుకున్నారు.



సమావేశంలో నడ్డా, అమిత్ షాలతో మోదీ

### 'భారత్ మాతా కీ జై' అంటే నేరమా?

**భా**రత్ మాతా కీ జై అని నినదిస్తే నేరమని కొందరు అంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. 'భారత్‌మాతా కీ జై' నినాదంలోనూ మాజీ ప్రధాని మన్మోహన్‌కు తప్పు కనిపిస్తోందని, ఆ నినాదాన్ని కూడా ఆయన అనుమానంగా చూస్తున్నారని విమర్శించారు. బీజేపీ పార్లమెంటరీ భేటీని ఉద్దేశించి మంగళవారం మోదీ ప్రసంగించారు. 'స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు గడిచాక కూడా.. భారత్ మాతా కీ జై అని నినదిస్తే నేరం అంటున్నారు. అదీ ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి అలా అనడం మరీ దురదృష్టకరం. ప్రతీ దేశభక్తుడు బాధపడే విషయమిది' అని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు కొన్ని శక్తులు పని చేస్తున్నాయని ఆయన విమర్శించారు. సమాజంలో సామరస్యతను పెంపొందించే విషయంలో మార్గదర్శులుగా నిలవాలని ఆయన బీజేపీ ఎంపీలను కోరారు. ఢిల్లీ అల్లర్ల విషయంలో బీజేపీ విమర్శలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ప్రధాని చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



టోర్నడో కారణంగా ముక్కలు చెక్కలైన ఇల్లు

### టోర్నడో విధ్వంసం

**అమెరికాలో 22 మంది మృతి**

**నాష్‌విల్లే:** అమెరికాలోని నాష్‌విల్లేలో టోర్నడోలు బీభత్సం సృష్టించాయి. మంగళవారం ఉదయం టెన్నెస్సీలో వచ్చిన టోర్నడోల కారణంగా 22 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మరికొంత మంది గల్లంతయినట్లు చెప్పారు. దాదాపు 40 భవనాలు నేలమట్టమయినట్లు చెప్పారు. నష్టాన్ని అంచనా వేసేందుకు హెలికాప్టర్ల ద్వారా సర్వే చేస్తున్నారు. స్కూళ్లు, కోర్టులు, విమానాశ్రయాలు మూతబడ్డాయి.

### పార్లమెంట్.. హై అలర్ట్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ప్రాంగణం మంగళవారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భద్రతాదళాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర దాడుల నిరోధక వ్యవస్థ అలర్ట్ అయింది. ఒక ఎంపీ కారు పార్లమెంట్ ప్రాంగణంలోని సెక్యూరిటీ బ్యారియర్‌ను ప్రమాదవశాత్తూ గుద్దుకోవడంతో ఇంత హంగామా చోటు చేసుకుంది. ఉదయం 9 గంటల సమయంలో యూపీలోని కౌశాంబి స్థానం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకర్‌కు చెందిన ఇన్నోవా కారు అనుకోకుండా సెక్యూరిటీ బ్యారియర్‌ను ఢీ కొంది. దీంతో సీఆర్‌పీఎఫ్ దళాలు ఎంపీల ప్రవేశ ద్వారాన్ని స్వాధీనంలోకి తీసుకున్నాయి. 'కారు.. బూమ్ బ్యారియర్‌ను ఢీకొంది. దాంతో, ఆకస్మిక దాడులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన భద్రత వ్యవస్థ అప్రమత్తమైంది' అని సెక్యూరిటీ అధికారి ఒకరు వివరించారు.

### భూమి జలమయం !



**వాషింగ్టన్:** ఒకప్పుడు భూమి పూర్తిగా నీటితో కప్పి ఉండేదని ఓ తాజా అధ్యయనంలో తేలింది. దాదాపు 300 కోట్ల సంవత్సరాల కింద భూమి ఇలాగే ఉండేదని పరిశోధకులు చెబుతున్నారు. ఈ అధ్యయనం ద్వారా భూమిపై ఏక కణజీవులు ఎక్కడ, ఎలా పరిణామం చెందాయో పరిశోధకులు తెలుసుకునే వీలుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పురాతన భూగోళం ఎలా ఉండేదన్న చర్చలకు ఈ అధ్యయనం ద్వారా సమాధానం దొరికినట్లయిందని అమెరికాలోని కొలరాడో వర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ బోస్‌వెల్ వివరించారు. ఆస్ట్రేలియాలోని పనోరమా జిల్లాలో ఉన్న కొండలు, పర్వతాలు ఒకప్పుడు నదీ ప్రవాహాల కారణంగా ఏర్పడి ఉంటాయని అయోవా స్టేట్ వర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జాన్సన్ తెలిపారు.

### అణు కార్యక్రమంపై స్పష్టత ఇవ్వండి

**పారిస్/వియన్నా:** ఇరాన్ అణు కార్యక్రమంపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) తాజాగా మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. అధికారికంగా వెల్లడించని ప్రాంతాల్లో యురేనియం ఆనవాళ్లు లభించడంపై స్పష్టత ఇవ్వాలని ఇరాన్‌ను డిమాండ్ చేసింది. ఐఏఈఏ అధిపతి రఫేల్ గ్రోసి పారిస్‌లో మాట్లాడారు. అణు కార్యక్రమంపై ఇరాన్ ప్రభుత్వం అందించిన ప్రాంతాల్లో కాకుండా వేరే చోట్లా యురేనియం ఆనవాళ్లు దొరికాయన్నారు. ఇరాన్‌లోని తుర్కుజాబాద్ తోపాటు మూడు ప్రాంతాల్లో యురేనియం శుద్ధి జరుగుతున్నట్లు ఐఏఈఏ వెల్లడించిన తాజా నివేదిక పేర్కొంది. 'అణు ఒప్పందం ప్రకారం ఇరాన్ ఏడాదికి 300 కిలోల యురేనియంను వాయురూపంలో నిల్వ ఉంచుకోవచ్చు. కానీ, అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు ప్రకటించాక ఐదు రెట్లు ఎక్కువ యురేనియంను ఇరాన్ శుద్ధి చేసింది' అని తెలిపింది.

### పుల్వామా కేసులో తండ్రి, కూతురు అరెస్టు

**శ్రీనగర్:** గత ఏడాది 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనబెట్టుకున్న పుల్వామా ఘటన విచారణలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కీలక పురోగతి సాధించింది. నిందితులకు జమ్మూలోని ప్రత్యేక న్యాయస్థానం 10 రోజుల రిమాండ్ విధించింది. పుల్వామాలోని హక్రిపొరాకు చెందిన ట్రక్ డ్రైవర్ తౌఫిక్ అహ్మద్ షా, అతడి కూతురు ఇన్షాజాన్(23)లు 2018–19 కాలంలో ఉగ్రవాదులకు చాలాసార్లు ఆహారం, ఇతర వస్తువులను సమకూర్చారు. పాకిస్తాన్ ఉగ్రవాది, పేలుడు పదార్థాల నిపుణుడు అయిన మొహ్మద్ ఉమర్ ఫరూక్, పాకిస్తాన్‌కే చెందిన కమ్రాన్, ఇస్మాయిల్ అలియాస్ ఇబ్రహీం, అలియాస్ అద్నాన్‌లు తౌఫిక్ ఇంట్లోనే బస చేశారు. 'మొహ్మద్ ఉమర్‌తో ఇన్షా జాన్ టెలిఫోన్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తరప్రత్యుత్తరాలు సాగించింది. అతడు చనిపోయే దాకా ఈ సంబంధాలు కొనసాగాయని మా దర్యాప్తులో తేలింది'అని ఎన్ఐఏ తెలిపింది.

# సీఏఏపై సుప్రీంకు ఐరాస



**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఇప్పుడు అంతర్జాతీయ సమస్యగా మారిపోయింది. ఈ విషయంపై తమను కోర్టు సహాయకారిగా నియమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం మంగళవారం సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేయగా.. ఆ చట్టం తమ అంతర్గత వ్యవహారమని భారత్ స్పష్టం చేసింది. ఈ విషయంలో విదేశీ సంస్థల జోక్యానికి తావులేదని తెలిపింది. సీఏఏపై తాము సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు మానవ హక్కుల కమిషనర్ మైకేల్ బాచెలెట్ జరియా సోమవారం జెనీవాలోని భారత దౌత్యకార్యాలయానికి సమాచారం అందించారని, భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అయితే 'సీఏఏ అనేది భారత్ అంతర్గత వ్యవహారం. చట్టాలు చేసేందుకు దేశ పార్లమెంటుకు ఉన్న సార్వభౌమ హక్కులకు సంబంధించిన విషయమిది. ఈ విషయాల్లో విదేశీ సంస్థల జోక్యానికి తావే లేదు' అని అన్నారు.

**అంతర్జాతీయ చట్టాలను పరిగణించాల్సింది**

పౌరసత్వ సవరణ చట్టం అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు, సంప్రదాయాలు, ప్రమాణాలను పరిగణించి ఉండాల్సిందని కాబట్టి ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతూ ఐక్యరాజ్య సమతి మానవ హక్కుల హై కమిషనర్ మైకేల్ బాచెలెట్ జెరియా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఏఏ విషయాల్లో తాను కోర్టు సహాయకుడిగా వ్యవహరించేందుకు అనుమతించాలని కోరారు. మానవహక్కుల ప్రోత్సాహానికి తగిన సలహా సూచనలు ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొంది. ముస్లింలలోని వేర్వేరు తెగల వారిని చట్టం పరిధిలోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించింది. 'వేల మంది శరణార్థులు, వలసదారులకు ఈ చట్టం మేలు చేకూర్చవచ్చు. ఈ చట్టం లేకపోతే సొంత దేశాల్లో హింస నుంచి రక్షణ దొరకదు సరికదా.. పౌరసత్వం దూరమయ్యే అవకాశముంది. అందుకే సీఏఏ ఉద్దేశం ప్రశంసనీయమైంది' అని వివరించారు.

**అల్లర్లలో గాయపడిన టీనేజర్ మృతి**

ఈశాన్య ఢిల్లీ అల్లర్లలో గాయపడిన అకిబ్(18) ఆస్పత్రిలో కన్నుమూశాడు. తన సోదరి పెళ్లి ఏర్పాట్లలో భాగంగా షాపింగ్‌కు వెళ్లిన ఇతడిపై ఫిబ్రవరి 24వ తేదీన దుండగులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అకిబ్‌ను జీటీబీ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అతడు సోమవారం రాత్రి ఆస్పత్రిలో కన్నుమూశాడని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, ఈ అల్లర్లలో 79 ఇళ్లు, 327 దుకాణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా చెప్పారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వచ్చే మెసేజ్‌లపై ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నంబర్ 8950000946ను, ఈమెయిల్ ఐడీ dvscommittee@delhigov.inను అందుబాటులోకి తెచ్చారు. అల్లర్ల ప్రభావిత అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మత పెద్దలతో గురువారం సమావేశం జరపనున్నారు.

# వణికిస్తున్న కోవిడ్...

**న్యూఢిల్లీ:** చైనాలో ఉద్భవించిన కోవిడ్ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికిస్తోంది. 60 దేశాలను చుట్టుముట్టిన ఈ వైరస్ 3,100 మందిని మట్టుబెట్టింది. మరో 90 వేల మందికి సోకింది. చైనాలో 2,943 మృతి చెందగా, వైరస్ నిర్ధారణ అయిన కేసులు 80,151కు చేరాయి. ఆ తర్వాత అత్యధికంగా ఇరాన్‌లో 77 మరణాలు సంభవించగా 2,336 మందికి కోవిడ్ సోకింది. అమెరికాలోనూ ఈ వైరస్‌తో ఆరుగురు మృతి చెందగా, 90 మందికి సోకినట్లు వెల్లడైంది. భారత్‌లో మూడు కరోనా కేసులు బయటపడడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. నోయిడాలోని రెండు ప్రైవేటు పాఠశాలలను 6వ తేదీ వరకు మూసివేశారు. కరోనాను ఎదుర్కోవడానికి అన్ని మంత్రిత్వ శాఖలు అప్రమత్తమయ్యాయని ప్రధాని మోదీ విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో తెలిపారు. ఆగ్రాలో ఆరుగురికి వైరస్ లక్షణాలున్నట్టు అనుమానం వ్యక్తం కావడంతో సప్దర్ జంగ్ ఆసుపత్రిలో ఉంచారు. ఇటలీ నుంచి జైపూర్ వచ్చిన పర్యాటకుడితోపాటు అతడి భార్యకు కూడా వైరస్ సోకినట్టు నిర్ధారణైంది. శ్రీలంక పర్యటన నేపథ్యంలో అక్కడ ఎవ్వరికీ షేక్‌హ్యాండ్ ఇవ్వొద్దనీ, పిడికిలితో మాత్రమే పలకరించుకోవాలని ఇంగ్లండ్ క్రికెట్ టీం కెప్టెన్ జోయ్ రూట్ తన సహచరులకు సూచించాడు.

**ప్రముఖ కంపెనీలు అప్రమత్తం..**

ఏప్రిల్‌లో జరగాల్సిన ఫ్లాగ్‌షిప్ ఓపెన్ వరల్డ్‌ను కోవిడ్ భయంతో వాయిదా వేస్తున్నట్టు ఒరాకిల్ వెల్లడించింది. కాలిఫోర్నియాలో ఏప్రిల్‌లో జరగాల్సిన గ్లోబల్ న్యూస్ ఇనీషియేటివ్ సమిట్‌ను గూగుల్ రద్దు చేసుకుంది. మేలో జరగాల్సిన ఫేస్‌బుక్..ఎఫ్–8 డెవలపర్స్ కాన్ఫరెన్స్, మైక్రోసాఫ్ట్ మెల్‌బోర్న్‌లో తలపెట్టిన 'ఐఓటీ ఇన్ యాక్షన్'' కాన్ఫరెన్స్ రద్దయ్యాయి. అన్ని అనవసర ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నట్లు అమెజాన్, ట్విట్టర్ తెలిపాయి.



సియోల్‌లో మాస్కులు కొనేందుకు బారులు తీరిన జనం

### బైడెన్ X శాండర్స్

**రసవత్తరంగా డెమొక్రాట్ అధ్యక్ష అభ్యర్థిత్వ పోరు**



జో బైడెన్



బెర్నీ శాండర్స్

**వాషింగ్టన్:** అమెరికాలో డెమొక్రాటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిని నిర్ణయించేందుకు ఉద్దేశించిన 'సూపర్ ట్యూజ్‌డే' పోరులో ఓటు వేసేందుకు మంగళవారం లక్షలాది ఓటర్లు బారులు తీరారు. స్థానిక కాలమానం ప్రకారం మార్చి 3న 14 రాష్ట్రాల్లో ఈ ఓటింగ్ జరుగుతోంది. డెమొక్రాటిక్ అభ్యర్థిత్వం కోసం వెర్మాంట్ సెనేటర్ బెర్నీ శాండర్స్, మాజీ ఉపాధ్యక్షుడు జో బైడెన్‌లు ప్రధానంగా పోటీ పడుతున్నారు. అయితే, ఈ పోరులో జో బైడెన్ కీలకమైన ముందంజ వేశారు. సెనేటర్ ఆమీ క్లోబుచార్, ఇండియానా మాజీ గవర్నర్ పీట్ బుట్టిగెగ్‌లు తాము అధ్యక్ష పదవి రేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడమే కాకుండా.. జో బైడెన్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. వీరితోపాటు మరో ఎంపీ బెటో రూర్కీ కూడా బైడెన్‌కు మద్దతు ప్రకటించారు. దీంతో మంగళవారం నాటి కీలకమైన ప్రైమరీ ఎన్నికల్లో బైడెన్ ప్రత్యర్థుల కంటే కొంత ఆధిక్యత సాధించినట్లయింది. డెమొక్రటిక్ పార్టీలోని ఒక వర్గం నాయకులు బెర్నీ శాండర్స్‌కు వ్యతిరేకంగా.. మిగతా అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో బైడెన్ ముగ్గురి మద్దతు కూడగట్టడం విశేషం. అయినప్పటికీ ప్రస్తుతానికి బైడెన్‌కు యువ డెమొక్రాట్లలో మంచి పట్టున్న బెర్నీ శాండర్స్, న్యూయార్క్ మేయర్ మైకెల్ బ్లూమ్‌బర్గ్‌లు ప్రత్యర్థులుగా మిగిలే ఉన్నారు. ఈ ఏడాది మొదట్లో పోటీలోకి దిగిన బ్లూమ్‌బర్గ్ అధ్యక్ష పదవి అభ్యర్థి ఎన్నికల్లో తన సొంత డబ్బు లక్షల డాలర్లు ఖర్చు చేస్తూ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి గట్టి పోటీదారుగా ఎదిగారు. బైడెన్ ఇప్పటివరకూ సౌత్ కరోలినా ప్రైమరీ మాత్రమే నెగ్గారు.



# జీవితాశయాలకే ప్రాధాన్యం

- 89% భారతీయ మహిళల మనోగతమిదే
- తాజా సర్వేలో వెల్లడి

**ముంబై:** జీవితమన్నాక ఒక ఆశయం ఉండాలి. అది సాధించడానికి కష్టపడాలి. అంతిమంగా ఆ లక్ష్యాన్ని చేరుకోవాలి. వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యతనిస్తూనే కెరీర్‌లో అత్యున్నత స్థాయికి చేరుకోవాలి. ఇదీ మన భారతీయ మహిళల మనోగతం.. మహిళా ఉద్యోగుల్లో 89శాతం మంది తమకంటూ ఆశయం ఉండాలని, అదే అత్యంత ముఖ్యమని చెప్పారని అమెరికన్ ఎక్స్‌ప్రెస్ , న్యూయార్క్‌కు చెందిన మహిళా సంస్థ యాంబిషియస్ ఇన్‌సైట్స్ సంయుక్త సర్వే వెల్లడించింది. జీవితంలో ఒక ఆశయాన్ని పెట్టుకొని దానిని సాధించడం అంత సులభమేమీ కాదు. అందులో ఎన్నో కోణాలుంటాయి. వృత్తిపరమైన విజయాలు, ఆర్థిక స్వాతంత్య్రం, నైపుణ్యం, వ్యక్తిగత ఆరోగ్యం, పిల్లల పెంపకం, కుటుంబ బాంధవ్యాలు పటిష్టంగా ఉండడం వంటివన్నీ అందులో మిళితమై ఉంటాయి. వీటన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ అటు వృత్తిపరంగా, ఇటు వ్యక్తిగతంగా అద్భుతమైన ఫలితాలు సాధించాలన్న తపన భారతీయ మహిళల్లోనే ఎక్కువగా ఉందని అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకింగ్ కార్పొరేషన్ ఇండియా సీఈఓ మనోజ్ అద్లాఖా అన్నారు. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని వారికి అవకాశం వస్తే తాము అనుకున్నది సాధించి ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తారని ఆయన కొనియాడారు.

**సర్వే ఇలా..**

విశ్వవిద్యాలయాల్లో చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న 21–64 ఏళ్ల మధ్య వయసున్న 3,026 మంది మహిళల్ని ఆన్‌లైన్ ద్వారా సర్వే చేశారు. గత నెల జనవరి 10–16 మధ్య జరిగింది. భారత్ అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, మెక్సికో, యూకేలలో సర్వే నిర్వహించారు.

| ఆశయ సాధనలో.. | |
|---|---|
| భారత్ | 89% |
| మెక్సికో | 82% |
| అమెరికా | 68% |
| ఫ్రాన్స్ | 41% |
| జపాన్ | 28% |

| వ్యక్తిగత అంశాల్లో.. | |
|---|---|
| భారత్ | 91% |
| ప్రపంచ సగటు | 68% |

| కెరీర్‌లో.. | |
|---|---|
| భారత్ | 78% |
| మెక్సికో | 69% |
| అమెరికా | 44% |
| జపాన్ | 17% |

సాక్షి
బుధవారం, మార్చి, 4

# నకిలీ 'శాంతి ఒప్పందం'

హడావుడి ఒప్పందాలు, చిత్తశుద్ధిలేని ఎత్తుగడలు ఒక జటిలమైన సమస్యకు పరిష్కారం చూపలేవని అఫ్ఘానిస్తాన్‌లోని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. తాలిబన్‌లతో 'శాంతి ఒప్పందం' కుదుర్చుకుని నిండా మూడు రోజులు గడవకుండానే అఫ్ఘానిస్తాన్ మళ్లీ బాంబు పేలుళ్లతో దద్దరిల్లుతోంది. అక్కడ యథాప్రకారం సైనిక బలగాలపైనా, సాధారణ పౌరులపైనా దాడులు కొనసాగుతున్నాయి. తగవులో మూడు పక్షాలున్నప్పుడు ఆ మూడూ ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటే, తమ మధ్య ఒక అవగాహన కుదిరిందని ప్రకటిస్తే దాన్ని ఎంతో కొంత విశ్వసించవచ్చు. కానీ ఈ శాంతి ఒప్పందం అలాంటిది కాదు. అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లో అక్కడి ప్రభుత్వంతో, ఖతార్‌లోని దోహాలో తాలిబన్‌ల ఆధ్వర్యంలోని ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘానిస్తాన్(ఐఈఏ)తో వేర్వేరుగా అమెరికా కుదుర్చుకున్న ఒప్పందమిది. దీని ప్రకారం ఆ దేశం నుంచి మరో 14 నెలల్లో అమెరికా దళాలు, నాటో దళాలు పూర్తిగా వైదొలగవలసివుంటుంది. తక్షణం 4,000మంది అమెరికా సైనికులు ఇంటి ముఖం పడతారు. ఆ దేశానికే చెందిన మరో 8,600మంది సైనికులు, నాటో సైనికులు 39,000మంది కూడా క్రమేపీ తగ్గుతూ వచ్చి, చివరకు నిష్క్రమిస్తారు. ఈ ఒప్పందంలో భాగంగా అఫ్ఘాన్ ప్రభుత్వం జైళ్లలో వున్న 5,000మంది తాలిబన్ ఖైదీలను విడుదల చేయాల్సివుంటుంది. దానికి బదులుగా తమ అధీనంలోని వేయిమందికి ఈ నెల 10లోగా తాలిబన్‌లు స్వేచ్ఛ కల్పిస్తారు. మిగిలినవారిని మే నెలాఖరుకు విడిచిపెడతారు. అప్పటికల్లా తాలిబన్‌లపై ఐక్యరాజ్యసమితి విధించిన ఆంక్షలు తొలగించడానికి అమెరికా చర్యలు మొదలు పెడుతుంది. ఆగస్టుకి అవి రద్దవుతాయి. పైపైన చూస్తే ఇందులో ఎవరికీ అభ్యంతరం అనిపించదు. పద్దెనిమిదేళ్లుగా ఆ దేశాన్ని సంరక్షించే సాకుతో అక్కడ తిష్ట వేసిన అమెరికా, నాటో బలగాలు స్వస్థలాలకు పోతాయంటే వద్దనేవారుండరు. కానీ అమెరికా ఇప్పటికిప్పుడు హడావుడిగా ఎందుకు తొందరపడిందో, అందుకు బదులుగా తాలిబన్‌ల నుంచి అది పొందిన హామీలేమిటో తెలిస్తే అందరూ నిర్ఘాంతపోతారు. ఈ ఒప్పందానికి ప్రతిఫలంగా తాలిబాన్‌లు చేయాల్సిందల్లా అల్–కాయిదాతో చెలిమిని విడనాడటం. దాంతోపాటు వారు మరో హామీ కూడా ఇచ్చారు. అమెరికా ప్రయోజనాలకు ముప్పు కలిగించేవారికి వారు ఆశ్రయం ఇవ్వరు. అలాగే అమెరికాకు ప్రమాదకరంగా పరిణమించవచ్చని అనుమానం వచ్చిన అఫ్ఘాన్ వాసుల్ని దేశం విడిచివెళ్లకుండా చూసే బాధ్యత కూడా తాలిబన్‌లదే. వారికి బయటి దేశాలకు వెళ్లడానికి వారు ఎలాంటి పత్రాలూ జారీ చేయరు. అమెరికా శత్రుగణంతో చేతులు కలపొద్దని తమ సభ్యులకు స్పష్టంగా ఆదేశాలిస్తామని కూడా వారు హామీ ఇచ్చారు. స్వీయ రక్షణ కోసం ఇంతగా తంటాలు పడిన అమెరికా, మనతోపాటు అఫ్ఘాన్ ఇరుగుపొరుగు దేశాల భద్రత కోసం ఒక్క షరతు కూడా విధించలేదు.

ఒకటా, రెండా... వరసగా పద్దెనిమిదేళ్లుగా అఫ్ఘాన్‌ని చెరబట్టిన అమెరికా ఇంత హడావుడిగా ఇలాంటి ఒప్పందం ఎందుకు కుదుర్చుకుందన్నది బహిరంగ రహస్యమే. ముంచుకొస్తున్న దేశాధ్యక్ష ఎన్నికల్లో వరసగా రెండోసారి విజయం సాధించాలంటే ఇది అవసరమని డోనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. తాను అధ్యక్ష పీఠం ఎక్కితే అఫ్ఘాన్‌లోని అమెరికా సైనికులందరినీ వెనక్కి తీసుకొస్తానని గత ఎన్నికల్లో ట్రంప్ హామీ ఇచ్చారు. దాన్ని ఏదోమేరకు నెరవేర్చినట్టు చూపాలని ఇంచుమించు ఏడాదిగా ఆయన తాపత్రయపడుతున్నారు. మొండిగా వ్యవహరిస్తున్న తాలిబన్‌లతో దాదాపు పదిసార్లు చర్చలు విఫలమయ్యాక దిక్కుతోచని స్థితిలో ట్రంప్ ఈ ఒప్పందానికొచ్చారు. అయితే ఒక అంశంపై ఇద్దరితో వేర్వేరు ఒప్పందాలు కుదిరినప్పుడు కనీసం రెండింటిలోనూ ఒకే రకమైన అంశాలుండాలి. అప్పుడే దాన్ని ఒక ఒప్పందంగా పరిగణించవచ్చు. అది ఏదో ఒకమేర ఫలప్రదమవుతుంది. తాలిబన్‌లతో కుదిరిన ఒప్పందంలో 5,000మంది తాలిబన్ ఖైదీల విడుదలకు పూచీ పడే క్లాజు వుంది. కానీ అఫ్ఘాన్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఆ మాట లేదు. అందుకు బదులు 'బందీల విడుదలకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను తాలిబన్‌లూ, ప్రభుత్వమూ నిర్ధారించుకోవాల'ని చెబుతోంది. పొంతన లేని ఈ మాటలే ఇప్పుడు సమస్యాత్మక మయ్యాయి. చర్చల తర్వాతే ఖైదీలను విడుదల చేస్తామని ఘనీ సర్కారు... విడుదల చేస్తేనే చర్చలకొస్తామని తాలిబన్‌లు భీష్మించుకున్నారు. అది నెరవేరలేదన్న సాకుతో హింసాకాండకు దిగడం మొదలెట్టారు. అమెరికా తల్చుకుంటే అష్రాఫ్ ఘనీని దారికి తేవడం కష్టం కాదు. ఆయన తన మాట వినడనుకుంటే ఘనీ పదవి ఊడగొట్టేందుకు కూడా అమెరికా వెనకాడదు. కానీ తేలాల్సిన వేరే అంశాలు చాలా వున్నాయి.

ప్రపంచంలో తమది ప్రాచీన ప్రజాస్వామిక దేశమని చెప్పుకునే అమెరికాకు ఏమాత్రం ఇంగిత జ్ఞానం వున్నా అఫ్ఘాన్‌లో మహిళల కనీస హక్కుల పరిరక్షణకు తాలిబన్‌లిచ్చే హామీ ఏమిటో తేల్చుకునేది. తమ ఏలుబడిలో షరియా పేరు చెప్పి మహిళలను తాలిబన్‌లు ఎలా అణిచేశారో ఎవరూ మర్చిపోలేరు. వారిని విద్యకూ, ఉద్యోగాలకూ పూర్తిగా దూరం చేశారు. మతం పేరిట వారిపై అనేక అణచివేత చర్యలకు పూనుకున్నారు. ప్రస్తుత ఒప్పందం మహిళల హక్కుల రక్షణ గురించి పూర్తిగా విస్మరించింది. అలాగే దేశంలో పష్తూన్, తాజిక్, హజారా తెగల కోర్కెల విషయంలోనూ ఒప్పందం మౌనమే పాటించింది. మరి ఆచరణలో అఫ్ఘాన్‌కు ఒరిగేదేమిటి? అటు అల్–కాయిదా, ఇటు ఐఎస్ ఉగ్రవాద బృందాలు తాలిబన్‌ల ఒప్పందాన్ని తప్పుబడుతున్నాయి గనుక అవి తమ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఈ పరిస్థితిని వినియోగించుకుంటాయి. ఏతావాతా పాకిస్తాన్ ఆసరాతో అమెరికా కుదుర్చుకున్న ఈ ఒప్పందం అఫ్ఘాన్ సమస్యల్ని పరిష్కరించదు సరికదా...దాన్ని మరింత జటిలం చేస్తుంది. అది సహజంగానే మన దేశ భద్రతకు కూడా ముప్పుగా పరిణమిస్తుంది. అఫ్ఘాన్‌పై దురాక్రమణకు దిగడంలో చేసిన తప్పునే అక్కడినుంచి నిష్క్రమించడంలోనూ అమెరికా ప్రదర్శిస్తోంది. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి శు.నవమి ఉ.8.47 వరకు తదుపరి దశమి, నక్షత్రం మృగశిర ఉ.6.47 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం ప.3.14 నుంచి 4.53 వరకు, దుర్ముహూర్తం ప.11.47 నుంచి 12.32 వరకు అమృతఘడియలు... రా.8.54 నుంచి 10.29 వరకు.

**సూర్యోదయం :** 6.22
**సూర్యాస్తమయం:** 6.02
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# బడుగు వర్గాలకు బాబు ద్రోహం

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

తెలుగుదేశం అధినేత చంద్రబాబు కుటిల రాజకీయ చాణక్యానికి కాలం చెల్లింది. ఆయన వేసే ఎత్తుగడలు, కుతంత్రాలు, చేసే మాయా మర్మాలు సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోతున్నాయి. అయినా ఆయన ఇంకా వాటినే నమ్ముకున్నారు, అమలుచేస్తున్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో జరిగిన ఈఎస్‌ఐ కుంభకోణం బయటపడి అందులో... చంద్రబాబు క్యాబినేట్‌లో మంత్రులుగా పని చేసిన అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణల ప్రమేయం ఉందని వెల్లడి కాగానే... ఉలిక్కిపడిన చంద్రబాబు 'వారు బీసీలు కనుకనే ఆరోపణలు చేస్తున్నారు. బీసీలంటే సీఎం జగన్మోహన్‌రెడ్డికి పడదు' అంటూ పాత పల్లవినే కొత్త రాగంలో అందుకున్నారు. ఐదేళ్ల తన పాలనలో బీసీ, ఎస్సీ, మైనారిటీలతో సహా అనేక వర్గాలను దూరం పెట్టి, వారిని దూరం చేసుకొన్నది స్వయంగా చంద్రబాబే! దూరమైన వర్గాలను దగ్గర చేసుకోవడానికి తాపత్రయపడుతున్న చంద్రబాబు... సీఎం వైఎస్ జగన్‌పైన, రాష్ట్ర ప్రభుత్వపైన పసలేని ఆరోపణలతో బురద జల్లడానికి యధాశక్తి ప్రయత్నిస్తున్నారు. ఏ నాయకుడికి లేనివిధంగా ప్రతి చిన్న అంశాన్ని కులం కోణంలో చూడటం చంద్రబాబుకు అలవాటు. చట్టానికి కులం, మతం, ప్రాంతం ఉంటాయా? తప్పు చేసిన వారిని కులం దృష్టితో చూసి వదిలి వేసే విధానం భారతీయ శిక్షాస్మృతిలో గానీ, రాజ్యాంగంలో గానీ ఉన్నదా? ఈ విషయాలు చంద్రబాబుకు తెలియక కాదు. బడుగు బలహీన వర్గాలను తన రాజకీయ ఆయుధాలుగా, తన రక్షణ కవచాలుగా ఉపయోగించుకోవడానికి అలవాటు పడ్డ చంద్రబాబు ఈఎస్‌ఐ కుంభకోణంలో తన సహచర నాయకుల ప్రమేయం ఉన్నదని తెలియగానే వారి కులాన్ని తన రాజకీయ ప్రయోజనానికి వాడుకోవడానికి సిద్ధపడ్డారు.

### బాబు 'బీసీ' థియరీ

బలహీనవర్గాలను రాజకీయంగా ఉపయోగించుకోవాలి కానీ వారు రాజకీయంగా సాధికారత సాధించరాదన్నది చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తుంది. తాజా ఉదంతాన్ని పరిశీలిస్తే... స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం, ఎస్సీలకు 19.08 శాతం ఎస్టీలకు 6.77 శాతం మొత్తం 59.85 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీర్మానం చేసి ఆ మేరకు జీవో జారీ చేసింది. హైకోర్టు దీనిపై అభ్యంతరం తెలపలేదు. కానీ... తెలుగుదేశం పార్టీ నేత అయిన బి. ప్రతాపరెడ్డి అనే వ్యక్తి దానిపై సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో... తొలుత 'స్టే' ఇచ్చిన సుప్రీంకోర్టు.. ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర హైకోర్టులో నిర్ణయం జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. చివరకు హైకోర్టు అన్ని రకాల రిజర్వేషన్లు 50 శాతం మించరాదని రూలింగ్ ఇవ్వడంతో బీసీలకు వర్తింపజేయాలనుకున్న కోటాలో 9.85 శాతం కోత పడి బీసీలకు వేలాది సంఖ్యలో పదవులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. బీసీలకు మరోమారు అన్యాయం చేయడానికి టీడీపీ పాల్పడిన అనైతిక చర్య బయటపడగానే తమకు అలవాటైన రీతిలో 'దొంగే దొంగ దొంగ...' అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వమే పనిగట్టుకొని బీసీ రిజర్వేషన్లను తగ్గించే ప్రయత్నం చేసిందంటూ పచ్చ మీడియాతో బురద జల్లిస్తున్నారు.

### బీసీలంటే బాబుకు చులకన

బీసీ వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకోవడమే తప్ప... బీసీలను అన్ని రంగాలలో ప్రోత్సహించి, గౌరవించి వారికి సాధికారత కల్పించాలన్న ఆలోచన చంద్రబాబుకు ఏనాడు లేదు. ఈఎస్‌ఐ కుంభకోణంలో చిక్కుకొన్న తన పార్టీనేతలు బీసీలు కనుకనే... వారిని ఇరికించారని మాట్లాడిన చంద్రబాబు ఒకసారి గతంలోకి తొంగి చూడాల్సిన అవసరం ఉంది. 2000వ సంవత్సరంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న కృష్ణాయాదవ్ 'తెల్గీ స్టాంప్‌ల' కుంభకోణంలో చిక్కుకొన్నాడని తెలియగానే... క్షణం కూడా ఆలస్యం చేయకుండా.. సీఎంగా ఉన్న చంద్రబాబు అతనిని మంత్రి పదవి నుంచి తప్పించాడు. పైగా, ఎంతో సాహసోపేతంగా వెంటనే చర్య తీసుకున్నట్లుగా పత్రికల్లో రాయించుకున్నారు. కృష్ణాయాదవ్ బీసీ నేత అయినా తప్పుచేశారు కనుక ఉపేక్షించలేదు. ఆ ధర్మం ఇప్పుడు వర్తించదా? వందలాది కోట్ల విలువైన స్కామ్ జరిగితే.. కులాన్ని చూసి నిందితులను వదిలిపెట్టాలా? తన ప్రభుత్వంలో ఒక ధర్మం... వేరొకరి ప్రభుత్వంలో మరో ధర్మం ఉంటుందా? కులం కార్డును బాబు తనకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకుంటాడో చెప్పడానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే.

2004లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికలో డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభంజనంలో తెలుగుదేశం ఓటమి పాలయిన తర్వాత... బీసీ కులాలను దగ్గర చేసుకోవడానికి ప్రతిపక్షనేతగా చంద్రబాబు 2007లో వరంగల్‌లో 'బీసీ గర్జన' పేరిట భారీ సభ నిర్వహించారు. ప్రధాన బీసీ వర్గాల వారి సమక్షంలో జరిగిన ఆ సభలో బీసీలకు



తెలుగుదేశం పార్టీ 33 శాతం మేర.. అంటే 100 పార్టీ టిక్కెట్లు కేటాయిస్తుందంటూ ఓ డిక్లరేషన్ రూపొందించి అందరి హర్షధ్వానాల మధ్య దానిని ఆమోదించారు'. రెండేళ్ల తర్వాత, అంటే... 2009 ఎన్నికలలో చంద్రబాబు అర కొరగా బీసీలకు సీట్లు ఇచ్చి యధావిధిగా బీసీలను మోసం చేశారు. బీసీలు ఆర్థికంగా బలహీనులు కనుక వారికి 33 శాతం టిక్కెట్లు ఇచ్చినా గెలవలేరంటూ సాకు చూపి మరీ మోసం చేశారు. 1999లో ఆనాడు కేంద్రంలోని వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీని చేరమని బీజేపీ కోరింది. అయితే ఎంపీలుగా ఉన్న కె. ఎర్రన్నాయుడు, అల్లాడి రాజ్‌కుమార్ మొదలైన బీసీ నాయకులు కేంద్ర మంత్రులయితే... తన ఇమేజ్ తగ్గిపోతుందనే ఏకైక కారణంతో 29 మంది లోక్‌సభ సభ్యుల బలం ఉన్నప్పటికి ఎన్డీయే ప్రభుత్వంలో చేరకుండా బయట నుంచి సపోర్టు చేస్తాం అనే పేరుతో సరిపెట్టారు. కాగా, 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో చేరడానికి సిద్ధపడి, సీనియర్, సమర్థుడు అయిన బీసీ నేత కొనకళ్ల నారాయణను పక్కన పెట్టి... ఒకటి అశోకగజపతి రాజుకు, రెండోది జూనియర్ అయిన సుజనా చౌదరికి కట్టబెట్టి... బీసీలకు చంద్రబాబు మరోసారి అన్యాయం చేశారు.

### బీసీల పట్ల బాబు వ్యతిరేక వైఖరి

2014 ఎన్నికలలో నరేంద్రమోదీ, పవన్‌కళ్యాణ్‌ల బలంతో స్వల్ప ఓట్ల వ్యత్యాసంతో అధికార పీఠం ఎక్కిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో అడుగడునా బలహీనవర్గాల వ్యతిరేక వైఖరిని నిసిగ్గుగా బహిర్గతపర్చారు. న్యాయమూర్తులుగా పని చేయడానికి బీసీ వర్గాల అభ్యర్థులు పనికిరారంటూ బాబు రాసిన లేఖ బహిర్గతమైనప్పుడు... ఆయన అసలు స్వరూపం ఏమిటో ప్రజలకు అవగతమైంది. అదే విధంగా, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సచివాలయానికి వచ్చిన బలహీనవర్గాల ప్రతినిధులను సీఎం హోదాలో చంద్రబాబు బెదిరించిన వైనాన్ని ఎవ్వరూ మర్చిపోలేరు. పార్టీలో సీనియర్ నేతగా, నిజాయితీపరుడిగా పేరు తెచ్చుకొన్న దళితనేత మోత్కుపల్లి నర్సింహులుకు గవర్నర్ పదవి ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోదీని అడుగుతున్నానంటూ ప్రచారం చేసి... చివరకు చంద్రబాబు ఆయనకు అన్యాయం చేశారు. రాజ్యసభ సీటును ఎగ్గొట్టడానికి ఆయనకు గవర్నర్ పదవి ఆశ చూపి... చివరకు ఏదీ లేకుండా ఆయనంతట ఆయనే పార్టీ నుంచి నిష్క్రమించే పరిస్థితుల్ని చంద్రబాబు కల్పించారు. దళితులంటే చంద్రబాబుకు ఏ పాటి గౌరవమో చెప్పడానికి ఈ ఉదంతం చాలదా? తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వున్న మరో దళిత నాయకుడు జె.ఆర్. పుష్పరాజ్‌ను బయట కుర్చోబెట్టి... చంద్రబాబు తన చాంబర్ లోపల ఓ పారిశ్రామికవేత్తతో బేరం కుదుర్చుకొని ఆయనకు రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టారంటూ... ఆ పార్టీ నేతలే ఇప్పటికీ బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు. వైఎస్సార్‌సీపీ మీద గట్టిగా విమర్శలు చేయించడానికి ఉపయోగించుకొన్న పార్టీ దళితనేతల్లో ఒకరైన వర్ల రామయ్యకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తున్నామని ప్రకటించి, తీరా.. ఆయన తన ఇంటినుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకునే సమయానికి జాబితాలో ఆయన పేరును తప్పించి సొంత సామాజికవర్గానికి చెందిన కనకమేడల రవీంద్రకుమార్‌కు రాజ్యసభ పదవి ఇవ్వటం పట్ల తెలుగు సమాజం ఆనాడు నిర్ఘాంతపోయింది.

అమరావతి కాంతుల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూముల్లో 5 శాతం మొత్తాన్ని బడుగు బలహీన వర్గాలకు కేటాయిస్తామంటూ చట్టం తెచ్చిన చంద్రబాబు ఐదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు దానిని అమలు చేయలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు, బలహీనవర్గాలకు న్యాయం చేయడానికి ఆ ప్రాంతంలోని 1250 ఎకరాలను 54 వేల కుటుంబాల వారికి పంచిపెట్టడానికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టగానే... చంద్రబాబు దానిని అడ్డుకోవడానికి కొందరితో న్యాయస్థానంలో కేసులు వేయిస్తున్నారు. చంద్రబాబుకు బలహీన వర్గాల మీద అభిమానం వుంటే పట్టాలిచ్చే కార్యక్రమాన్ని అడ్డుకొంటారా?

### దేహంలో అంతర్భాగమే

దివగంత నేత మాజీ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి బడుగు బలహీన వర్గాల వారిని సమాజమనే దేహంలో అంతర్భాగంగానే పరిగణించారు. వారి సాధికారతకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేశారు. పలు వెనుకబడిన కులాలను బీసీ జాబితాలో చేర్పించి... వారికి న్యాయం చేశారు. వైఎస్సార్ ఏనాడూ కుల, మత రాజకీయాలు చేయలేదు. ఆయన చూపిన బాటలోనే ఆయన వారసుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ బడుగు బలహీనవవర్గాలకు క్యాబినెట్ కూర్పు మొదలుకొని అన్నింటా సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది చూసి ఓర్వలేని చంద్రబాబు ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కులం రంగు పులమాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. జరగబోయే మున్సిపల్, పంచాయితీ ఎన్నికలలో లబ్ధి పొందడానికి చంద్రబాబు తనకు తెలిసిన పాత విద్యలనే మళ్లీ ప్రయోగిస్తున్నారు. చంద్రబాబు అవినీతి, ఆశ్రిత పక్షపాతంపట్ల ప్రజలు ఇచ్చిన తిరుగులేని తీర్పు మరోసారి పునరావృతం కావాలి. ప్రజలు విజ్ఞులు. ఆ విజ్ఞత మరోసారి చాటాలి. చంద్రబాబు బడుగు బలహీన వర్గాల వ్యతిరేక వైఖరికి శాశ్వత సమాధి కట్టాలి.

వ్యాసకర్త మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ప్రభావితం



"మన జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేసిన ధీరోదాత్త మహిళల గురించి పదిమందికీ తెలియజేయడానికి ఈ మహిళా దినోత్సవం సందర్భంగా తన సామాజిక మాధ్యమ ఖాతాలను ఇస్తున్నట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. నా జీవితంలోనూ అలా స్ఫూర్తినిచ్చిన విశిష్ట మహిళలు చాలామందే ఉన్నారు. వారిలో కొందరు... సుధా భరద్వాజ్, ఇందిరా జైసింగ్, సోనమ్ కపూర్, షహీన్ బాగ్ మహిళలు, జకియా జాఫ్రి, మెహబూబా ముఫ్తీ, స్వరభాస్కర్, ప్రియ రమణి, నజీబ్ తల్లి ఫాతిమా, ప్రియాంకా గాంధీ, మాయావతి, రొమిల్లా థాపర్"

– దుష్యంత్, న్యాయవాది

### గౌరవం



"మహిళలను గౌరవించడం గురించి మాట్లాడటం కాదు, బీజేపీ ప్రతినిధులు సిగ్గుపడాలి. ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లలో తనపై, తన కుమార్తెలపై లైంగికంగా దాడి చేశారని, తమ దుస్తులను చించేశారని అల్ హింద్ ఆసుపత్రి దగ్గర బాధితులు వాపోయారు. అందరి దృష్టినీ ఆకర్షించాలనుకునే ప్రధాని ఈ నిజాన్ని తెలుసుకోవాలి"

– నగ్మా, కాంగ్రెస్ నేత

### మహిళా దినోత్సవం



"మహిళా దినోత్సవం ఉత్సవాల గురించి ప్రధాని మోదీ ప్రకటించగానే స్వేచ్ఛావాదులు, లౌకికవాదులు ప్రధాని తన సామాజిక మాధ్యమ ఖాతాలను రాణా అయూబ్, బర్ఖాదత్ తదితరులకు ఇవ్వాలని కోరుతున్నారు. దాడులకు పాల్పడటానికి ఇతరులకు ఉత్ప్రేరకంలా పనిచేసిన వారికి ఆయన తన ఖాతాలను ఇవ్వరు"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### రామాయణం



"టీవీల్లో రామాయణం ప్రసారమై 33 ఏళ్లు గడిచాయి. రామాయణం టీవీ సీరియల్ గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా వెంటనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పేరు హఠాత్తుగా గుర్తుకు వస్తుంది. రామాయణం సీరియల్ అంత బాగా ప్రచారం పొందడానికి ఆయన చేసినదెంతో ఉంది. ఆయన మద్దతు లేకపోతే రామానంద సాగర్ దాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేయగలిగేవారు కాదు"

– సధావి ఖోస్లా, రచయిత్రి

### ఆపిల్



"డైనింగ్ టేబుల్‌పైనున్న ఒక ఆపిల్ కోసం ముగ్గురు పిల్లలు పోట్లాడుకుంటున్నారు. వారిని చూసిన తల్లి.. నన్ను గౌరవించేవారికీ, నేనంటే భయపడేవారికీ, నా మాటలకు తలూపేవారికి మాత్రమే ఈ ఆపిల్ దక్కుతుందని చెప్పింది. వెంటనే పిల్లలంతా పదండి బయటికిపోయి ఆడుకుందాం, ఆ ఆపిల్ డాడీకి మాత్రమే ఇస్తుందని అనుకుంటూ వెళ్లిపోయారు"

– హర్ష గోయెంకా, వ్యాపారవేత్త

### ఢిల్లీ కాదు



"కోల్‌కతాలో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ర్యాలీలో గోలీమారో నినాదం చేసిన ముగ్గురిని 24 గంటలు గడిచేలోగా అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు బీజేపీ నేతలు. బెంగాల్‌లో వేషాలేయొద్దన్న సందేశం అర్థమయ్యిందా? మీ దమనకాండకు మేము మౌనప్రేక్షకులుగా ఉండం. మహిషాసుర మర్దిని.. జై దుర్గా మాత"

– మహువా మొయిత్రా, ఎంపీ

# పరీక్షల నిర్వహణ ఓ క్రతువు..!

అక్షరానికి తూకం వేసే కాలం అదే.. పరీక్షాకాలం వచ్చేసింది. మార్చి మొదటి వారంలో ఇంటర్మీడియట్ పరీక్షలు. అవి అయిపోగానే పదో తరగతి పరీక్షలూ ఆ తర్వాత వచ్చే డిగ్రీ, పీజీ తదితర పోటీ పరీక్షలు ఇలా పిల్లల చదువులను పరీక్షలతో కొలుస్తున్నాము. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌లు వెరిసి విద్యార్థులు ఒత్తిడిని జయించి, పరీక్షలు విజయవంతంగా రాయవలసి ఉంది. ఏడాదంతా తరగతుల్లో విని, చదివి, వీటిని మళ్ళీ పునఃశ్చరణతో వార్షిక పరీక్షలలో బాగారాసి మంచి మార్కులు సాధించుకోవాలనే తపనకు తోడు... పాలకులు, అధికారులు, పరీక్ష నిర్వాహకులు మంచి వాతావరణం కల్పిస్తేనే విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఉత్సాహంగా పరీక్షలు రాస్తారు. గతేడాది కొన్ని పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటులో చాలా లోపం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమస్యలు పునరావృతం కాకుండా గుర్తించి పరిష్కరిస్తేనే మంచి ఫలితాలు సాధించబడతాయి. కొన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, పరీక్షలు రాయడానికి, కూర్చోవడానికి బల్లల సౌకర్యాలు లేవు. నేల మీదనే ఆరుబయటనే కూర్చోబెట్టి పరీక్షలు రాసిన సంఘటనలు కోకొల్లలు చూశాం. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే అతి కీలకమైన ఘట్టం పరీక్షలు. అవి నిర్వహించేది పరీక్ష కేంద్రాల్లోనే కాబట్టి, సుమారు 15–20 ఏళ్లు అకుంఠిత దీక్షతో రాత్రింబవళ్లు లెక్కచేయక కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని చదివి తమ భవిష్యత్‌కు బాటలు పరుచుకొనే పరీక్ష కేంద్రాలకు ఎలాంటి కొరత లేకుండా సకల సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత విద్యామండలి అధికారులు, పాలకులపై ఉంది.

పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మదింపు నుండి ఫలితాల ప్రకటన వరకు నిర్వాహకులు, అధికారులు ఓ మహా క్రతువులా భావించాలి. గతంలోనే అనేక తప్పులు దొర్లి విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. ప్రశ్నాపత్రాలను దిద్దే విషయనిపుణులకు సరైన సౌకర్యాలతోపాటు శాస్త్రీయంగా వారికి ఇవ్వవలసినంత మేరకే ప్రశ్నపత్రాలను ఇవ్వాలి. ఇది విద్యార్థుల భవిష్యత్ జీవితాలకు సంబంధించిన అంశమని మరువరాదు. ఈ పరీక్షలు ఒక విద్యార్థులకు మాత్రమే కాదు. వారి తల్లిదండ్రులకు, సమాజానికి, దేశ, రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే రేపటి తరానికి జరుగుతున్నాయన్న విషయాన్ని మరువరాదు. ప్రశ్నపత్రాల, మదింపు విషయంలో నిర్లక్ష్యం ఎంత మాత్రం కూడదు. ప్రధానంగా విద్యార్థులపై ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావాన్ని చూపే తాగునీటి వసతి, మరుగుదొడ్లు, రవాణా సదుపాయం, పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, బల్బులు, కూర్చోవడానికి కుర్చీలు, బల్లలతో పాటు సరైన గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లను కల్పించాలి. విద్యార్థులకు ఇంకో మాట.. మార్కులే ప్రతిభకు కొలమానాలు కాదు. ఈ మార్కుల వేటలో పోటీ ధోరణులను తట్టుకోలేక మధ్య దిగువ, తరగతుల విద్యార్థులు ఫలితాల అనంతరం ఆత్మహత్యలు చేసుకుంటున్న తీరుమారాలి. మార్కులే జీవితం కాదు సుమా! మీ బంగారు భవిష్యత్తుకోసం ఇష్టమైన రంగంలో శ్రమిస్తే గొప్పవాళ్ళుగా ఎదగవచ్చు. మార్కులు ప్రతిభకు కొలమానం అసలే కాదని గమనించాలి. పరీక్షలు రాయబోయే ఏ ఒక్క విద్యార్థీ నిరాశా నిస్పృహలకు లోనుకావద్దు. ఉన్నది ఒక్కటే జీవితం... సంపూర్ణంగా జీవించాలి. చదువులు మనిషికి విలువనద్దాలి. అదే అంతిమలక్ష్యం.

మేకిరి దామోదర్, వరంగల్ । 95736 66650

# రంగుల ప్రపంచానికి విధానమేది?

తెలంగాణ చలనచిత్ర రంగం నూతన విధాన రూపకల్పన చేయాలని ప్రభుత్వం ఆలోచనలు ప్రారంభించింది. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో అంతర్జాతీయ శిక్షణా సంస్థ ఏర్పాటు చేయాలని, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఇతోధికంగా సహకరించాలని తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను స్వాగతించాల్సినదే. తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగిన తొలినాళ్లలో రాచకొండ వద్ద ఫిలిం సిటీ నిర్మించాలని సీఎం కేసీఆర్ ఆలోచించారు. ఎందుకనో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు. మొదటినుంచి తెలుగు సినీ పరిశ్రమలో తెలంగాణ సృజనాత్మకతకు సరైన స్థానం దక్కలేదు. సినిమాల వల్ల తెలంగాణ తన సంస్కృతిని కోల్పోయింది. తెలంగాణ కళారూపాలు నాశనం అయ్యాయి. పాశ్చాత్య సంస్కృతికి కూడా లోనుకాకుండా కొన్ని వందల ఏళ్లు కాపాడుకున్న సంస్కృతి సినీరంగ ప్రభావంతో తన ప్రాభవాన్ని, వైభవాన్ని కోల్పోయింది.

తెలుగు సినిమాల్లో ఎప్పుడూ తెలంగాణ మట్టిని, మనుషుల్ని, జీవితాల్ని, సంస్కృతిని ప్రతిబింబించలేదు. బి నరసింగరావు, గౌతమ్ ఘోష్ లాంటివారు మా భూమి, దాసి, రంగుల కల, మట్టి మనుషులు సినిమాలు తీస్తే అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది కానీ తోటి సోదరులు వారి గొప్పతనాన్ని గుర్తించలేదు. చాలా సినిమాల్లో తెలంగాణ భాష యాస వివక్షతకు గురి అయింది. తెలంగాణలో వడగండ్ల వానలు కురిసినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా చిత్ర పరిశ్రమ నుండి పెద్ద స్పందనలు ఉండవు. హృదయపూర్వకంగా ఒక కళాకారుని కూడా వెన్నుతట్టి ప్రోత్సహించిన సందర్భాలు అతి తక్కువ. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఈ వివక్షతలపై, అసమానతలపై విస్తృత చర్చ జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును దాదాపుగా చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులు పూర్తిగా వ్యతిరేకించారు. చివరికి ఉద్యమనేత కేసీఆర్‌ని, ఉద్యమాన్ని కించపరిచే విధంగా సినిమాలు కూడా వచ్చాయి.

డ్రగ్స్ మాఫియా క్యాస్టింగ్ కౌచ్ అంశాలతోపాటు వారసులతో సినిమాలు నిర్మించి ప్రజల నెత్తిన బలవంతంగా అదే సంస్కృతి యథావిధిగా కొనసాగుతోంది. కోట్ల రూపాయలతో పెద్ద పెద్ద సినిమాలు నిర్మిస్తూ చిన్నచిన్న కళాకారులను దరిదాపుల్లోకి రానివ్వకుండా వారి కనుసన్నల్లో ఎన్నో సినిమాలు ముఖ్యంగా చిన్న సినిమాలు బ్రతికి బట్ట కట్టలేని విధంగా చేస్తూ సినిమా వ్యాపారం కుట్రపూరితంగా సాగుతోంది. అవకాశాలు వస్తే అద్భుతాలు సృష్టించే కళాకారులు తెలంగాణలో ఉన్నారు. సామాజిక మాధ్యమాలు ఇచ్చిన అవకాశంతో అనేక కళారూపాలు కళాకారుల ప్రతిభ ప్రపంచానికి చాటి చెప్పే అవకాశాలు దక్కుతున్నాయి. తెలంగాణ చలనచిత్ర పరిశ్రమ స్వయంగా ఎదిగేలా, నిలబడేలా తెలంగాణ సినిమాకు గౌరవ స్థానం దక్కేలా సమగ్రమైన పటిష్టమైన నూతన చలనచిత్ర విధాన రూపకల్పన జరగాలి. చిన్న సినిమాలు బతకాలి. తెలంగాణతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుండి వచ్చే చిన్నచిన్న కళాకారులకు కూడా అవకాశాలు దక్కేలా ఆయా ప్రాంత ప్రజల సంస్కృతి చరిత్రకు సముచిత స్థానం లభించేలా పాలసీ ఉండాలి. స్థానిక కళాకారులు, రచయితలు, నటీనటులు, సాంకేతిక నిపుణులతో సినిమాలు తీసే విధంగా, విడుదలకు సినిమా హాలు లభించేలా కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలి. నెలకొల్పబోయే శిక్షణా సంస్థలో తెలంగాణ ప్రజా జీవితాన్ని, గ్రామీణ వాతావరణాన్ని సినిమాలుగా, టీవీ సీరియల్స్‌గా మలిచే రచయితలు, కళాకారులు, దర్శకులకు అవకాశాలు దక్కాలి.

అన్నింటికంటే ముఖ్యంగా సినిమా టికెట్ ధరలు తగ్గాలి. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా టికెట్ ధరలను నిర్ధారించాలి. నిజాయితీగా పారదర్శకంగా వ్యాపారం జరిగి ప్రభుత్వానికి ఆదాయం దక్కేలా విధాన రూపకల్పన జరగాలి.

సురేష్ కాలేరు । మొబైల్ : 98661 74474

# అరిషడ్వర్గాలు

పరాధనాపహరణ, పరనారీ సాంగత్యము, సహృజ్జన పరిత్యాగమనే మూడు దోషాలూ మానవుని ధర్మాయుర్దాయ కీర్తులను క్షీణింపజేస్తాయని, కామ, క్రోధ, లోభాలు నరకానికి తెరచిన మూడు ద్వారాలన్న' విదురుని మాటలు యథార్థమని రుజువు చేసిన సంఘటనలను పురాణేతిహాసాలు వర్ణించాయి. పరాయి స్త్రీలను కామించిన పాపానికి కీచకుడు, రావణుడు, సైంధవులకు పట్టిన దుర్గతిని పురాణాలు వివరించాయి. మహావిష్ణువు మీద క్రోధంతో పుత్రుడైన ప్రహ్లాదుని బాధించిన హిరణ్యకశిపుడుకి నరసింహుని చేతిలో సంభవించిన మరణాన్ని భాగవతం ప్రస్తావించగా, విశ్వామిత్రుడు హోమధేనువు నందినిని ఆశించి వసిష్టుని చేతిలో భంగపడిన వైనాన్ని భారతం వర్ణించింది.

విష్ణు అవతారమైన జగన్మోహిని రూప మోహంలో చిక్కుకుని



జ్యోతిర్మయం

అమృతం కోల్పోయిన దానవుల ఉదంతాన్ని భాగవతం, రామలక్ష్మణులను మోహించి ముక్కూ చెవులు ఖండింపబడిన శూర్పణఖ ఉదంతాన్ని రామాయణం వివరించాయి. మదగర్వంతో కౌరవ వంశనాశనానికి కారకుడైన దుర్యోధనుడి కథను, శ్రీకృష్ణుడి మీద పెంచుకున్న ఈర్ష్యాద్వేషాలతో మరణం పొందిన శిశుపాలుడి కథను భారతం చెప్పింది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'విషయముల యందాసక్తి వలన కోరికలు, కోరికలు తీరనప్పుడు క్రోధము, క్రోధము వలన వ్యామోహము, జ్ఞానశక్తి నశించుట, బుద్ధి నాశనము వలన మనుష్యుడు పతనమగునన్న' సత్యాన్ని మానవులు మననం చేసుకుంటూ అరిషడ్వర్గాలను అదుపులో ఉంచుకునే సాధన చేయాలి. భీష్ముడు 'ధృతరాష్ట్రుడిలో అరిషడ్వర్గాలు పుష్కలంగా ఉన్నందునే కౌరవులు సర్వనాశనమయ్యారని, అవి లేనందున విజయం పొందావని' ధర్మరాజుతో పలికిన వాక్కులు జీవన ప్రవర్తనా తీరు మెరుగు పరచుకునేందుకు ఉపకరించే తేనెల మూటలు. 'కుండకు రంధ్రమేర్పడిన వైపు నీరు పోయినట్టే, ఇంద్రియం విషయాసక్తమైన వైపు బుద్ధి క్షీణిస్తుందన్న' విదుర నీతిలోని అంతరార్థం గ్రహించి తామరాకు మీద నీటిబొట్టులా జీవించడం అలవరచుకోవాలి.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 4-3-2020



నో చెప్పడం నేర్చుకోండి
సినిమా పేజీలో...

ఆరు నెలలుగా ఆ ఆహారమే!
సినిమా పేజీలో...



అప్పు సంగతి

# స్వాతికి తెలియదు

**స్వాతికే కాదు.. సీతకు, శ్వేతకూ తెలియదు. పల్లవికి, ప్రవల్లికకూ తెలియదు. బాధ్యతగా ఆమె పప్పుల్నీ, ఉప్పుల్నీ లెక్కగట్టి మూడు పూటలా ఇంటిని నడిపిస్తున్నప్పుడు.. బాధ్యతగా అతడూ అప్పుల్నీ, తప్పుల్ని ఏరోజుకారోజు ఇంటికి రాగానే చీటీలో రాసి ఆమె చేతిలో పెట్టాలి. నెలకోసారి.. పే స్లిప్ చూపించడం కాదు.**

● మాధవ్ శింగరాజు

**ఉ**దయం ఆఫీస్‌కి వెళ్లిన నాన్న సాయంత్రం కొత్త కారుతో ఇంటికి వస్తే పిల్లలు వాకిట్లోకి ఒక్క గెంతు గెంతి 'హే.. కొత్త కారు' అని కారులోకి దూకి కూర్చుంటారు. మరీ చిన్నపిల్లలైతే వెళ్లి స్టీరింగ్ సీట్‌లో కూర్చొని స్టీరింగ్‌ని 'జుయ్ జుయ్'మని తిప్పుతారు. 'మనదేనా నాన్నా'.. పిల్లలు అడిగే మొదటి ప్రశ్న. 'ఎక్కడికెళ్దాం నాన్నా'.. రెండో ప్రశ్న. పిల్లల్ని ఎత్తుకుని బుగ్గలపై ముద్దుపెడుతూ భార్య వైపు చూస్తాడు అతడు. 'మనదే కారు' అంటూ ఒక ముద్దు. 'నువ్వు చెప్పు ఎక్కడికెళదామో' అంటూ ఇంకో ముద్దు. పిల్లలు అడిగినట్లే ఆమెకూ ఒక ప్రశ్న అడగాలని ఉంటుంది. 'ఎక్కడిదండీ కారు?' అని. కానీ అడగదు. అడిగితే, కారు ఎలా ఉందో చెప్పకుండా, కారు ఎలా వచ్చిందో చెప్పమని అడుగుతుందేమిటి' అని భర్త నొచ్చుకుంటాడేమోనని ఆమె భయం. నొచ్చుకుంటాడన్న భయంతో ఆమె అతడిని చాలానే అడగలేదు. పెళ్లయి ఏడెనిమిదేళ్లు అవుతున్నా ఏ నెలలోనూ జీతమెంత అని భర్తను అడగలేదు. జీతంలో కటింగ్స్ ఎన్ని అని అడగలేదు. ఇంట్లోకి ఒకేసారి హైఎండ్ ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, టీవీ.. ఇంకా రెండుమూడు 'చిన్న వస్తువుల్ని' పిల్లల ఆటబొమ్మల్లా భుజాన మోసుకొచ్చినప్పుడు కూడా భుజం మీద నుంచి బరువును దింపిందే తప్ప, దింపాక పెరిగే వాటి బరువు గురించి అతడిని అడగలేదు. 'ఈఎమ్ ఐల్లో తెచ్చా. చిటికెలో అయిపోతాయి' అని



బలవన్మరణం | ప్రదీప్, స్వాతి, పిల్లలు

అన్నప్పుడు కూడా ఎవ్రీ మంత్ శాలరీ కన్నా, ఎవ్రీ మంత్ ఇన్‌స్టాల్‌మెంట్స్ ఎక్కువైపోవు కదా' అని అడగలేదు. అడిగితే అతడు నొచ్చుకుంటాడు.

'చిన్న వస్తువుల్ని' ఇంటికి తెచ్చిన కొన్నాళ్లకే ఓరోజు అతడు ఆమె కళ్లకు గంతలు కట్టి కారులో ఓ పెద్ద ఇంటికి తీసుకెళ్లాడు. గంతలు విప్పాక, కళ్లు నులుముకుని చూసి, అప్పుడు మాత్రం అడిగింది, 'ఎవరిల్లండీ, బాగుంది' అని! 'మనదే!' అనలేదు అతను. 'నీదే' అన్నాడు. 'నీ కోసమే' అన్నాడు. అతడెప్పుడూ అలాగే మాట్లాడతాడు. మాట్లాడ్డం కాదు, నిజంగానే అతడు చేసేవన్నీ ఆమె కోసమే. చేయాలనుకునేవన్నీ ఆమె కోసమే.

'ఇప్పుడున్న ఇంటికే అంత అద్దె కడుతున్నాం. ఈ ఇంటికి ఇంకా ఎక్కువ ఉండదా' అంది.. కొత్త గోడల్ని, కొత్త తలుపుల్ని, కొత్త కిటికీల్ని తడిమి చూస్తూ. పెద్దగా నవ్వి, ఆమె చుట్టూ చేతులు వేసి గాల్లోకి లేపాడు అతడు. 'ఇది మన సొంతిల్లు. నీ కోసం, పిల్లల కోసం కొన్న ఇల్లు' అన్నాడు. 'ఇకనుంచి మనం అద్దె కట్టనక్కర్లేదు' అన్నాడు. 'ఆ కట్టేదేదో మన సొంత ఇంటికి కట్టుకుంటే సరిపోతుంది' అన్నాడు. కట్టుకున్నది సొంతిల్లు అవుతుంది కానీ, నెల నెలా కట్టేది సొంతిల్లు అవుతుందా! ఆ మాటే ఆమె అనబోయింది. అతడు అనని వ్వలేదు. ప్రశ్నలు కట్టిపెట్టు అని ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. అతడి చేతుల్లో ఆమె భద్రంగా ఉంది. ఇంత భద్రత కొత్తింట్లో ఉంటుందా.. పది వేల అద్దెకు బదులు నెల నెలా కట్టే ఇరవై వేల లోన్ కట్టవలసిన ఇంట్లో?! అతడు సంతోషంలో ఉన్నాడు. తన కొచ్చిన సందేహాలన్నీ భర్తకూ వచ్చి ఉంటాయి. అయినా సంతోషంగా ఉన్నాడూ

> గ్యాస్.. ఒక రూపాయి
> అప్పు చేసేముందు ఆమెకు
> ఫోన్ చేసి చెప్పండి.. ఫోన్‌కి
> పది రూపాయలు
> అవుతున్నా సరే!
> ఒక సంతకం పెట్టే ముందు
> ఆమె అనుమతి
> తీసుకోండి.. ఆమె కోసం
> మీరు కొనబోతున్న
> శ్వేత సౌధపు అగ్రిమెంట్
> కాగితాలైనా సరే.

అంటే.. తను వేరుగా సందేహపడాల్సిందేమీ లేదు. కుడికాలు లోపలికి పెట్టింది. పిల్లలు 'ఓ.. ఓ..' అంటూ కొత్తింట్లోని హాల్లోకి, బెడ్‌రూమ్‌లోకి, కిచెన్‌లోకి, బాత్‌రూమ్‌లోకి, బాల్కనీలోకి పరుగులు తీస్తున్నారు. ఎంత పిల్లల్తో పోటీపడి పరుగెత్తలేని కాలమైనా రోజుల్ని, వారాల్ని దాటి నెల దగ్గరికి వచ్చేస్తుంది. నెల తర్వాతి నెలకూ వచ్చేస్తుంది.

'కాస్త టైట్‌గా ఉంది గురూ. వచ్చే నెల రెణ్ణెల్ల ఇంట్రెస్ట్ కలిపి ఇచ్చేస్తా..'

ఆమె వాకిట్లో ముగ్గేస్తోంది. అతడు ఆమెకు వినిపించనంత దూరం వెళ్లి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

ఆఫీస్‌లోనే కాదు, ఇంట్లో ఉన్నప్పుడైనా ఫోన్‌లో ఏ ఉద్యోగం చేస్తుంటే ఆ మాటలే రావాలి. టెకీ అయితే అదేదో జార్గాన్ ఉంటుంది. ఫ్లోచార్ట్లు, డీబగ్, లైఫ్ సైకిల్, టెస్టబుల్ కోడ్.. ఇలాంటి మాటలు రావాలి. డాక్టర్ అయితే రిపోర్ట్స్ అనీ, ఇన్వెస్టిగేషన్ అనీ, మెడికల్ హిస్టరీ అనీ రావాలి. జర్నలిస్ట్ అయితే ప్రెస్‌మీట్ అని, స్కూప్ అనీ, లీడ్ అనీ ఏవో ఉంటాయి. అవి రావాలి. ఇవేమీ కాకుండా టైట్‌గా ఉందనీ, ఒకేసారి రెణ్ణెల్లదీ ఇచ్చేస్తాననీ అంటున్నాడంటే.. అదీ ముంగిట్లో ముగ్గు పడే వేళ నుంచే కొత్తగా 'టైట్ టాక్' మొదలవుతోందంటే.. ఏనాడూ భార్యాబిడ్డల్తో కలిసి కూర్చుని భోజనం చేసే స్థిమితం కూడా లేని అతడు.. త్వరలోనే త్వరగా ఇంటికి రాబోతున్నాడనే! త్వరగా ఇంటికి వచ్చిన ఆ రాత్రి.. తనని చూసి కేరింతలు కొడుతూ నిద్రమానుకున్న పిల్లలతో కలిసి.. తండ్రీ బిడ్డల్ని చూసి మురిసిపోతున్న భార్యతో కలిసి.. భోజనం చేయబోతున్నాడనే! బయటి నుంచి తను తెచ్చిన 'ఫుడ్ ఐటమ్స్'ని అందరి భోజనంలో తలా ఇంత చేర్చి పిల్లలకు, భార్యకు తనే మొదటి ముద్ద తినిపించబోతున్నాడనే!

హైదరాబాద్‌లో శనివారం రాత్రి ఇలాగే ఓ కుటుంబం 'కలిసి భోజనం' చేసింది! అతడు, ఆమె, ఇద్దరు పిల్లలు. ఆరేళ్లొకరికి. ఏడాదిన్నరొకరికి. టెకీ అతను. చిన్న వయసే. పెద్ద కంపెనీలో పని. పెద్ద జీతం. అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. బిజినెస్ చేసి అప్పు తీర్చాలనుకున్నాడు. బిజినెస్ కోసం మళ్లీ అప్పు చేశాడు.

బాగా బతకడం కోసం కాదు ఇవన్నీ. ఇంకా బాగా బతకడం కోసం. చివరికి బతకలేక తనను, కుటుంబాన్ని చంపుకున్నాడు! జీతం అప్పును పుట్టిస్తుంది. అప్పును కట్టలేదు. ఒకట్రెండు వాయిదాలైతే జీతం తీర్చేస్తుంది. అప్పుల్ని, వడ్డీల్ని తీర్చే కెపాసిటీ ఎంత పెద్ద జీతానికైనా ఉండదు. ఆ సంగతి అతడికెవరూ చెప్పలేకపోయారా! ఇంత జరుగుతోందని అతడెవరికైనా చెబితేనే కదా! భార్యకు కూడా చెప్పలేదు. చనిపోతూ తండ్రికి రాసిన ఉత్తరంలో మాత్రం చెప్పాడు. 'స్వాతికి ఇవేవీ తెలియదు నాన్నా..' అని చెప్పాడు! స్వాతి అతడి భార్య. అతడు నొచ్చుకుంటాడని అతడిని ఏనాడూ ఎందుకు, ఎలా అని అడగని భార్య.. 'బతకాలని ఉంది స్వాతీ' అని ఒక్క మాట అని ఉంటే.. బతకలేనంత కష్టం ఏమొచ్చిందో అడిగి తెలుసుకుని ఉండేది. కష్టమో, నష్టమో కలిసే బతుకుదాం అని ధైర్యం చెప్పి ఉండేది. మాటైనా చెప్పకుండా భార్యనీ పిల్లల్నీ తనతో తీసుకుపోయాడు! ●



హైదరాబాద్‌లో ప్రీతి ప్రారంభించిన ఫ్యామిలీ పబ్

# పబ్బిల్లు

**భార్యాభర్త ఇద్దరూ పని ఒత్తిడికి లోనవుతున్నప్పుడు.. రిఫ్రెష్‌మెంట్ మగవాళ్లకు ఎంత అవసరమో ఆడవాళ్లకూ అంతే అవసరం. మానసికోల్లాసం కోసం నగరం దాటి వెకేషన్‌కు వెళ్లడం ప్రతివారమూ కుదిరేపని కాదు. అందుకే పిల్లలు, అమ్మానాన్నలు కలిసి ఇష్టమైన ఆహారం తింటూ, మ్యూజిక్ వింటూ, చేయాలనిపిస్తే డాన్స్‌చేస్తూ తమను తాము రీచార్జ్ చేసుకోగలిగిన 'పబ్'ని తెలుగు వాళ్లకు పరిచయం చేశారు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రీతి.**

''పబ్ అనగానే అది సంస్కారవంతులు వెళ్లకూడని ప్రదేశం అని, ఆడవాళ్లు అడుగుపెట్టకూడదని.. ఇలాంటి గట్టి అభిప్రాయాలు మనలో ఉన్నాయి. 'పబ్' అనేది మద్యం సేవించడానికి వెళ్లే ప్రదేశంగా మాత్రమే మనకు ఒక ముద్ర బలంగా పడిపోయి ఉంది. ఇంతవరకు మన దగ్గర ఫ్యామిలీలకు పబ్‌కు లేకపోవడం వల్ల ఏర్పడిన దురభిప్రాయం ఇది'' అంటారు ప్రీతి.

''ఒక మహిళ తన భర్త, పిల్లలతో సెలవు రోజును ఆహ్లాదంగా గడపగలిగిన ప్రదేశంగా పబ్‌ని తీర్చిదిద్దడమే నా ఉద్దేశం. ఇప్పుడు మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి పెరిగినట్లే ఒత్తిడి కూడా పెరిగిపోయింది. నెలకు యాభై వేలు– లక్ష రూపాయలు సంపాదించుకోవడం కోసం వారమంతా మెదడును ఒడిసిపట్టి పని చేయించక తప్పదు. వారాంతంలో రిఫ్రెష్ కాకపోతే మళ్లీ వారంలో కొత్త ఒత్తిడిని తలకెత్తుకోవడానికి సిద్ధం కాలేరు. అలాంటి వాళ్ల కోసం నా కెరీర్‌లో భాగంగా హైదరాబాద్‌లో నేను ఏర్పాటు చేసుకున్నదే ఈ ఫ్యామిలీ పబ్'' అని చెప్పారామె.

**కొత్త సోపానం**

''నిజానికి ఫ్యామిలీ పబ్ అనే కాన్సెప్ట్ మన దేశంలోకి మూడు దశాబ్దాలవుతోంది. 'షెర్లాక్స్ లాంజ్ అండ్ కిచెన్' పేరుతో 1991లో బెంగళూరులో మొదలైంది. మాది తెలుగు కుటుంబమే అయినా నేను పుట్టింది పెరిగింది బెంగళూరులోనే. ఎంబీఏ బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసిన తర్వాత ఒక యూరోపియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో హెచ్‌ఆర్ స్పెషలిస్ట్‌గా పని చేశాను. మా కంపెనీ కార్యకలాపాలు ఆసియా దేశాల్లో ఏడింటిలో జరుగుతుండేవి. చైనా, థాయ్‌ల్యాండ్‌తోపాటు మా కంపెనీ హెడ్‌క్వార్టర్ ఉన్న జర్మనీకి కూడా వెళ్లాల్సి వచ్చేది. మన దగ్గర వీధి చివర కాఫీ షాప్‌లు ఉన్నట్లు అక్కడ ఫ్యామిలీ పబ్‌లుంటాయి. ఆ దేశాల వర్క్ కల్చర్ మన దగ్గరకు కూడా వచ్చేసింది. పైగా మన దగ్గర మహిళకు ఉద్యోగంతోపాటు ఇంటి పనులు అదనం. మన మగవాళ్లు ఇంటిపనుల్లో సాయం చేయడం నూటికి ఏ పదిళ్లలోనో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కెరీర్‌కు న్యాయం చేసేందుకు శతవిధాల ప్రయత్నిస్తుంటారు ఆడవాళ్లు. నేను పెళ్లి చేసుకుని కోడలిగా హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత నేను గమనించిన విషయం ఇది. పెళ్లయిన తర్వాత కూడా హైదరాబాద్– సింగపూర్‌ల మధ్య ప్రయాణిస్తూ ఉద్యోగం చేశాను. బాబు పుట్టిన తర్వాత ఉద్యోగాన్ని వదిలేశాను. బాబుకి ఇప్పుడు రెండేళ్లు. నేను నా కెరీర్‌ని తిరిగి నిర్మించుకోవడానికి సిద్ధమైనప్పుడు మా ఫ్యామిలీ నడుపుతున్న విద్యాసంస్థలను చూసుకోవడం అనే ఆప్షన్ నా ఎదురుగా ఉంది. అప్పుడు నేను ఫ్యామిలీ మొత్తం సంతోషంగా గడపగలిగిన నైబర్‌హుడ్ పబ్‌ల గురించి చెప్పాను. అప్పుడు మా వారు 'ఆ కాన్సెప్ట్‌ని నువ్వు టేకప్ చేస్తేనే న్యాయం జరుగుతుంది. కానీ ఇది నీకు చాలెంజింగ్‌గా ఉంటుందేమో' అన్నారు. నేనా చాలెంజ్‌ని స్వీకరించి ఈ ఏడాది జనవరి 15వ తేదీన పబ్‌ను ప్రారంభించాను.



తెలుగు రాష్ట్రాల్లో తొలి ఫ్యామిలీ పబ్ స్థాపించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త ప్రీతి

**తొలి అడుగు పడాలి**

పబ్ నిర్వహణ మగవాళ్ల వ్యాపార సామ్రాజ్యం అనేది కేవలం అపోహ మాత్రమే. ఏ రంగమైనా సరే ఆడవాళ్లు అడుగుపెట్టనంత వరకే అది మగవాళ్ల సామ్రాజ్యం. ఆడవాళ్లలో ఒకరు ఒక అడుగు ముందుకు వేస్తే చాలు... ఆమె చూపించిన దారిలో నడవడానికి ఎంతోమంది సిద్ధంగా ఉంటారు. నేను ఈ రంగంలో తొలి అడుగు వేశాను. ఈ రంగంలో మహిళలకు ఉద్యోగావకాశాలు పెరగాలంటే యజమాని స్థానంలో మహిళ ఉంటేనే సాధ్యం. ఏ సంస్థలోనైనా మహిళల మీద వేధింపులు లేని వాతావరణం ఉండాలంటే మహిళా ఉద్యోగుల నిష్పత్తి పెరగాలి. ఇప్పుడు ఆ పనిలోనే ఉన్నాను. ఇప్పుడు నా దగ్గర పాతిక మంది ఉద్యోగులున్నారు. ఈ నెల ఎనిమిదవ తేదీన ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే నుంచి ఫ్యామిలీ పబ్‌లో మహిళా ఉద్యోగులు ఉంటారు.

'ఆడవాళ్లు మీకు ఈ ఉద్యోగాలెందుకు? ఫలానా ఉద్యోగాలు చూసుకోండి' అని తీర్పులిచ్చేస్తోంది మగసమాజం. అవకాశాలను ఆడవాళ్ల ముందు పెట్టాలి. ఉపయోగించకోవడం, ఉపయోగించుకోకపోవడం ఆడవాళ్ల ఇష్టమై ఉండాలి'' అన్నారు ప్రీతి. మగవాళ్లు తీర్పు చెప్పడం ఎలా ఉంటుందంటే... ఒక సినిమాకి రివ్యూ రాసేటప్పుడు 'ఇది ఆడవాళ్ల సినిమా' అని మగవాళ్లే నిర్ణయించేస్తుంటారు. తమకు నచ్చే సినిమా ఏదో నిర్ణయించుకునే అవకాశాన్ని కూడా ఆడవాళ్ల చేతిలో ఉంచరన్నమాట. ఆ ధోరణి నుంచి మన సొసైటీ బయట పడాలి. అందుకు ఒక సాహసోపేతమైన అడుగు వేశారు ప్రీతి.

– వాకా మంజులారెడ్డి

### రాత్రి రెండు వరకు

**నే**ను కోరుకుంటున్నట్లు యాభై శాతం ఉద్యోగాలను మహిళలతో భర్తీ చేయడం సాధ్యమేనా... అనే సందేహం వచ్చిన మాట నిజమే. అయితే మేము నిర్వహించనున్న మూడు రోజుల ఫ్రీ వర్క్‌షాప్‌కి పేర్లు నమోదు చేసుకున్న వాళ్లలో గృహిణులు కూడా ఉన్నారు. డీజే, ఆర్టిస్టులు కూడా మహిళలే ఉంటారు. నేను పెట్టుబడి పెట్టి నిర్వహణ బాధ్యత ఉద్యోగుల మీద వదిలేయడం లేదు. కౌంటర్ నుంచి కిచెన్ వరకు అన్నీ స్వయంగా పర్యవేక్షిస్తాను. వీకెండ్స్‌లో రాత్రి రెండు గంటల వరకు కూడా పబ్‌లోనే ఉంటాను. ఇది కార్యక్షేత్రం. నేనిలా ఉండగలుగుతున్నాను కాబట్టి మహిళాఉద్యోగులకు కూడా భరోసా ఉంటుంది. మల్టీ క్విజిన్ రెస్టారెంట్‌లో చెఫ్‌లు, ఫ్రంట్ ఆఫీస్, స్టీవార్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్స్ ఇప్పించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను. నేను సమాజంలో ఒక మెట్టు మంచి స్థానంలో ఉన్నాను. నా వంతుగా మరికొంత ఆడవాళ్లకు ఉపాధి కల్పించడం నా బాధ్యత.

– ప్రీతి, షెర్లాక్స్ లాంజ్ అండ్ కిచెన్ నిర్వహకురాలు

ఇంటిప్స్

## శుచిగానే ఉందా మీ కిచెన్?

**వంటగది.. ఇంటి కలిమి, లేమితోపాటు ఇంట్లో వాళ్ల శుభ్రత, క్రమపద్ధతిని కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే వంట గది విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కొన్ని మార్పులు, చేర్పులు చేసుకోవాలి. కొన్ని జాగ్రత్తలూ పాటించాలి.**

- వంటగదిలోకి తగినంత సూర్యరశ్మి, గాలి ప్రసరిస్తుండాలి. సూర్యకిరణాలు ప్రసరిస్తుంటే బొద్దింకలు, ఎలుకలు, చిన్న చిన్న కీటకాల వంటివి అనేకం దూరంగా ఉంటాయి.
- స్టవ్ పెట్టే ప్లాట్‌ఫామ్ మీద కానీ నేల మీద కానీ నూనె మరకలు, ఆహారపదార్థాల అవశేషాలను ఎప్పటికప్పుడు తుడిచేయాలి. ఆహార పదార్థాలను అలాగే వదిలేస్తే అవి బ్యాక్టీరియాకు ఆవాసాలవుతాయి.
- కిచెన్ బిన్‌లను రోజూ శుభ్రం చేయాలి. అందులోని వ్యర్థాలను పారేయడంతో సరిపెట్టుకోకుండా డస్ట్‌బిన్‌ను రోజూ శుభ్రంగా కడగాలి. లేకపోతే వేస్ట్‌బిన్‌తోపాటు సన్నటి కీటకాలు వంటగదిలో ప్రవేశిస్తాయి.
- సింక్‌లో అర కప్పు ఉప్పు చల్లి నిమ్మ చెక్కతో రుద్ది పది నిమిషాల సేపు అలాగే వదిలేసి ఆ తర్వాత స్క్రబ్బర్‌తో గట్టిగా రుద్ది కడిగితే మరకలు పోయి సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.
- వంటగదిలో పాత్రలను దించడానికి, చేతులు తుడుచుకోవడానికి వంటి అవసరాలకు ఉపయోగించే హ్యాండ్ టవల్స్ ఎప్పుడూ శుభ్రంగా ఉండాలి. వాటిని డిటర్జెంట్‌తో ఉతికిన తర్వాత వేడినీటిలో ముంచి తీసి, బాగా ఎండ తగిలే చోట ఆరేయాలి. వాడిన టవల్స్‌ను తడిపి సింక్‌లో వదిలేయడం వంటిది ఆరోగ్యకరమైన అలవాటు కాదు.



- కటింగ్ బోర్డ్, చాకులను వారానికి ఒకసారి వేడి నీటిలో వేసి శుభ్రం చేయాలి.
- కూరగాయలను తరగడానికి చెక్క కటింగ్ బోర్డు వాడడం మంచిది. ప్లాస్టిక్ కటింగ్ బోర్డు మీద తరిగినప్పుడు కూరగాయలతోపాటు చిన్న ప్లాస్టిక్ రేణువులు కూడా ఆహారంలో కలుస్తాయి. ఇది ఆరోగ్యకరం కాదు.
- కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద వెనిగర్ చల్లి తుడిస్తే బ్యాక్టీరియా నశిస్తుంది. ఇది రసాయన రహితమైనది, సహజమైనది, ఆహారంలో ఉపయోగించదగినది కావడంతో దీని వాడకం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

మ్యూజిక్ మాయావి

# వెనకే వెళ్లిపోతాం

**ఎవరైనా అందుబాటులో ఉన్న వనరులతోనే తమ అభిరుచుల అందలాలకు సోపానాలు వేసుకుంటారు. కానీ, ఢిల్లీకి చెందిన 'ఆర్చీ జె' అనే పాతికేళ్ల యువతి తన గాత్రానికి పాశ్చాత్య సంగీత పరికరమైన బ్యాగ్‌పైప్‌ను నేపథ్యవాద్యంగా చేసుకుని ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సంగీత ప్రియుల్ని మాయావిలా బుట్టలో వేసుకుంటోంది.**

**మ**నదేశంలో బ్యాగ్‌పైప్‌ను నేర్పించేందుకు శిక్షకులెవరూ లేరు. ఆర్చీ కొన్ని పుస్తకాలు, ఆన్‌లైన్ వీడియోల ద్వారా బ్యాగ్‌పైప్‌ను ప్లే చేయడం నేర్చుకుంది. పాశ్చాత్య సంగీతంతో భారతీయ శైలిని మేళవించి మ్యూజిక్ అల్బమ్స్ చేసింది. 2018లో 'ఇండియాస్ ఫస్ట్ ప్రొఫెషనల్ ఫిమేల్ బ్యాగ్‌పైపర్' అవార్డును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకుంది. ఇవన్నీ పెద్దగా సమయం తీసుకోకుండానే జరిగిపోయాయంటే కారణం.. ఆర్చీ ప్రతిభ, ఆర్చీ స్వరజ్ఞానం. ఒకసారి టీవీలో వస్తున్న విదేశీ ఆర్మీ కవాతులో బ్యాగ్‌పైప్ ఉపయోగించడం చూసింది. దాని శబ్దం ఆమెకు విపరీతంగా నచ్చింది. దీంతో ఆ పరికరం గురించి తెలుసుకోవడం ప్రారంభించింది. బ్యాగ్‌పైప్ పరికరాన్ని తెప్పించుకుంది. అయితే దాంతో ఎలా సాధన చేయాలి అనేది పెద్ద ప్రశ్న. ప్రపంచం నలుమూలలలో ఉన్న అనేకమంది నిపుణులైన బ్యాగ్‌పైప్ ఆర్టిస్టులకు మెయిల్స్ పంపింది. ప్రొఫెషనల్ బ్యాగ్‌పైప్ ఆర్టిస్ట్ సీన్ ఫోల్సోమ్ స్పందించి, ఆర్చీకి బోధించడానికి 'ఎస్' చెప్పాడు. సరైన పుస్తకాల గురించి సమాచారం ఇచ్చాడు. ఇది ఆర్చీకి బాగా ఉపయోగపడింది.



### స్నేక్ చార్మర్

**ఆర్చీ తన కళకు 'స్నేక్ చార్మర్' అనే పేరును ఎంచుకుంది. బూరను ఊదుతూ పాములను లొంగదీసుకునే మంత్రగాళ్ల గురించి భారతదేశం అంతటా తెలిసిందే. దేశీయంగా మన వారి నాడిని పట్టుకొని ఆర్చీ తన యూ ట్యూబ్ ఛానెల్‌కు 'ది స్నేక్ చార్మర్' అని పేరు పెట్టి తన బ్యాగ్‌పైప్ సంగీతంతో వీక్షకులకు మంత్రముగ్ధులను చేస్తోంది. ఐదేళ్లలో యూ ట్యూబ్ చానెల్ ద్వారా భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 79 దేశాలలో 4.50 లక్షలకు పైగా సభ్యులను, మిలియన్ల మంది వీక్షకులను సంపాదించుకుంది ఆర్చీ.**

### ఉద్యోగం మానేసింది

ఆర్చీది మధ్యతరగతి కుటుంబం. చదువులో జెమ్. నోయిడా లోని ఏషియన్ స్కూల్ ఆఫ్ మీడియాలో మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసింది. ఆ తరువాత యు.ఎస్.లోని ఓ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అమెరికాకు వెళ్లి తన విధులను నిర్వర్తిస్తూనే పుస్తకాల సాయంతో బ్యాగ్‌పైప్ వాద్యాన్ని ప్లే చేయడం నేర్చుకుంది. రెండేళ్లపాటు సొంతగా సాధన చేస్తున్న ఆర్చీ ఆఫీసుకు సెలవు పెట్టి స్కాట్లాండ్‌లోని గ్లాస్‌గో కు వెళ్లింది. అక్కడ బ్యాగ్‌పైప్ నిపుణులను కలుసుకొని, వారి దగ్గర ఈ కళలోని మరిన్ని మెళకువలు నేర్చుకుంది. వారం తర్వాత తిరిగి ఉద్యోగానికి వచ్చింది. కానీ, బ్యాగ్‌పైప్ మీద తప్ప.. చేస్తున్న పని మీద ధ్యాస లేదు. ఉద్యోగానికి రిజైన్ చేసి, ఇండియాకు వచ్చేసింది.

### మొదటి వీడియోతోనే!

బ్యాగ్‌పైప్‌ను ప్లే చేస్తూ తన గళాన్ని వినిపించిన ఆర్చీ మొట్టమొదటి భారతీయ మహిళగా ప్రసిద్ధి చెందింది. మొదట 'ఎసి డిసి థండర్ స్ట్రక్' అనే ఆస్ట్రేలియా బ్యాండ్ పాటను బ్యాగ్‌పైప్ పరికరంతో ప్లే చేసి ఆ వీడియోను సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. ట్యూన్‌లోని కొత్తదనం వీక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఫలితంగా వీడియో వైరల్ అయ్యింది. దీని తరువాత 'గేమ్ ఆఫ్ థ్రోన్స్, స్టార్ వార్స్, గాడ్ ఫాదర్..' పాటలకు ఆర్చీ తన ట్యూన్లను జత చేయడంతో విశేష ప్రజాదరణ పొందింది. అక్కణ్ణుంచి తన సొంత పాటల కూర్పు వైపు కదిలింది. రెండు నెలల క్రిందట 'ఆస్మాన్ సే' పాటను విడుదల చేసింది. అంతకు ముందు చేసిన 'నగీన' పాటకు 40 లక్షల యాభై వేల వ్యూస్‌ను సంపాదించింది.



– ఆరెన్నార్

epaper.sakshi.com



వరుణ్‌తేజ్

# ఐదు నెలల్లో....

జస్ట్ ఐదు నెలల్లో తెలిసిపోతుంది వరుణ్ తేజ్ ఎలా బాక్సింగ్ చేస్తారో. ట్రైనింగ్ తీసుకుని మరీ బరిలోకి దిగారు. ప్రస్తుతం కెమెరా ముందు బాక్సర్‌గా రెచ్చిపోతున్నారు. తెరపై మనం చూడబోయేది జూలైలో. వరుణ్ తేజ్ హీరోగా నూతన దర్శకుడు కిరణ్ కొర్రపాటి బాక్సింగ్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అసలు సిసలైన బాక్సర్‌లా కనిపించడానికి వరుణ్ ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం వర్కవుట్ చేశారు. అలాగే అమెరికన్ బాక్సింగ్ గోల్డ్ మెడలిస్ట్ టోనీ జెఫ్రిన్ దగ్గర శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి 24న వైజాగ్‌లో మొదలైంది. 25 రోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుంది. జూలై 30న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారట. అల్లు అరవింద్ సమర్పణలో అల్లు వెంకటేశ్, సిద్ధు నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాయి మంజ్రేకర్ (బాలీవుడ్ నటుడు మహేశ్ మంజ్రేకర్ కుమార్తె) హీరోయిన్‌గా నటిస్తున్నారు.



రష్మికా మందన్నా

# ఆరు నెలలుగా ఆ ఆహారమే!

ఆరు నెలల క్రితం రష్మికా మందన్నా ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకనుంచి మాంసాహారం తినకూడదు' అనేది ఆ నిర్ణయం. ఎవ్వరైనా సరే జీవితంలో అప్పుడప్పుడూ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటాం. కానీ అమలు చేసే విషయంలో చాలామంది ఫెయిల్ అవుతుంటాం. మరి.. రష్మికా సంగతి ఏంటి? నియమాన్ని ఫాలో అవుతున్నారా? అంటే.. 'యస్' అనే చెప్పాలి. ఆరు నెలలుగా ఆమె శాకాహారం మాత్రమే తీసుకుంటున్నారట. నిజానికి ఈ బ్యూటీకి నాన్ వెజ్ అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ ఫుల్‌స్టాప్ పెట్టేశారు. హీరోయిన్‌గా ఇప్పుడు 'స్టార్' హోదాలో ఉన్నారు రష్మికా. ఆ హోదా అలా కంటిన్యూ అవ్వాలంటే బాగా నటిస్తే మాత్రమే సరిపోదు... ఫిజిక్ చక్కగా ఉండాలి. కేలరీలు కేలరీలు లోపలికి పంపించేస్తే బరువు పెరగడం ఖాయం. అందుకే శరీరానికి ఎన్ని కేలరీలు కావాలో అన్నే తినడంతో పాటు వెజిటేరియన్ బెస్ట్ అనుకున్నారట. జీవితాంతం శాకాహారిగానే ఉండాలనుకుంటున్నారు. అయితే ఈ బ్యూటీ ఇటీవల మాంసాహారంతో పోజిచ్చిన ఫొటో ఒకటి బయటికొచ్చింది. అది ఓ యాడ్ కోసం ఇచ్చిన పోజ్. అంతే.. ఇక సినిమాల విషయానికొస్తే.. 'భీష్మ' విజయంతో ఫుల్ జోష్‌గా ఉన్న రష్మికా ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కిస్తున్న సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు.

# ఆ వార్త నిజమేనా?



షారుక్ ఖాన్



అట్లీ

కొన్ని నెలల క్రితం చెన్నై కోడంబాక్కమ్‌లో హల్‌చల్ చేసిన ఓ వార్త నిజం అయ్యేట్లు ఉంది. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో హిందీ నటుడు షారుక్ ఖాన్ హీరోగా ఓ సినిమా రూపొందనుందన్నది ఆ వార్త సారాంశం. ఇక అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం అట. ఈ సినిమాను పట్టాలెక్కించడానికి అన్ని సన్నాహాలు పూర్తయ్యాయని తెలిసింది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం షూటింగ్‌ని మొదలుపెట్టాలనుకుంటున్నారట. 2018లో చేసిన 'జీరో' తర్వాత షారుక్ ఇప్పటివరకూ సినిమా కమిట్ కాలేదు. ఎన్నో అంచనాల నడుమ విడుదలైన ఆ సినిమా ఫ్లాప్‌తో షారుక్ కథల విషయంలో ఎక్కువ జాగ్రత్త తీసుకుంటున్నారు. అట్లీ చెప్పిన కథ బాగా నచ్చిందట. తమిళంలో తేరి, మెర్సల్, బిగిల్ వంటి బ్లాక్ బస్టర్స్ ఇచ్చి, మంచి మాస్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీకి హిందీలో ఇది తొలి సినిమా.

# బంగారు తల్లి వచ్చింది

కెరీర్‌పరంగా సెకండ్ ఇన్నింగ్స్‌లో జ్యోతిక జోరు బాగుంది. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళుతున్నారు. గత ఏడాది 'రాక్షసి', 'జాక్‌పాట్' వంటి చిత్రాల్లో నటించారు. అలాగే మరిది కార్తీతో కలిసి 'తంబి' అనే సినిమా చేశారు. ఇప్పుడు జ్యోతిక టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'పొన్‌మగళ్ వందాళ్' (బంగారు తల్లి వచ్చింది అని అర్థం). ఇందులో లాయర్ పాత్ర చేస్తున్నారామె. జ్యోతిక భర్త, హీరో సూర్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జ్యోతిక లుక్‌ని విడుదల చేశారు. ఇదొక థ్రిల్లర్ మూవీ అని సమాచారం. జేజే ఫ్రెడ్రిక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది.



జ్యోతిక



రెజీనా

# నేనేనా?

రెజీనా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'నేనే నా..?!'. 'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. యాపిల్ ట్రీ స్టూడియోస్ బ్యానర్‌పై రాజశేఖర్ వర్మ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రెజీనా ఫస్ట్ లుక్‌ను హీరో వరుణ్ తేజ్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ– ''మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. కార్తీక్ రాజుగారు బాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో రెజీనా ఆర్కియాలజిస్ట్‌గా కనపడతారు. నటిగా ఆమెను మరో యాంగిల్‌లో ఆవిష్కరిస్తున్న చిత్రమిది. ఈ సినిమా కోసం ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుని యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్, కెమెరా: పీకే వర్మ.

# పేర్లు తారుమారు

'సందీప్ ఔర్ పింకీ' అంటే ఎవరైనా ఏమనుకుంటారు? సందీప్ అబ్బాయి పేరు, పింకీ అమ్మాయి పేరు అనే కదా. కానీ ఇక్కడ తారుమారు అయ్యాయి. సందీప్ అంటే అమ్మాయి.. పింకీ అంటే అబ్బాయి. అసలు విషయంలోకి వస్తే... అర్జున్ కపూర్, పరిణీతీ చోప్రా జంటగా 'సందీప్ ఔర్ పింకీ ఫరార్' అనే చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ నెలలోనే సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక పేర్లు గురించి చెప్పాలంటే.. అర్జున్ కపూర్ పాత్ర పేరు 'పింకీ దహియా'. పరిణీతి పాత్ర పేరు 'సందీప్ కౌర్'. దిబాకర్ బెనర్జీ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది.



పరిణీతీ చోప్రా, అర్జున్ కపూర్

# కథ వినకుండా ఓ పిట్టకథ ఒప్పుకున్నా

''చంద్రశేఖర్ యేలేటిగారి దర్శకత్వంలో 'మనమంతా' సినిమా చేశాను. ఆ తర్వాత నాకు సరైన కథ రాలేదు.. దీంతో యేలేటిగారితో ప్రయాణం మొదలుపెట్టాను. ఆ సమయంలో 'ఓ పిట్టకథ' సినిమా గురించి చెప్పి, కథ చాలా బాగుంది.. చేస్తావా? అని అడిగారు. ఆయన మీద నమ్మకంతో కథ వినకుండా ఈ సినిమా ఒప్పుకున్నా'' అన్నారు విశ్వంత్. 'మనమంతా', 'తోలుబొమ్మలాట' ఫేమ్ విశ్వంత్, సంజయ్ రావు హీరోలుగా, నిత్యా శెట్టి హీరోయిన్‌గా చెందు ముద్దు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ పిట్టకథ'. ఈ చిత్రంలో బ్రహ్మాజీ కీలక పాత్ర పోషించారు. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వంత్ మాట్లాడుతూ– ''పిట్టకథ' చిత్రంలో మూడు పాత్రలు ముఖ్యమైనవి. ముగ్గురికీ ఒక్కో పిట్టకథ ఉంటుంది. ఏ పాత్ర ఎలా చెబుతుందనేది వెండితెరపై చూడాల్సిందే. నేను ఇంతవరకు చేసిన పాత్రలు వేరు. 'పిట్టకథ'లో చేసిన క్రిష్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి.. ఈ పాత్రకు పూర్తి న్యాయం చేశాను. 'ఓ పిట్ట కథ' స్క్రీన్ ప్లే నేపథ్యంలో సాగుతుంది. ఆ స్క్రీన్‌ప్లే గేమ్ కొరటాల శివగారికి, మా గురువు చంద్రశేఖర్ గారికి నచ్చింది. 'తెలుగులో ఇటువంటి స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా రావడం కొత్త. 'పిట్టకథ' అంటే చిన్నదికాదు.. పెద్ద కథ' అన్నారు కొరటాల శివగారు. గ్రామీణ నేపథ్యంలో చేశాం కాబట్టి సింపుల్‌గా 'పిట్టకథ' అని టైటిల్ పెట్టాం. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ నాకు మంచి పేరు తీసుకువచ్చాయి.. కానీ, వాణిజ్య పరంగా పెద్దగా వర్కౌట్ కాలేదు. అలాంటి హిట్ కోసం ఎదురు చూస్తున్నాను. ఇటీవల 'కాదల్' అని ఒక సినిమా చేశా.. అది నాకు కమర్షియల్ హిట్ ఇస్తుందనుకుంటున్నాను. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' అనే మరో సినిమా చేస్తున్నాను'' అన్నారు.



విశ్వంత్

# పలాస చూశాక ధైర్యం వచ్చింది - నాగశౌర్య

''పలాస 1978' లాంటి కథలు చేయాలని ఉన్నా లోపల చాలా భయం ఉంటుంది. ఇలాంటి కథలు నిర్మించాలంటే నిర్మాతకు చాలా ధైర్యం ఉండాలి. అయితే ఈ సినిమా చూశాక చాలా ధైర్యం వచ్చింది'' అన్నారు హీరో నాగశౌర్య. రక్షిత్, నక్షత్ర జంటగా కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''నా 40 ఏళ్ల సినీ కెరీర్‌లో 'పలాస 1978' మంచి సినిమా అని నమ్మకంగా చెప్పగలను. ఈ సినిమా పోస్టర్‌పై నా పేరు ఉన్నందుకు గర్వపడుతున్నాను'' అన్నారు. ''తమిళంలో వెట్రిమారన్‌లాంటి దర్శకుల్ని చూసి స్ఫూర్తి పొందుతుంటాం.. కానీ మనకూ అలాంటి దర్శకులున్నారని కరుణ్‌కుమార్ గుర్తు చేశాడు'' అన్నారు దర్శకుడు మారుతి. ''పలాస' నా ఫస్ట్ సినిమాగా చేద్దామనుకోలేదు. నాకు చాన్స్ ఇచ్చిన ప్రసాద్ గారికి, తమ్మారెడ్డి భరద్వాజగారికి రుణపడి ఉంటాను'' అన్నారు కరుణ్‌కుమార్. నిర్మాతలు రాజ్ కుందుకూరి, 'మధుర' శ్రీధర్, సంగీత దర్శకులు రఘు కుంచె, కళ్యాణీ మాలిక్, పాటల రచయిత భాస్కర భట్ల, సిరాశ్రీ తదితరులు మాట్లాడారు.



రక్షిత్ అట్లూరి, నాగశౌర్య, శ్రీవిష్ణు, నక్షత్ర



భానుశ్రీ, రమాకాంత్

# మత్స్యకారుల నేపథ్యంలో...

రమాకాంత్ హీరోగా, భానుశ్రీ ('బిగ్ బాస్' ఫేం), అవంతిక హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సముద్రుడు'. నగేష్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్, శ్రీరామోజు జ్ఞానేశ్వర్, సోములు నిర్మించారు. రమాకాంత్ జన్మదినం సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు వి. సముద్ర విడుదల చేసి, మాట్లాడుతూ– ''నా సినిమాలన్నింటిలో రమాకాంత్ నటించాడు. నగేష్ మంచి ప్రతిభ ఉన్న దర్శకుడు'' అన్నారు. ''చేపలు పట్టే వారి జీవన శైలిపై తీసిన చిత్రమిది. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని సబ్జెక్ట్'' అన్నారు రమాకాంత్. ''నరసింహ'లో రమ్యకృష్ణ పాత్రలా ఇందులో నా పాత్ర ఉంటుంది'' అన్నారు భానుశ్రీ. ''మేలో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు. ''ఈ చిత్రంలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది'' అన్నారు నగేష్ నారదాసి.

# దృశ్యకావ్యం

బుల్లితెరపై తనదైన యాంకరింగ్‌తో ప్రేక్షకుల్ని అలరించిన ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించటం ఎలా?'. మున్నా దర్శకత్వం వహించారు. అమృతా అయ్యర్ కథానాయిక. ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్వీ బాబు నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ పూర్తయింది. ఈ సందర్భంగా ఎస్వీ బాబు మాట్లాడుతూ– ''లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ప్రదీప్ రెండు షేడ్స్ ఉన్న పాత్రలో కొత్తగా కనిపిస్తారు.. ఆయన నటన ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుంది. హీరో–హీరోయిన్ల మధ్య సన్నివేశాలు భావోద్వేగంతో ఉంటాయి. దర్శకునికి ఇది తొలి సినిమా అయినప్పటికీ దృశ్యకావ్యంలా తెరకెక్కించారు. హీరో మహేశ్‌బాబు చేతుల మీదగా ఇటీవల విడుదలైన 'నీలి నీలి ఆకాశం..' పాట సంగీత ప్రపంచంలో ఒక సంచలనం సృష్టిస్తూ యూట్యూబ్‌లో ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్ సాధించింది. ఒక చిన్న సినిమా పాట ఈ స్థాయిలో పాపులర్ కావడం ఈమధ్య కాలంలో మాదే. సంగీతప్రియులు ఈ స్థాయిలో పాటను ఆదరిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: దాశరథి శివేంద్ర.



అమృతా అయ్యర్, ప్రదీప్



వరలక్ష్మీ శరత్‌కుమార్

# నో చెప్పడం నేర్చుకోండి

''కెరీర్ తొలిరోజుల్లో క్యాస్టింగ్ కౌచ్‌కి నో చెప్పాను అని చాలా సందర్భాల్లో నన్ను సినిమాలనుంచి పలువురు దర్శక–నిర్మాతలు దూరం పెట్టారు. కానీ ఇవాళ 25 సినిమాలు పూర్తి చేసుకుని ఇండస్ట్రీలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోగలిగాను'' అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్ గురించి మాట్లాడారామె. ''మహిళలు తమను లైంగికంగా వేధించేవాళ్లను, క్యాస్టింగ్ కౌచ్‌కి అంగీకరించమనే వాళ్ల పేర్లను ధైర్యంగా బయటపెట్టాలి. అవకాశాలు తగ్గిపోతాయనే భయంలో ఉండిపోకూడదు. ఒకవేళ ఆ దారిలో వెళ్లి హీరోయిన్ అవుదామనుకున్నా అది వ్యక్తిగత నిర్ణయం. ఎవరి ఇష్టం వాళ్లది. కానీ ముందు అంగీకరించి ఆ తర్వాత ఫలానా వాళ్లు ఇలా చేశారు అని ఫిర్యాదు చేయకూడదు. కష్టమైనా 'నో' చెప్పడం నేర్చుకోండి'' అన్నారు వరలక్ష్మి.







సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
4-3-2020

సినీ పరివారం

# హాస్య నటులలో నాన్న
# హైహై నాయకా

**రమణారెడ్డి లేకుండా నాటి సినిమాను ఊహించడమా? మంచిగానో చెడ్డగానో ఆయన ఉండాల్సిందే. మిస్సమను, గుండమ్మ కథను, మాయాబజార్‌ను ఆయన పాత్రలు ఎంత మెరిపించాయి. నెల్లూరు యాసకు సినిమాలో యాక్సెప్టెన్స్ తెచ్చిన నటుడు. ఎవరైనా సన్నగా ఉంటే రమణారెడ్డిలా ఉంటాడు... అనే పోలిక ఇప్పటికీ సాగుతూనే ఉంటుంది. సన్నగా ఉన్నా శక్తిమంతమైన పాత్రలు పోషించారు. ఆయన పెద్ద కుమారుడు ప్రభాకర్ రెడ్డి తండ్రి గురించి చెప్పిన విశేషాలు ఇవి.**


ప్రభాకర్ రెడ్డి

నాన్నగారికి మేం ఐదుగురు పిల్లలం. ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. నేను ఇంటికి పెద్ద. నా తరవాత చెల్లాయి వసుమతి, స్వర్ణలత, పద్మావతి, తమ్ముడు శ్రీనివాసరెడ్డి. అల్లుళ్లు ముగ్గురూ డాక్టర్లు. ఇద్దరు మెడికల్ డాక్టర్లు, ఒకరు డాక్టరేట్. నేను, తమ్ముడు ఇద్దరం చెన్నైలోనే ఇంజినీరింగ్ చదివాం. నేను బిటెక్ తరవాత ఎంబిఏ పూర్తి చేశాను. ఎల్ అండ్ టి లో పని చేశాను. అందరం చక్కగా సెటిల్ అయ్యాం. నాన్నగారు 1974లో అల్సర్‌తో బాధపడుతూ కన్ను మూశారు. అదే సంవత్సరం నాన్నగారితోపాటు ఘంటసాల, ఎస్వీఆర్ కూడా తుదిశ్వాస విడిచారు. ఆ మరుసటి సంవత్సరం రేలంగి గారు. మా తల్లిగారు సుదర్శనమ్మ 93 ఏళ్లపాటు జీవించి ఇటీవలే అంటే 2018 అక్టోబరులో నాన్నగారిని చేరుకున్నారు. నాకు ఒకర్తే అమ్మాయి. హైదరాబాద్ ఏఎండిలో పనిచేస్తోంది. అల్లుడు కూడా అదే కంపెనీలో పని చేస్తున్నారు.

**వ్యవసాయ కుటుంబం..**

నెల్లూరు దగ్గర జగదేవిపేట నాన్నగారి జన్మస్థలం. మాది వ్యవసాయ కుటుంబం. తాతగారు నాన్నగారి చిన్నప్పుడే పోవడంతో నాన్న ఇంటర్‌తో చదువు ఆపేశారు. చెన్నై వచ్చాక, సోషల్ లైఫ్ బాగా పెరగటంతో మంచి ఇంగ్లీషు నేర్చుకోగలిగారు. నాన్నగారిది మేనరికం. అమ్మగారిది కోవూరు. నాన్నగారికి ఎప్పుడైనా ఫ్రీ టైమ్ దొరికితే మమ్మల్నందరినీ ఎక్కడికైనా తీసుకువెళ్లేవారు.

**రిజర్వ్‌డ్..**

స్నేహితులతో బాగా మాట్లాడేవారు. ఇంట్లో మాత్రం చాలా రిజర్వ్‌డ్‌గా ఉండేవారు. అప్పుడప్పుడు ప్రివ్యూలకు వెళ్లేవాళ్లం. నాన్నగారు విడిగా, మేమందరం విడిగా వెళ్లేవాళ్లం. అంత రిజర్వ్‌డ్‌గా ఉనా, పిల్లలు అడిగినదేదీ కాదనేవారు కాదు. బాగా బిజీగా ఉన్న రోజుల్లో రోజుకి రెండు మూడు షిఫ్టులు పనిచేయటం వల్ల నాన్నగారు ఇంట్లో చాలా తక్కువసేపు ఉండేవారు. అందుకే మాతో ఎక్కువసేపు గడపటానికి అవకాశం ఉండేది కాదు. ఒకసారి నాన్నని చూడటానికి ఎస్.వి. రంగారావు గారు మా ఇంటికి వచ్చారు. నేను ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చాను. ఆయన నా చేతిలో కాఫీ అందుకుంటూ, 'అబ్బాయి ఏం చేస్తున్నాడు?' అని నాన్నను అడిగారు. ఆయన వెంటనే చెప్పలేక నా వైపు చూశారు. మా చదువు గురించి ఆలోచించలేనంత బిజీగా ఉండేవారు. ఎ

**చిన్న వయసు - పెద్ద పాత్రలు**

చిన్నప్పటి నుంచి నాన్నగారికి నాటకాలు వేయటం సరదా. చదువుకునే రోజుల నుంచే నాటకాలు వేయటం ప్రారంభించారు. ఆ తరవాత సినిమాలలోకి ప్రవేశించారు. నాన్నగారు నటించిన మొదటి సినిమా 'మానవతి'. శంకర్‌రెడ్డిగారు నాన్నగారికి మొదటి అవకాశం ఇచ్చారు. 'చరణదాసి' లో సూర్యకాంతం గారికి కొడుకు వేషం వేశారు. రేలంగి గారి కంటె నాన్నగారు వయసులో కొద్దిగా చిన్నవారే. కాని ఇంచుమించు అన్ని సినిమాలలోను ఆయనకు తండ్రి, మామగారు పాత్రలే పోషించారు నాన్నగారు.

**నాన్న సినిమాలు..**

సాధారణంగా అందరూ విజయవంతమైన సినిమాలలోని పాత్రలనే గుర్తుపెట్టుకుంటారు. ఫెయిల్ అయినవాటిని మర్చిపోతుంటారు. 'గంగ గౌరి సంవాదం' సినిమాలో నాన్నగారు భగ్న ప్రేమికుడు. కృష్ణకుమారి హీరోయిన్. నాన్నగారు చాలా డిఫరెంట్‌గా నటించిన సినిమా అది. ఆ సినిమా అట్టర్ ఫ్లాప్. అది గుర్తుపెట్టుకోలేక పోయారు. 'గుండమ్మ కథ' సినిమాలో నాన్నగారు, రామారావు గారు, సూర్యకాంతం గారు... ఈ ముగ్గురి గురించే మాట్లాడుకునేవారు. అప్పట్లో ఒక సినిమా శతదినోత్సవం జరుపుకుంటే ఘనంగా ఉండేది. జగపతి వారి మొదటి సినిమా 'అన్నపూర్ణ' వేడుకలు విజయ గార్డెన్స్‌లో చేశారు. దానికి నాన్నగారు కొద్దిగా ఆలస్యంగా వచ్చారు. అందరూ ఎదురు వచ్చి తప్పట్లు కొడుతూ వేదిక మీదకు ఘనంగా, సంతోషంగా తీసుకెళ్లారు.

**పొరపాటు జరిగింది..**

నాన్నగారి దగ్గర రాధాకృష్ణమూర్తి అనే ఆయన మేనేజర్‌గా పనిచేసేవారు. ఆయన చాలా నమ్మకస్థుడు. అనుకోకుండా ఒకసారి చిన్న పొరపాటు జరిగింది. ఒకేరోజు మూడు ప్రొడక్షన్స్‌కి కాల్‌షీట్లు ఇచ్చేశారు. మూడు సినిమాలలోనూ పెద్ద నటులతో కలిసి నటించాలి. దాంతో నాన్న ఇరుకున పడ్డారట. అయినప్పటికీ ఆయనను ఏమీ అనలేదట. నాన్నగారు పోయిన రెండో రోజున ఆయన మా ఇంటికి వచ్చినప్పుడు ఈ విషయం చెప్పారు. ఆయనకు నాన్నగారంటే విపరీతమైన అభిమానం.

**అల్లు రామలింగయ్య..**

ఇంజినీరింగ్ ఎక్కడా ఫెయిల్ అవ్వకుండా చదువుకోవటం వల్ల అందరికీ నేను గుర్తుండిపోయాను. నాన్నగారు పోయిన రెండు సంవత్సరాల తరవాత ఆఫీస్ పని మీద హైదరాబాద్ సరోవర్ హోటల్‌కి వచ్చాను. అక్కడ అల్లు రామలింగయ్య గారు నన్ను చూసి పలకరించి, నాన్నగారితో ఉన్న అనుబంధం గురించి చాలా సేపు ముచ్చటించారు. చెన్నైలో ఉన్న రోజుల్లో నేను ఆయనను చాలాసార్లు చూశాను. కాని ఎన్నడూ ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. ఆయన నన్ను గుర్తు పెట్టుకుని, పలకరించారంటే నేను రమణారెడ్డిగారి అబ్బాయిని కాబట్టే కదా!


రమణారెడ్డి

### అకాల భోజనంతో...

చిన్నప్పటి నుంచి నాయనకు అల్సర్లు ఉండేవి. ఆయన వాటిని పెద్దగా పట్టించుకోలేదు. అది అప్పుడప్పుడు బాధిస్తుండేది. అప్పట్లో సరైన వైద్యం కూడా లేదు. మూడు షిఫ్టులు పని చేస్తూండటం వల్ల అకాల భోజనంతో, తరచు ఆరోగ్యం దెబ్బ తినేది. 1968లో ఆపరేషన్ చేయించుకున్నారు. నెలరోజులపాటు కాల్‌షీట్లు తీసుకోలేకపోవటంతో, అవకాశా లు తగ్గిపోయాయి. ఆ తరవాత సినిమాలలో అతిథి పాత్రలలో మాత్రమే నటించారు. అంతకంటె చేయలేకపోయారు. ఆ సమయంలోనే 'మనసు – మాంగల్యం', 'శ్రీమంతుడు' చిత్రాలలో పూర్తి స్థాయి పాత్ర చేశారు. 1974లో అల్సర్ తిరగబెట్టింది. ఆపరేషన్ చేసిన నాలుగు నెలలకు ఆయన కన్నుమూశారు. నాన్నగారు పోయేనాటికి నా వయసు 28 సంవత్సరాలు. కుటుంబ బాధ్యత నాదే. అప్పటికి ఒక చెల్లాయికి మాత్రమే వివాహమైంది.

**మెజీషియన్...**

పాత 'అక్కచెల్లెళ్లు' సినిమాలో నాన్నగారిది మెజీషియన్ పాత్ర. దానికోసం నాన్నగారు మ్యాజిక్ నేర్చుకున్నారు. ఆయనకు మ్యాజిక్ అంటే సరదా ఉండటం వల్ల, ఆ తరవాత చాలా ప్రదర్శనలిచ్చారు. అందుకోసం చాలా డబ్బు ఖర్చు చేశారు. సినిమాల వల్ల డబ్బులు సంపాదిస్తే, మ్యాజిక్ వల్ల డబ్బులు పోగొట్టుకున్నారు. 1957 లో నెల్లూరు టౌన్‌హాల్‌లో మొట్టమొదటి ప్రదర్శన ఇచ్చారు. ఆ రోజున ఘంటసాల గారి కచేరీ కూడా ఉంది. 'ఘంటసాల మ్యూజిక్, రమణారెడ్డి మ్యాజిక్' అని పబ్లిసిటీ ఇచ్చారు. నాన్నగారు చివరి ప్రదర్శన ఢిల్లీలో జరిగింది.

**మంచి స్నేహం..**

నాన్నను అందరూ 'రమణయ్యా' అని ఆప్యాయంగా పిలిచేవారు. ఆ రోజుల్లో స్నేహాలు బావుండేవి. నాన్నగారి స్నేహితులు ఒకాయన ఒక చిత్రంలో నాన్న నటించిన పాత్రకు వచ్చిన పారితోషికం తీసుకుని, 'దీని గురించి నువ్వు నన్ను అడగకు' అన్నారు. ఆ డబ్బులతో హైదరాబాద్‌లో ఒక స్థలం కొని, ఆ కాగితాలను, మిగిలిన డబ్బును మా చెల్లాయి పెళ్లి సమయంలో అందచేశారు. ఆ రోజు నాన్న కళ్లలో కనిపించిన ఆనందాన్ని ఇప్పటికీ మరచిపోలేను. అంత మంచి స్నేహాలుండేవి.

**అదే నంబరు నేటికీ...**

1963 దాకా మా ఇంట్లో ఫోన్ లేదు. మా మొట్టమొదటి ఫోన్ నెంబరు 42537 ఇప్పటికీ అదే నెంబరులోని ఆఖరి మూడు డిజిట్లు కంటిన్యూ అవుతున్నాయి. నాన్నగారిది చాలా సింపుల్ లైఫ్. ఇంట్లో తీరికగా ఉన్నప్పుడు ఆంధ్ర క్లబ్‌కి కాని, టి. నగర్ క్లబ్‌కి కాని వెళ్లేవారు. ఆ సమయంలో డ్రైవర్ రాకపోతే నా సైకిల్ మీద వెళ్లిపోయేవారు.

**అజాత శత్రువు..**

1964 టైమ్‌లో మా పెద్ద నాన్నగారి అబ్బాయి టి. సుబ్బిరామిరెడ్డి (మా నాన్నగారు, వాళ్ల నాన్నగారు అన్నదమ్ములు) కాంట్రాక్ట్‌లు చేస్తున్నారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చారని తెలిస్తే, షూటింగ్ చూడటానికి వచ్చేవారు. ఒకసారి నాగార్జున సాగర్ నుంచి సారథి స్టూడియోకి వచ్చి, 'మా చిన్నాయన రమణారెడ్డిని చూడటానికి వచ్చాను' అని చెప్పారు. నాన్నగారు ఆయనను అందరికీ పరిచయం చేశారు. సుబ్బిరామిరెడ్డి గారికి సినిమాల పరిచయం అప్పుడే కలిగింది. అలా ఆయనకు సినిమాల మీద మోజు బయలుదేరింది. సినిమాలలో ఎన్నో నెగిటివ్ పాత్రలు వేసినా, నాన్నని అందరూ గౌరవించేవారు. ప్రేమించేవారు. నాన్నగారికి అజాతశత్రువు అని పేరు.

– సంభాషణ: **వైజయంతి పురాణపండ**
ఫొటోలు: సురేశ్ కుమార్ ఎ.

బ్యూటిప్స్



- పెరుగులో ముల్తానమట్టి కలిపి ముఖానికి పట్టించి బాగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగితే చర్మంపై మురికి పోయి కాంతివంతంగా కనిపిస్తుంది.
- పెరుగులో పంచదార గాని, ఉప్మారవ్వ గాని కలిపి ముఖానికి పట్టించి మసాజ్ చేస్తే మృతకణాలు తొలగి పోతాయి.
- ఓట్స్‌ని ఉడికించి, మెత్తగా రుబ్బుకోవాలి. అందులో కాస్త నిమ్మరసం కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, అరగంట తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే చెమట వల్ల పట్టిన మురికి తొలగిపోయి, ముఖం కాంతిమంతమవుతుంది.
- జిడ్డుచర్మం అయితే... స్వచ్ఛమైన పసుపులో నిమ్మరసం కలిపి ముఖానికి, మెడకు, మోచేతులకు పట్టించాలి. నిమ్మరసం సహజమైన బ్లీచ్‌గా పనిచేస్తుంది. ఈ ప్యాక్ వేసినప్పుడు కొంచెం మంటగా ఉంటుంది.



- పుదీనా ఆకులను రుబ్బి నీళ్ల కలిపి మాడుకు పట్టించి కొంతసేపటి తరువాత తలస్నానం చేస్తే చుండ్రు సమస్య ఉండదు.
- గుడ్డు తెల్లసొనను తలకు పట్టించి... గంట తరువాత స్నానం చేస్తే చుండ్రు తగ్గుతుంది.
- పెరుగులో ఒక స్పూనుతేనె, రెండు స్పూన్ల నిమ్మకాయ రసం కలిపి తలకి పట్టించి ఒక అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



సీ'రియల్'

# కాకర్ల వంశీకృష్ణ అనే కార్తీక్

**ఈ రోజుల్లో బుల్లితెర అందిస్తున్న అవకాశాలు మెండు. వాటికి తగిన విధంగా తెలుగు వారే కాదు కన్నడ, తమిళ ఆర్టిస్టులూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. ప్రాంతాల అడ్డుగోడలను చెరిపేస్తూ బుల్లితెర అభిమానాన్ని మూటగట్టుకుంటూ ఉంటారు. అలా వచ్చినవాడే కార్తీక్. కన్నడ ఆర్టిస్ట్ అయినా తెలుగు బుల్లితెర నటుడిగా రాణిస్తూ 'మాటే మంత్రం' అంటూ మెప్పిస్తున్నాడు కార్తీక్. కాకర్ల వంశీకృష్ణగా బుల్లితెర ప్రేక్షకులకు ఆకట్టుకుంటున్న కార్తీక్ చెబుతున్న కబుర్లివి..**


కార్తీక్

''వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ మనల్ని మనం నిరూపించుకుంటూ వెళ్లాలి. ప్రతీ పాత్రకు లైఫ్ ఉంటుంది. ఈ పాత్ర అయితేనే చేస్తాను అని ఈ ఇండస్ట్రీలో గిరిగీసుక్కూర్చోనక్కర్లేదు. సినిమాలకు రావాలనే ఆలోచనల్లో ఉండగానే బుల్లితెరపై నటించే అవకాశాలు వచ్చాయి. వాటిని వినియోగించుకుంటూ నన్ను నేను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాను. 'మాటే మంత్రం' సీరియల్ ద్వారా కాకర్ల వంశీకృష్ణగా తెలుగువారి అభిమానం పొందుతున్నందుకు ఆనందంగా ఉంది. చిన్నప్పటి నుంచి ఆరిస్టుగా రాణించాలనే ఆలోచన ఉండేది. అందుకు కాలేజీ రోజుల నుంచే ఆడిషన్స్‌కి వెళ్లడం మొదలుపెట్టాను. బిఎస్సీ పూర్తయ్యాక ఆరునెలల పాటు దాదాపు అన్ని టీవీ ఆడిషన్స్‌కి వెళ్లాను. పుట్టి పెరిగింది అంతా మైసూరులో. కన్నడలో ఖుషి, అక్క, మహాకాళీ, శని.. సీరియల్స్‌లో నటించాను. తమిళంలోనూ ఓ సీరియల్‌లో నటించాను. తెలుగు, కన్నడ, తమిళ నటుడిగా మంచి గుర్తుంపు పొందాలన్నదే నా అభిలాష.

'జీ' తెలుగులో వస్తున్న మాటే మంత్రం సీరియల్‌లో కాకర్ల వంశీకృష్ణగా లీడ్‌రోల్‌లో నటిస్తున్నాను. అన్నీ చెడు అలవాట్లు ఉన్న వ్యక్తిగా ఈ సీరియల్‌లో కనిపిస్తుంటాను. వంశీకృష్ణ దగ్గర పి.ఎగా వసుంధర చేరుతుంది. చాలా మంచి అమ్మాయి. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగల నేర్పు, ధైర్యం గల అమ్మాయి. వంశీకృష్ణకు వసుంధరతో పెళ్లి అవుతుంది. అక్కణ్ణుంచి వంశీకృష్ణలో కుటుంబ విలువలతో కూడిన మార్పు వస్తుంటుంది. ఈ క్రమంలో వచ్చే ఒడిదొడుకులు, మార్పులు.. వంటి అంశాలతో 'మాటే మంత్రం' సీరియల్ నడుస్తుంది. మంచి రేటింగ్‌తో ఉన్న ఈ సీరియల్ రీప్లేసింగ్ ద్వారా నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర దొరికింది.

**అమ్మనాన్నల ప్రేమ**

యాక్టింగ్ అనేది ప్రతి రోజూ కొత్తగానే ఉంటుంది. సీనియర్స్ నటన చూసే కాదు స్క్రీన్‌పై నన్ను నేను చూసుకుంటూ ఇంకాస్త మెరుగుపరుచుకుంటూ ఉంటాను. మొదట ఈ ఫీల్డ్‌వైపు రావడానికి అమ్మనాన్నలు అంతగా ఆసక్తి చూపలేదు. 'చదువుంది, లేదంటే నాన్న చేసే ఫ్యాబ్రిక్ బిజినెస్ చూసుకో' అన్నారు. కానీ, నా ఇష్టాన్ని కాదనలేకపోయారు. అమ్మ గృహిణి. అక్క ఫ్యాషన్ డిజైనింగ్ చేస్తున్నారు. ఇంట్లో ఇప్పుడు నా సీరియల్స్ చూస్తూ 'నెక్ట్స్ ఏమవుతుంది స్టోరీలో' అని అడుగుతుంటారు. చాలా ఆనందంగా అనిపిస్తుంది. టీవీ ఇండస్ట్రీ అంటే నిలకడలేని జాబ్ అన్నారు కానీ, ఎప్పుడూ నన్ను వెనక్కిలాగాలని ప్రయత్నించలేదు. ప్రయత్నించు.. ఏ మాత్రం సౌకర్యంగా లేకున్నా వెనక్కి వచ్చేయ్ అన్నారు. కుటుంబం నుంచి ఫుల్ సపోర్ట్ ఉంటే ఇష్టమైన ఫీల్డ్‌లో హ్యాపీగా రాణించవచ్చు. నా విషయంలో ఇది నిజమైంది. మహాకాళీ, శని సీరియల్స్‌లో నారాయణుడిగా నటించాను. దైవ పాత్రల్లో నటిస్తున్నప్పుడు తెలియని అలౌకిక భావన నన్ను చుట్టుముట్టేది. నారాయణుడి పాత్రకు సంబంధించిన సన్నివేశాలు టీవీలో చూసిన అమ్మనాన్నలు 'ఎంత బాగా చేశావు నాన్నా' అన్నప్పుడు కలిగిన ఆనందం వెలకట్టలేనిది.


'మాటే మంత్రం' సీరియల్‌లోని దృశ్యం

**ఆటలంటే పిచ్చి**

నటనతోపాటు స్పోర్ట్స్ అంటే బాగా పిచ్చి. క్రికెట్, ఫుట్‌బాల్‌ను బాగా ఇష్టపడతాను. కాస్త ఖాళీ సమయం దొరికినా గ్రౌండ్‌లో ఉండేలా చూసుకుంటాను. ఫ్రెండ్స్‌తో కలిసి లాంగ్ డ్రైవ్‌కి వెళ్లడం నాకున్న మరో అలవాటు. కాస్ట్యూమ్స్ కోసం షాపింగ్ చేయడమే కాదు డిజైనర్ డ్రెస్సులకు సంబంధించిన వాటికి అప్పుడప్పుడు మా సిస్టర్ అడ్వైజ్ కూడా తీసుకుంటూ ఉంటాను. నటనలోనే కాకుండా ఒక మంచి కథతో నన్ను నేను నిరూపించుకోవాలని ఉంది. అందుకే సీరియల్ కథ రెడీ చేస్తున్నాను.''

సంభాషణ: **నిర్మలారెడ్డి**

షార్ట్ ఫిల్మ్

# బెల్ నొక్కుతున్నారు... తలుపు తీద్దామా?

**ఆ గదిలో తొమ్మిది మంది స్త్రీలు ఉన్నారు. బయట మరొకరు తలుపు కొడుతున్నారు. ఉన్నవారికే చోటు లేదు. మరి బయట ఉన్నవారికి తలుపు తీయాలా వద్దా?**

టీవీ రావడం లేదు. ఏదో డిస్టబెన్స్. పదహారేళ్ల మూగ అమ్మాయి రిమోట్ పట్టుకొని తిప్పలు పడుతోంది. ఆ గదిలో ఒక సగటు ఇల్లాలిలా కనిపిస్తున్న ఒక స్త్రీ ధూపం వేసి దేవునికి దండం పెట్టుకునే పనిలో ఉంది. ఇద్దరు ముసలి స్త్రీలు పేకాట ఆడుకుంటూ గిల్లికజ్జాలు పడుతున్నారు. వారితో కలిసిన మరో వృద్ధ స్త్రీ కూరగాయలు తరుగుతోంది.

టీవీలో ఏదో చానెల్ తగిలింది. రిపోర్టర్ మాట్లాడుతున్నాడు. 'ఘటన జరిగిన చోటుకు మమ్మల్ని రానివ్వడం లేదు. పరిస్థితి చాలా గంభీరంగా ఉంది. దేశం మొత్తం ఉలిక్కిపడేలా చేసిన ఈ ఘటన'... అని ఇంకా ఏదో చెబుతూనే ఉన్నాడు. కనెక్షన్ కట్ అయ్యింది. ఎవరో రాబోతున్నట్టు చిత్రమైన శబ్దం మొదలైంది. ఆ వెంటనే బెల్ మోగసాగింది.

ముసలాళ్లు చిరాకు పడ్డారు. 'లోపల ఉన్నవాళ్లకే స్థలం చాలడం లేదు. మళ్లీ మరొకరా?' అని.

అవును.. లోపల ఒక బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఉంది. ఒక గ్లామర్ ఫీల్డ్‌లో పని చేసే అమ్మాయి ఉంది. ఒక ముస్లిం స్త్రీ ఉంది. ఒక మెడికో ఉంది. మొత్తం కలిపి తొమ్మిది మంది ఉన్నారు. ఇప్పుడు పదోవ్యక్తి బెల్ కొడుతున్నారు.

'తీద్దాం' అంది గృహిణి.

'ఎవరో ఒకరు బయటకు వెళితేనే మరొకరు లోపలికొచ్చేది' అన్నారు ఎవరో.

'అయితే తక్కువ వయసు వారితో అత్యాచారం అయినవాళ్లు లోపల ఉందాం. ఎక్కువ వయసు ఉన్నవారితో అత్యాచారం అయినవారు బయటకు వెళదాం' అని మెడికో అంది.

'ఈ వేషాలు నా దగ్గర కాదు. మా ఆయన వయసు 50కి పైనే. ఆయనే నన్ను అత్యాచారం చేశాడు' అందొక ముసలావిడ.

'నన్ను ఇద్దరు రేప్ చేశారు. ఇద్దరూ 50 ఏళ్లు పై బడినవారే. అంటే ఇప్పుడు నేను బయటకు వెళ్లాలా?' అంది గృహిణి.

'సరే.. మరి మనలో ఎవరు ఎక్కువ క్రూరంగా చంపబడ్డారో వారు లోపల ఉందాం' అంది మెడికో.

'నన్ను గొంతు కోసి చంపారు' అని ఒకరు, 'నన్ను పీక నులిమి చంపారు' అని ఒకరు, 'నా నెత్తిన రాయి పడేశారు' అని ఒకరు, 'నన్ను బతికుండగానే తగులబెట్టారు' అని ఒకరు.. ఆ గదిలో ఉన్నవాళ్లంతా తమను అత్యాచారం చేశాక ఎలా చంపారో చెప్పారు. ఒకామె తనే ఆత్మహత్య చేసుకున్నానని చెప్పింది. అందరూ ఘోరంగా చంపబడినవారే. ఎవరని బయటకు వెళతారు.?!

బయట బెల్లు మోగుతూనే ఉంది. ఏ లోకమో అది. ఒక లోకం. ఆ లోకంలో ఒక గది. ఆ గదిలో అత్యాచారం అయి చనిపోయిన వాళ్లంతా చేరుతున్నారు. ఇప్పుడు కొత్త సభ్యురాలు. తలుపు తీయాలా వద్దా?

'తీస్తాను' అంది గృహిణి.

తీసింది. వచ్చిన మనిషిని చేయి పట్టుకొని తీసుకు వచ్చింది. లోపల ఉన్న స్త్రీలంతా కదిలిపోయారు. కరిగి నీరైపోయారు. ఆ వొచ్చింది ఏడేళ్ల బాలిక. ఆ బాలిక పరిగెత్తుకొని వెళ్లి ఒక ముసలావిడను అల్లుకుపోయింది. ఆ ముసలావిడ తన మనవరాలిని దగ్గరకు తీసుకున్నట్టు ఆ చిన్నారిని దగ్గరకు తీసుకుంది.

పోయిన కనెక్షన్ మళ్లీ వచ్చింది. టీవీలో రిపోర్టర్ చెబుతున్నాడు 'దేశంలో అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. దాదాపు లక్ష అత్యాచార కేసులు న్యాయస్థానాల్లో మురుగుతున్నాయి. ప్రతి రోజూ దేశంలో 90 రేప్ కేసులు నమోదు అవుతున్నాయి. వందకు ముప్పై మందికే శిక్షలు పడుతున్నాయి. దేశంలో 80 శాతం జనాభా అమ్మవారిని పూజిస్తుంది. కాని ఈ దేశంలోనే ఇన్ని అత్యాచారాలు' అంటూ ఉండగా షార్ట్‌ఫిల్మ్ ముగుస్తుంది.






రాయల్ స్టాగ్ కోసం ఎలక్ట్రిక్ ఆపిల్స్ సంస్థ తీసిన షార్ట్‌ఫిల్మ్ ఇది. రచయిత ప్రియాంక బెనర్జీ దీనికి దర్శకత్వం వహించారు. గృహిణిగా కాజోల్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా నేహా ధూపియా, గ్లామర్ ఫీల్డ్ అమ్మాయిగా శృతి హాసన్ నటించారు.

భారతదేశంలో వయసు తారతమ్యం లేకుండా, వర్గ తారతమ్యం లేకుండా, ఆర్థిక నేపథ్యాల తారతమ్యం లేకుండా ప్రతి దొంతరలోని స్త్రీ అత్యాచారాలకు బలవుతుందని ఈ షార్ట్ ఫిల్మ్ చెప్పింది. మేరిటల్ రేప్‌ను కూడా చెప్పింది. దుర్గను తొమ్మిది రూపాలలో కొలుస్తాం కనుక తొమ్మిది స్త్రీ పాత్రలు ఉన్నాయి. దుర్గను కొలిచే చేతులు స్త్రీని ఎందుకు గౌరవించడం లేదు అని ఈ షార్ట్ ఫిల్మ్ ప్రశ్నిస్తోంది. యూ ట్యూబ్‌లో ఉంది. చూడండి.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
బుధవారం
4-3-2020

218 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన ఎల్ఐసీ

ఇంజనీరింగ్, డిగ్రీ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు

దరఖాస్తులకు చివరి తేది: 15.03.2020

# ఎల్ఐసీలో ఉద్యోగం

## నెలకు రూ.57 వేల వేతనం!

ముంబై కేంద్రంగా ఉన్న ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ-లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా).. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు కోరుతోంది. ఇంజనీరింగ్, డిగ్రీ తదితర అర్హతలతో ఎల్ఐసీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. ఇలా మూడంచెల ఎంపిక ప్రక్రియ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అన్ని దశల్లో ప్రతిభ చూపి.. ఎంపికైతే ప్రారంభంలోనే రూ.57వేల వేతనంతోపాటు ఎల్ఐసీలో ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవచ్చు.

### పోస్టుల వివరాలు

- మొత్తం పోస్టుల సంఖ్య: 218
- ఇందులో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం అసిస్టెంట్ ఇంజనీర్స్ (సివిల్/ఎలక్ట్రికల్ /స్ట్రక్చరల్/ఎంఈపీ/అసిస్టెంట్ఆర్కిటెక్ట్) పోస్టుల సంఖ్య: 50
- అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్(స్పెషలిస్టులు): 168

### వయసు

అభ్యర్థులు 21 సంవత్సరాల వయసు నిండి, 01.02.2020 నాటికి 30 ఏళ్లు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, వికలాంగులకు (జనరల్) పదేళ్లు, ఎస్సీ/ఎస్టీ వికలాంగులకు 15 ఏళ్లు, ఓబీసీ వికలాంగులకు 13 ఏళ్లు వయో సడలింపు లభిస్తుంది.

### విద్యార్హతలు

- **ఏఈ (సివిల్/ఎలక్ట్రికల్ /ఎంఈపీ):** ఏఐసీటీఈ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్/బీఈ సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్ పూర్తి చేసి, కనీసం మూడేళ్ల వృత్తి నైపుణ్యం గలవారు అర్హులు.
- **అసిస్టెంట్ ఆర్కిటెక్ట్:** ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి బీఆర్క్ పూర్తి చేసి, కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో నమోదు చేసుకొని ఉండాలి. భవనాల డిజైనింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం తప్పనిసరి.
- **ఏఈ(స్ట్రక్చరల్):** ఏఐసీటీఈ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంటెక్/ఎంఈ పూర్తి చేయడంతోపాటు అనుభవం ఉండాలి.
- **ఏఏఓ(చార్టర్డ్ అకౌంటెంట్):** ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీతోపాటు చార్టర్డ్ అకౌంటెంట్ ఫైనల్ ఎగ్జామ్ పూర్తి చేయాలి. అభ్యర్థికి ఐసీఏఐలో సభ్యత్వం తప్పనిసరి.
- **ఏఏఓ(యాక్చూరియల్):** ఏదైనా డిగ్రీతో పాటు ఇన్‌సిట్యూట్ ఆఫ్ యాక్చురీస్ ఆఫ్ ఇండియా/ఇన్‌స్టిట్యూట్ అండ్ ఫ్యాకల్టీ ఆఫ్ యాక్చురీస్, యూకే నిర్వహించే పరీక్షల్లో కనీసం ఆరు పేపర్లు పాసై ఉండాలి.
- **ఏఏఓ(లీగల్):** ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం పూర్తి చేసినవారు అర్హులు.
- **ఏఏఓ(రాజ్‌భాష):** హిందీలో పోస్టుగ్రాడ్యుయేషన్ లేదా డిగ్రీలో ఇంగ్లిష్ నుంచి హిందీ అనువాదం ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
- **ఏఏఓ(ఐటీ):** బీఈ/బీటెక్ కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్ లేదా ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్).

### పరీక్ష ఇలా

- ఎంపిక ప్రక్రియలో భాగంగా ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్, ఇంటర్వ్యూ ఉంటాయి.
- ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 100 మార్కులకు జరుగుతుంది. పరీక్ష సమయం ఒక గంట. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు- 35 మార్కులు, ఇంగ్లిష్ 30 ప్రశ్నలు- 30 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు- 35 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- మెయిన్ పరీక్ష 120 ప్రశ్నలు- 300 మార్కులకు నిర్వహిస్తారు. దీంతోపాటు డిస్క్రిప్టివ్ తరహా పరీక్ష 25 మార్కులకు జరుగుతుంది.

### వేతనం

ఎంపికైన అభ్యర్థులకు మూల వేతనం నెలకు రూ.32,795 ఉంటుంది. నిబంధనల ప్రకారం- అన్నీ అలవెన్సులు కలిపి ప్రారంభంలోనే రూ. 57,000 వేతనం అందుకునే వీలుంది. దీంతోపాటు డిఫైన్డ్ కంట్రిబ్యూటరీ పెన్షన్, గ్రాట్యుటీ, ఎల్‌టీసీ, క్యాష్ మెడికల్ బెనిఫిట్, గ్రూప్ మెడిక్లయిమ్, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, వాహన లోన్ వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయి. అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (చార్టర్డ్ అకౌంటెంట్) పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు అర్హత, పని అనుభవాన్ని బట్టి రెండు ముందస్తు ఇంక్రిమెంట్లు చెల్లిస్తారు.

### ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/వికలాంగులకు రూ.85, ఇతరులకు రూ.700.
- **ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం:** 25.02.2020
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 15.03.2020
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 27.03.2020
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 04.04.2020
- **పూర్తి వివరాలకు www.licindia.in** లోని **Careers**లో చూడవచ్చు.

# కొలువుకు తొలి మెట్టు.. రెజ్యూమె

కాలం మారుతోంది. కాలంతోపాటు ఉద్యోగాల తీరు, నియామక విధానాలు మారుతున్నాయి. ఉద్యోగాన్వేషణలో తొలిమెట్టుగా భావించే... రెజ్యూమె రైటింగ్‌లో కూడా మార్పులొచ్చాయి. వాస్తవానికి కొత్తగా యూనివర్సిటీ విద్య ముగించకొని బయటకు వచ్చే పట్టభద్రులకు రెజ్యూమె రాయడం కత్తిమీద సాములాంటిదే! ఉద్యోగ అన్వేషణను ప్రారంభించేందుకు.. అలాగే ఒక ఉద్యోగం నుంచి మరో ఉద్యోగానికి మారేందుకు సైతం రెజ్యూమె చాలా కీలకం. ఒకప్పుడు అభ్యర్థులు ఓ కాగితంపై తమ చదువు, వ్యక్తిగత విషయాలు, అభిరుచులు, అనుభవం తదితర వివరాలను రాసి పంపించేవారు. కానీ ఇప్పుడు అంతా డిజిటల్ మయం. ప్రతిదీ షార్ట్‌గా, స్వీట్‌గా ఉండాలని కోరుకునే కాలం. ఒక్కో రెజ్యూమెపై హెచ్ఆర్ బృందం ఒక నిమిషం కంటే ఎక్కువ సమయం కేటాయించే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రెజ్యూమె రూపకల్పనలో తాజా ట్రెండ్స్.. రెజ్యూమె ప్రిపరేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం..




రాహుల్.. ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకుని కాలేజీ నుంచి బయట వచ్చాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం రాలేదు.. కాబట్టి సొంతంగా ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. ఉద్యోగ ప్రకటనలు చూస్తూ.. అప్పటికే కొలువుల్లో స్థిరపడ్డ స్నేహితుల్ని సంప్రదించాడు. వాళ్లు కొంత సహాయం చేస్తామని చెబుతూనే.. మంచి రెజ్యూమె తయారు చేసుకోమని చెప్పారు. అసలు రెజ్యూమె అంటే ఏమిటి.. ఉత్తమ రెజ్యూమెను రూపొందించడం ఎలా అనే విషయంపై రాహుల్‌లో తర్జనభర్జన ప్రారంభమైంది. ఒక్క రాహుల్ మాత్రమే కాదు. ఎక్కువ మంది ఉద్యోగార్థులు నేడు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇదే!

### సమాచార పత్రం

ప్రయివేటు రంగంలో ఏ ఉద్యోగం కోసం ప్రయత్నించాలన్నా.. మొట్టమొదట అడిగేది రెజ్యూమె. దీన్నే సీవీ ( కరిక్యులమ్ విటె) అంటారు. ఇందులో వ్యక్తిగత వివరాలు, చదువు,ఉద్యోగానుభవం తదితర సమాచారం ఉంటుంది. రెజ్యూమె ఎంత ప్రభావవంతంగా ఉంటే.. కొలువు సంపాదించడం అంత సులభం అవుతుంది. ప్రస్తుతం చాలా ప్రయివేటు సంస్థలు డిజిటల్ రెజ్యూమెలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. మనం ఏ కంపెనీలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటున్నామో.. ఆయా సంస్థలకు ముందుగానే మెయిల్ ద్వారా రెజ్యూమెను పంపాల్సి ఉంటుంది. సంస్థ నుంచి అందిన ఆహ్వానం మేరకు సమయానికి ఇంటర్వ్యూలకు వెళ్లి ప్రతిభ చూపితే కొలువు సొంతమవుతుంది.

### ఎలా ఉండాలంటే

- రెజ్యూమె అంటే.. సంస్థ హెచ్ఆర్ ప్రతినిధులకు మన గురించి తెలిపే సమాచార పత్రం. మరి అంతటి ముఖ్యమైన రెజ్యూమెను చాలామంది కట్ పేస్ట్ చేస్తుంటారు. తీరా ఇంటర్వ్యూకు వెళ్లాక.. రెజ్యూమెలో ఇచ్చిన సమాచారానికి, సంస్థ ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు, అభ్యర్థి చెప్పే సమాధానాలకు పొంతన ఉండదు. దాంతో వచ్చిన అవకాశం చేజారుతుంది. అలా కాకుండా చదువు,నైపుణ్యాలు, అనుభవం తదితర వివరాలను రెజ్యూమెలో స్పష్టంగా పొందుపరచాలి. అభ్యర్థికి సంబంధించిన వివరాలు క్షుణ్నంగా తెలియజేసే విధంగా రెజ్యూమె ప్రిపేర్ చేయాలి. సంక్షిప్తంగా ప్రభావవంతంగా రెజ్యూమె రూపొందించాలి.
- రెజ్యూమె రూపొందించే సమయంలో సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకోవడం మేలు చేస్తుంది. దీని వల్ల బెస్ట్ రెజ్యూమె సిద్ధం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. వీలైనంత తక్కువ పదాల్లో పూర్తి సమాచారం పొందుపరిచేలా.. అందరికీ అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా రెజ్యూమె రూపొందించాలి.

### అనుభవం, విద్యార్హతలు

రెజ్యూమెలో విద్యార్హతలకు సంబంధించి వాస్తవ సమాచారం మాత్రమే ఇవ్వాలి. ప్రతి సంస్థ అభ్యర్థులు పొందుపరచిన విద్యార్హతల వివరాలను క్రాస్ చెక్ చేస్తుంది. ఉద్యోగావకాశం కల్పించాక చాలా సంస్థలు విద్యార్హతల విషయంలో ప్రత్యేక టీమ్ ద్వారా పరిశీలన కూడా జరిపిస్తున్నాయి. కొంతమంది అనుభవానికి సంబంధించి ఫేక్ సర్టిఫికెట్లు జత చేస్తుంటారు. ఇది పెద్ద పొరపాటు. కాబట్టి చదువు, అనుభవం విషయంలో అభ్యర్థులు నిజాలు మాత్రమే పొందుపరచాలి. లేనివి ఉన్నట్లు రాస్తే.. ఒక వేళ ఉద్యోగం వచ్చినా... ఆ తర్వాత నిజం తెలిస్తే తొలగింపునకు గురికావాల్సి వస్తుంది. రెజ్యూమెలో పేర్కొన్న వ్యక్తిగత వివరాలు, ఇంటర్వ్యూ సమయంలో ముఖాముఖి కలిసినప్పుడు పూర్తిగా ప్రతిబింబించే విధంగా ఉండాలి.

### సోషల్ ప్రొఫైల్

ప్రస్తుతం చాలా కంపెనీలు ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థుల సోషల్ మీడియా ఐడీలను పొందుపరచమని అడుగుతున్నాయి. సోషల్ మీడియా ప్రొఫైల్‌ను, యాక్టివిటీస్‌ను, కామెంట్‌లను, ఫాలోవర్స్‌ను పరిశీలిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు సోషల్ మీడియాలో తమ ప్రవర్తన నిజాయితీగా, ప్రొఫెషనల్‌గా ఉండేలా చూసుకోవాలి. సొంతంగా రెజ్యూమెను రూపొందించలేకపోతున్నామని భావిస్తే..నిపుణులైన రెజ్యూమె రైటర్లను సంప్రదించొచ్చు. అలాగే ఆన్‌లైన్ వేదికగా పలు రెజ్యూమె రైటింగ్ పోర్టల్స్ రెజ్యూమెలను తయారు చేస్తున్నాయి. వారి సాయం తీసుకోవచ్చు.

### సాంకేతిక నైపుణ్యాలు

రెజ్యూమె రూపొందించేటప్పుడు అభ్యర్థులు సబ్జెక్టు పరమైన సాంకేతిక నైపుణ్యాలను తప్పక పొందుపరచాలి. ప్రస్తుతం వివిధ సోషల్ లింక్ ప్లాట్‌ఫామ్‌లు రెజ్యూమెలో ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవలను ఉపయోగించుకుంటున్నాయి. దీనివల్ల సదరు సంస్థ ఎలాంటి సాంకేతిక నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులను కోరుకుంటుందో.. అలాంటి రెజ్యూమెలను ఆయా కంపెనీలకు పంపిస్తున్నాయి. అలాగే అభ్యర్థులు పొందుపరిచిన నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాల వివరాలను సూచిస్తుంటాయి.

### ఉండాల్సినవి.. ఉండకూడనివి

- రెజ్యూమెకు ఫోటో జతచేసే విషయంలో జాగ్రత్త పాటించాలి. అడిగితే తప్ప ఫోటో పంపించకూడదు.
- ఉద్యోగానికి సంబంధించిన అభిరుచుల గురించి ప్రస్తావించడం మంచిది.
- కుటుంబ, వ్యక్తిగత విషయాలు ఎక్కువగా పొందుపరచకూడదు.
- గతంలో పనిచేసిన సంస్థలోని పై అధికారులతో, సహచరులతో వచ్చిన విభేదాల గురించి రాయకూడదు.
- రెజ్యూమెలో విషయం సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా, సృజనాత్మకంగా ఉండాలి.
- సంస్థలో పనిచేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు ప్రస్తావించకూడదు.
- అనుభవం, డిగ్రీలు, జీతం విషయంలో వాస్తవాలు రాయాలి.
- ఒకటికి మించి ఫోన్ నెంబర్లు, మెయిల్ ఐడీలు, తమాషా పేర్లు రాయకూడదు.
- పూర్వ ఉద్యోగంలో సాధించిన విజయాలు ప్రస్తావించాలి. అంతేగానీ క్రీడల్లో, వ్యక్తిగత విషయాల్లో సాధించిన విజయాలు రాయకూడదు.

## ప్రవేశాలు

### అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీలో ప్రవేశాలు

బెంగళూరులోని అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీ.. ఫుల్‌టైమ్, రెసిడెన్షియల్ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

**కోర్సుల వివరాలు**

- ఫిజిక్స్, బయాలజీ లేదా మ్యాథమెటిక్స్‌తో మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ; ఎకనామిక్స్ లేదా హుమానిటీస్‌లో బీఏ డిగ్రీ.
- సైన్స్, ఎడ్యుకేషన్‌లో నాలుగేళ్ల బీఎస్సీ బీఈడీ డ్యుయెల్ డిగ్రీ. ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటిక్స్ నుంచి ఏదో ఒక సబ్జెక్టును ఎంచుకోవాల్సి ఉంటుంది.

**అర్హతలు**

ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 19 ఏళ్లకు మించరాదు.

**ప్రవేశ ప్రక్రియ**

ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశాలు ఖరారు చేస్తారు. శాట్, కేవీపీవై స్కోర్‌లు కూడా ప్రవేశాలకు పరిగణనలోకి తీసుకుంటారు.

**ముఖ్యసమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 26 మార్చి 2020
- **ప్రవేశ పరీక్ష తేది:** 12 ఏప్రిల్ 2020
- **ఇంటర్వ్యూ ప్రక్రియ:** మే 2020
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.azimpremjiuniversity.edu.in/ug

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
BIOLOGY




### సీ-డ్యాక్ 132

నోయిడాలోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డ్యాక్) ఒప్పంద ప్రాతిపదికన 132 రకాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ప్రాజెక్ట్ మేనేజర్-10, ప్రాజెక్ట్ ఇంజనీర్-122.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంసీఏ/ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 11, 2020
- **వెబ్‌సైట్:** https://cdac.in

### హెచ్‌యూఆర్ఎల్-90

కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్‌టీపీసీ, ఐఓసీఎల్, ఎఫ్‌సీఐఎల్ అనుబంధ సంస్థ అయిన హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్ఎల్).. 90 ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** కెమికల్-38, మెకానికల్-25, ఎలక్ట్రికల్-15, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్-12.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత, గేట్-2019 వాలిడ్ స్కోర్ ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** వాలిడ్ గేట్ స్కోర్, బిహేవియరల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 15, 2020
- **వెబ్‌సైట్:** www.hurl.net.in

### పవర్‌గ్రిడ్-36

భారత ప్రభుత్వానికి చెందిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 36 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఫీల్డ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్, సివిల్)-20; ఫీల్డ్ సూపర్‌వైజర్ (ఎలక్ట్రికల్, సివిల్)-16
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్), బ్యాచిలర్ డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** మార్చి 6, 2020 నాటికి 29 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఫీల్డ్ ఇంజనీర్ పోస్టులకు రూ. 400; ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు రూ.300.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

### నాబ్‌కాన్స్-78

నాబార్డ్ సబ్సిడరీ సంస్థ అయిన నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (నాబ్‌కాన్స్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 78 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** జూనియర్ కన్సల్టెంట్స్-65, సీనియర్ కన్సల్టెంట్స్-13.
- **అర్హత:** గ్రాడ్యుయేషన్/ఎంబీఏ/పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, కంప్యూటర్ నాలెడ్జ్, స్థానిక భాష, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 10, 2020
- **వెబ్‌సైట్:** www.nabcons.com

### ఐఐటీఎమ్-36

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ (ఐఐటీఎం) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 36 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-1, ప్రాజెక్ట్ సైంటిస్ట్ ఈ-4, ప్రాజెక్ట్ సైంటిస్ట్ డీ-11, ప్రాజెక్ట్ సైంటిస్ట్ సీ-13, ప్రాజెక్ట్ సైంటిస్ట్ బీ-6, కంప్యూటర్ అప్లికేషన్ సపోర్ట్ సైంటిస్ట్-1.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 28-50 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 3, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 29, 2020
- **వెబ్‌సైట్:** www.tropmet.res.in

### బీఈసీఐఎల్-19

బెంగళూరులోని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) తాత్కాలిక ప్రాతిపదికన 19 పోస్టుల భర్తీకి దరఖాడస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** డేటా ఎంట్రీ ఆపరేటర్-10, సపోర్టింగ్ స్టాఫ్-9.
- **అర్హత:** ఎస్ఎస్ఎల్‌సీ, డిగ్రీ ఉత్తీర్ణత, సంబంధిత పని అనుభవం.
- **వయసు:** డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు 40 ఏళ్లు, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 9, 2019
- **వెబ్‌సైట్:** www.becil.com

### బెల్-24

బెంగళూరులోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 24 డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** ఫిబ్రవరి 1, 2020 నాటికి 26 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 21, 2020
- **వెబ్‌సైట్:** www.bel-india.in

### ఐఎఫ్‌బీ-6

హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఆర్‌కి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయో డైవర్సిటీ (ఐఎఫ్‌బీ)..6 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** ఏప్రిల్ 20, 2020 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 20, 2020
- **వెబ్‌సైట్:** http://ifb.icfre.gov.in

### బీఐఎస్-150

ఢిల్లీలోని భారత ప్రభుత్వ ఆధీనంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్జ్యూమర్ అఫైర్స్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 150 సైంటిస్ట్-బి ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్ ఇంజనీరింగ్-48, మెటలర్జికల్ ఇంజనీరింగ్-25, సివిల్ ఇంజనీరింగ్-7, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-19, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్-5, కంప్యూటర్ ఇంజనీరింగ్-11, ఫుడ్ టెక్నాలజీ-14, కెమికల్ ఇంజనీరింగ్-16, బయో టెక్నాలజీ-1, పెట్రో కెమికల్ ఇంజనీరింగ్-1, బయో మెడికల్ ఇంజనీరింగ్-3.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, గేట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** మార్చి 31, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, గేట్ స్కోర్-2018,19, 20 ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 2, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 31, 2020
- **వెబ్‌సైట్:** https://bis.gov.in

### ఈసీఐఎల్-8

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఎలక్ట్రానిక్స్ అండ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన 8 టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** జనవరి 31, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 9, 2020
- **వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

### హెచ్ఎంటీఎల్-20

బెంగళూరులోని హెచ్ఎంటీ మెషిన్ టూల్స్ లిమిటెడ్.. 20 డిప్యూటీ ఇంజనీర్ (సేల్స్ అండ్ సర్వీసింగ్, ప్రొడక్షన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** మెరిట్, అనుభవం, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 20, 2020
- **వెబ్‌సైట్:** www.hmtindia.com

### టీఐఎఫ్ఆర్-5

హైదరాబాద్ (రంగారెడ్డి)లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్).. 5 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ప్రాజెక్ట్ క్లర్క్, ప్రాజెక్ట్ వర్క్ అసిస్టెంట్.
- **అర్హత:** పోస్టును బట్టి పదోతరగతి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 16, 2020
- **వెబ్‌సైట్:** www.tifrh.res.in

### రైట్స్-35

భారత ప్రభుత్వానికి చెందిన రైట్స్ లిమిటెడ్.. 35 ఇంజనీర్ (సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సివిల్ సబ్జెక్టుతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** ఫిబ్రవరి 1, 2020 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరవల్, ఓబీసీలకు రూ.600; మిగిలిన వారికి రూ.300.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 23, 2020
- **వెబ్‌సైట్:** https://rites.com

## హాకీ ఇండియా 'ఉత్తమ గోల్‌కీపర్' అవార్డు రేసులో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని



కొన్నేళ్లుగా భారత మహిళల సీనియర్ హాకీ జట్టుకు రెండో గోల్‌కీపర్‌గా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ఇతిమరపు రజని... 2019 సంవత్సరానికి హాకీ ఇండియా వార్షిక అవార్డుల్లో 'ఉత్తమ గోల్‌కీపర్' విభాగంలో నామినేట్ అయ్యింది. ఈనెల 8న జరిగే అవార్డుల కార్యక్రమంలో తుది విజేతను ప్రకటిస్తారు. పురుషుల విభాగంలో శ్రీజేశ్, కృషన్ పాఠక్... మహిళల విభాగంలో రజనితోపాటు సవిత అవార్డు రేసులో ఉన్నారు. అవార్డు గెలిచిన వారికి రూ. 5 లక్షలతోపాటు జ్ఞాపిక అందజేస్తారు. మొత్తం 11 కేటగిరీల్లో అవార్డులను బహూకరిస్తారు. జీవిత సాఫల్య పురస్కారం కింద రూ. 30 లక్షలు... పురుషుల విభాగంలో ఉత్తమ క్రీడాకారుడికి రూ. 25 లక్షలు... మహిళల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణికి రూ. 25 లక్షలు లభిస్తాయి.



టోక్యో ఒలింపిక్స్ ప్రధాన స్టేడియం

# టోక్యో... క్యా కరోనా?

**ఒలింపిక్స్‌పై కోవిడ్-19 వైరస్ ప్రభావం • క్రీడలు వాయిదా పడే అవకాశం**
**2020లో జరగకపోతే పూర్తిగా రద్దు • పార్లమెంట్‌లో జపాన్ మంత్రి ప్రకటన**

రెండు వందలకు పైగా దేశాల నుంచి దాదాపు పది వేల మంది అథ్లెట్లు... అంతకంటే ఎన్నో రెట్ల సంఖ్యలో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు... పక్షం రోజుల పాటు క్రీడా ప్రేమికులకు పండగ... ఇంతటి హంగామా ఉండే విశ్వ సంబరం ఒలింపిక్స్‌పై కూడా ఇప్పుడు ప్రమాదకర కరోనా (కోవిడ్-19) వైరస్ ప్రభావం పడనుందా... జూలై-ఆగస్టుల్లో జపాన్ రాజధాని టోక్యోలో జరగాల్సిన 2020 మెగా ఈవెంట్ వాయిదా పడుతుందా లేక మొత్తానికే రద్దవుతుందా... ఇద్దరు మనుషులు కలిసినప్పుడు షేక్ హ్యాండ్‌లు ఇవ్వడం కూడా ప్రమాదంగా భావిస్తున్న ప్రస్తుత స్థితిలో వేల సంఖ్యలో జనం గుమిగూడే ఒలింపిక్స్ నిర్వహణ సాధ్యమా...? అసలు ఆ సాహసం నిర్వాహకులు చేయగలరా!

**టోక్యో:** కరోనా వైరస్ (కోవిడ్-19) దెబ్బకు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే ఎన్నో ప్రముఖ క్రీడా ఈవెంట్లు రద్దు కావడమో లేక వాయిదా పడటమో జరుగుతున్నాయి. ప్రతీ రోజు ఎక్కడో ఒక క్రీడాంశానికి సంబంధించి ఇలాంటి వార్త వస్తూనే ఉంది. అయితే వీటన్నింటిని మించి ఇప్పుడు అందరి దృష్టి టోక్యో ఒలింపిక్స్‌పై పడింది. యూరోపియన్ దేశాలతో పోలిస్తే ఆసియా ఖండంలో విస్తృతంగా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఒలింపిక్స్ వేదిక జపాన్ కావడంతో కొత్త సందేహాలు తలెత్తుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు టోక్యో ఒలింపిక్స్ క్రీడలు జరగాల్సి ఉన్నాయి. ఇప్పుడు స్వయంగా ఆ దేశ పార్లమెంట్‌లో మంత్రి ఇచ్చిన వివరణ కొత్తగా ఆందోళనను రేకెత్తిస్తోంది. పార్లమెంట్‌లో ఒక ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ జపాన్ ఒలింపిక్ మంత్రి సీకో హాషిమోటో కీలక వ్యాఖ్య చేశారు. 'ఒలింపిక్స్ నిర్వహణకు ఉద్దేశించిన క్యాలెండర్ సంవత్సరం ముగిసే వరకు వాటిని మళ్లీ మళ్లీ వాయిదా వేసేందుకు నిర్వాహక కమిటీకి హక్కు ఉంటుంది. అయితే 2020లో గనక మనం నిర్వహించలేకపోతే నిబంధనల ప్రకారం క్రీడలను పూర్తిగా రద్దు చేసే అధికారం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి ఉంది' అని ఆయన ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24 నుంచి మాత్రం నిర్వహణ సాధ్యం కాకపోవచ్చని మంత్రి వ్యాఖ్యల్లో పరోక్షంగా వినిపించింది. కరోనా వైరస్ కారణంగా రాబోయే రోజుల్లో పరిస్థితి మరింతగా దిగజారితే అప్పుడేం చేస్తారనే ప్రశ్నకు కూడా మంత్రి సమాధానమిచ్చారు. అలాంటి పరిస్థితి రాకుండా తాము అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. నిర్వాహక కమిటీ, ఐఓసీ, జపాన్ ప్రభుత్వం కలిసి దీనిపై పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. హాషిమోటో అంచనా ప్రకారం క్రీడల నిర్వహణ విషయంలో నిర్ణయం తీసుకునేందుకు ఐఓసీ మే నెలను డెడ్‌లైన్‌గా పెట్టుకుంది. అదే నెల చివరి వరకు ఎదురు చూసి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఒలింపిక్స్‌పై ప్రకటన రావచ్చు. ఒలింపిక్స్ చరిత్రలో మూడు సార్లు మాత్రమే ప్రపంచ యుద్ధాల కారణంగా క్రీడలు (1916, 1940, 1944) రద్దయ్యాయి.

### టెస్టు ఈవెంట్‌లు రద్దు!

ఒలింపిక్స్ నిర్వహణకు ముందు జరిగే పలు టెస్టు ఈవెంట్లను నిర్వాహకులు తప్పనిసరి పరిస్థితుల్లో రద్దు చేయాల్సి వస్తోంది. రాబోయే కొన్ని వారాల పాటు ప్రేక్షకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఎలాంటి ఈవెంట్లు జరపరాదని దేశ ప్రధాని షింజో అబె ఆదేశించారు. మంగళవారం పారాలింపిక్ వీల్‌చైర్ రగ్బీ టెస్టు ఈవెంట్ రద్దయింది. షెడ్యూల్ ప్రకారం మే 8లోగా మరో 17 విభిన్న క్రీడాంశాల్లో టెస్టు ఈవెంట్లు జరగాల్సి ఉంది. వీటిలో ఎక్కువ భాగం చిన్నవి కావడం, స్థానిక అథ్లెట్లతోనే కావడంతో ఇబ్బంది లేదు. అయితే ప్రధానమైన జిమ్నాస్టిక్స్ ఈవెంట్‌ను మాత్రం జపాన్ ఆటగాళ్లతోనే ముగించే అవకాశం ఉంది. జపాన్ బేస్‌బాల్ లీగ్ పోటీలు కూడా ప్రేక్షకులు లేకుండానే సాగుతుండగా, సాకర్ జె లీగ్ కూడా రద్దయింది. ఆదివారం టోక్యో మారథాన్‌ను నిర్వహించారు. సాధారణంగా 30 వేల మంది హాజరయ్యే మారథాన్‌కు ఈసారి వేయి మంది కూడా రాలేదు. మరోవైపు ఐఓసీ మాత్రం టోక్యో ఒలింపిక్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తమ సన్నాహాలు కొనసాగుతున్నాయని ప్రకటించడం విశేషం. లుసానేలో జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం అధ్యక్షుడు థామస్ బాచ్ మాట్లాడుతూ...'తుది నిర్ణయం తీసుకునేందుకు చాలా సమయం ఉంది. ఆలోగా మా ఏర్పాట్లు చేసుకుంటూ సిద్ధంగా ఉండాలి కదా' అని అన్నారు.




థామస్ బాచ్

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి నాలుగేళ్ల కాలంలో వచ్చే 5.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 42 వేల కోట్లు) ఆదాయంలో 75 శాతం ప్రసార హక్కులు విక్రయించడం ద్వారానే లభిస్తుంది. ఇందులో సగం అమెరికాకు చెందిన టీవీ నెట్‌వర్క్ నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ (ఎన్‌బీసీ) నుంచే వస్తోంది. ఎన్‌బీసీ ప్రసారాల సౌకర్యం కోసమే ఒలింపిక్స్‌ను జూలై-ఆగస్టులో నిర్వహిస్తున్నారు. 1964లో టోక్యో ఒలింపిక్స్ అక్టోబరులో జరిగాయి. 2020లో మిగిలిన ఏడాది ఇతర ప్రముఖ క్రీడా ఈవెంట్లతో ఎన్‌బీసీ షెడ్యూల్ బిజీగా ఉంది. ఇప్పుడు ఒలింపిక్స్ నిర్వహణ తేదీల్లో తేడా వస్తే ఆర్థికపరంగా కూడా ఐఓసీకి భారీ నష్టం జరగవచ్చు.

# పాండ్యా సూపర్ ఇన్నింగ్స్

- 39 బంతుల్లో 8 ఫోర్లు, 10 సిక్సర్లతో 105
- డీవై పాటిల్ టి20 టోర్నీ



**ముంబై:** గాయం నుంచి కోలుకొని ఫిట్‌గా మారిన భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌లో చెలరేగాడు. డీవై పాటిల్ టి20 కప్‌లో భాగంగా రిలయన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతను మెరుపు సెంచరీ బాదాడు. 'కాగ్' జట్టుతో జరిగిన మ్యాచ్‌లో పాండ్యా 39 బంతుల్లోనే 8 ఫోర్లు, 10 సిక్సర్లతో 105 పరుగులు సాధించాడు. పాండ్యా దూకుడుతో రిలయన్స్ 252 పరుగులు నమోదు చేయగా... 151 పరుగులే చేసిన 'కాగ్' జట్టు 101 పరుగులతో ఓడింది. పునరాగమనంలో పాండ్యాకు ఇది రెండో మ్యాచ్. మొదటి మ్యాచ్‌లో పాండ్యా 25 బంతుల్లో 38 పరుగులు సాధించాడు. గత సెప్టెంబరులో భారత్ తరఫున అతను చివరిసారిగా మ్యాచ్ (దక్షిణాఫ్రికాపై టి20) ఆడాడు. ఆ తర్వాత వెన్ను నొప్పికి శస్త్ర చికిత్స చేయించుకొని జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాస కార్యక్రమంలో పాల్గొని ఫిట్‌గా మారాడు. దక్షిణాఫ్రికాతో త్వరలో జరగబోయే మూడు వన్డేల సిరీస్‌కు పాండ్యా మళ్లీ ఎంపికయ్యే అవకాశం ఉంది.

# మా దేశానికి రావొద్దు...

**భారత అండర్-16 ఫుట్‌బాల్ జట్టును కోరిన తజికిస్తాన్ • కోవిడ్-19 భయంతోనే**

**న్యూఢిల్లీ:** తజికిస్తాన్‌లో పర్యటించాలనుకున్న భారత కుర్ర ఫుట్‌బాలర్లకు 'కరోనా' షాకిచ్చింది. తమ దేశంలో భారత అండర్-16 ఫుట్‌బాల్ జట్టు పర్యటనను తజికిస్తాన్ రద్దు చేసింది. అండర్-15 దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య చాంపియన్ అయిన భారత కుర్రాళ్ల జట్టు రేపు అక్కడికి బయలుదేరాల్సి ఉంది. అక్కడ ఏఎఫ్‌సీ అండర్-16 చాంపియన్‌షిప్ రన్నరప్ అయిన తజికిస్తాన్‌తో రెండు ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అయితే భారత్‌లోనూ కరోనా కేసులు నమోదు కావడంతో తజికిస్తాన్ ప్రభుత్వం భారత్‌ను కరోనా ప్రభావిత దేశాల జాబితాలో చేర్చింది. ఈ జాబితాలో 35 దేశాలున్నాయి. ఈ జాబితాలోని దేశాల్లో తమ దేశస్థులు పర్యటించడాన్ని... ఆ దేశస్థులు తమ దేశంలో పర్యటించడాన్ని తజికిస్తాన్ నిషేధం విధించడం వల్లే ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడలేకపోతున్నట్లు ఆ దేశ ఫుట్‌బాల్ సమాఖ్య స్పష్టం చేసింది.



### కరచాలనం ఇవ్వం: జో రూట్

శ్రీలంకలో క్రికెట్ సిరీస్ ఆడేందుకు మంగళవారం అడుగుపెట్టిన ఇంగ్లండ్ క్రికెట్ జట్టు సభ్యులు అక్కడ ప్రత్యర్థి ఆటగాళ్లతో కరచాలనం చేయబోరని కెప్టెన్ జో రూట్ వెల్లడించాడు. కరోనా ఎఫెక్ట్ వల్లే పరస్పర కరచాలనం చేయొద్దని నిర్ణయించుకున్నట్లు అతను తెలిపాడు. ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటనలో ఇంగ్లండ్ ఆటగాళ్లు అనారోగ్యం బారిన పడ్డారు. అయితే త్వరగానే కోలుకున్నారు. ఇప్పుడైతే కోవిడ్-19 ప్రపంచాన్నే వణికిస్తున్న నేపథ్యంలో ముందుజాగ్రత్తగా శుచి-శుభ్రతను పాటిస్తామని, తమ క్రికెట్ బోర్డు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే నడుచుకుంటామని రూట్ చెప్పాడు.




### ఆడండి కానీ... ఆటోగ్రాఫ్‌లు వద్దే వద్దు!

**లాస్ ఏంజిల్స్:** ప్రాణాంతక కరోనా వైరస్ (కోవిడ్-19)తో అమెరికాలో ఆరుగురు మృతి చెందారు. దీంతో అప్రమత్తమైన జాతీయ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) తమ ఆటగాళ్లకు, జట్ల కోచ్‌లు, ఫిజియో, ఇతర సిబ్బందికి తు.చ. తప్పకుండా పాటించే మార్గదర్శకాలు జారీచేసింది. ఆటగాళ్లెవరూ అభిమానులతో కలవరాదని కచ్చితంగా చెప్పేసింది. ఆటోగ్రాఫ్‌లు చేసేందుకు, పెన్నులను ముట్టుకునేందుకు, సెల్ఫీలు దిగేందుకు దూరంగా ఉండాలని ఎన్‌బీఏ స్పష్టం చేసింది. ఆటగాళ్ల ఆరోగ్య భద్రత తమ ప్రధాన ఉద్దేశమని ఆ మార్గదర్శకాల్లో పేర్కొంది.

### నిర్'బంధి'ంచారు...

అబుదాబీలో విదేశీ సైక్లిస్టులకు వింత అనుభవం ఎదురైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనకు వచ్చిన జట్లలో కొందరికి కరోనా సోకడంతో వాళ్లని వెంటనే వారి స్వదేశాలకు పంపేసిన అబుదాబీ వర్గాలు మిగతా వారిని బస చేసిన హోటల్ గదుల్లోనే నిర్బంధించింది. ఫ్రాన్స్, రష్యా దేశాలకు చెందిన సైక్లిస్టులకు, సిబ్బందికి నిర్బంధం విధించిన యూఏఈ ప్రభుత్వం వైరస్ బారిన పడిన ఇద్దరు ఇటాలియన్ అధికారుల్ని ఉన్నపళంగా ఇటలీకి ప్రత్యేక విమానాల్లో పంపించింది.

# గౌరవ్, ఆశిష్ శుభారంభం

**ఆసియా ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నీ**



గౌరవ్

**అమ్మాన్ (జోర్డాన్):** ఆసియా ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు గౌరవ్ సోలంకి, ఆశిష్ కుమార్ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన పురుషుల 57 కేజీల తొలి రౌండ్ బౌట్‌లో గౌరవ్ 5-0తో అక్టైల్‌బెక్ ఎసెన్‌బెక్ ఊలు (కిర్గిస్తాన్)పై, 75 కేజీల విభాగంలో ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత ఆశిష్ 5-0తో కాన్ చియా వీ (చైనీస్ తైపీ)పై గెలుపొంది ప్రిక్వార్టర్స్ చేరారు. ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ మిరాజిజ్‌బెక్ (ఉజ్బెకిస్తాన్)తో గౌరవ్; ఒముర్‌బెక్ బెక్‌జిగిత్ ఊలు (కిర్గిస్తాన్)తో ఆశిష్ తలపడతారు. మహిళల విభాగంలో లవ్లీనా (69 కేజీలు), పూజా రాణి (75 కేజీలు)... పురుషుల విభాగంలో సతీశ్ కుమార్ (+91 కేజీలు) ఒలింపిక్ బెర్త్‌లకు విజయం దూరంలోనే ఉన్నారు. ఈ విభాగాల్లో ఎంట్రీల సంఖ్య తక్కువగా ఉండటం... నాలుగేసి బెర్త్‌లు ఉండటంతో భారత బాక్సర్లు ఓ విజయం సాధిస్తే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.



# హారిక రెండో గేమ్ 'డ్రా'

**లుసానే (స్విట్జర్లాండ్):** 'ఫిడే' మహిళల చెస్ గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక రెండో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మేరీ సెబాగ్‌తో మంగళవారం జరిగిన రెండో గేమ్‌ను హారిక 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. స్వీడన్ గ్రాండ్‌మాస్టర్ పియా క్రామ్లింగ్‌తో సోమవారం జరిగిన తొలి గేమ్‌ను తెల్లపావులతో ఆడిన హారిక 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. రెండో రౌండ్ తర్వాత హారిక ఖాతాలో ఒక పాయింట్ ఉంది. మొత్తం 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగుతోంది.

# భారత్ సెమీస్ ప్రత్యర్థి ఇంగ్లండ్

**ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ' • టి20 మహిళల ప్రపంచ కప్**



హర్మన్




నైట్

**సిడ్నీ:** మహిళల టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో తలపడే జట్లు ఖరారయ్యాయి. తొలి సెమీఫైనల్లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను భారత్... రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ'కొంటాయి. ఈ రెండు మ్యాచ్‌లు కూడా ఒకే రోజు (గురువారం) జరుగుతాయి. వర్షం కారణంగా గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం జరిగిన రెండు మ్యాచ్‌ల్లో కూడా ఫలితం రాలేదు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ పూర్తిగా రద్దు కావడంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. దాంతో మొత్తం 7 పాయింట్లతో దక్షిణాఫ్రికా గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. రెండో స్థానం సాధించిన ఇంగ్లండ్ జట్టు హర్మన్‌ప్రీత్ సేనతో సవాల్‌కు సన్నద్ధమైంది. మరోవైపు ఇదే గ్రూప్‌లో పాకిస్తాన్, థాయ్‌లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ కూడా రద్దయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 150 పరుగులు చేసింది. ఆ తర్వాత వర్షంతో పాకిస్తాన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు.

**ఎలీస్ పెర్రీ అవుట్...:** కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియాకు గట్టి దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ క్రీడాకారిణి ఎలీస్ పెర్రీ కండరాల గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్ అయిన ఎలీస్ లేకపోవడం ఆ జట్టు అవకాశాలను ప్రభావితం చేయవచ్చు. 2009లో మహిళల టి20 ప్రపంచ కప్ ప్రారంభమైన నాటినుంచి ఇప్పటి వరకు ఆస్ట్రేలియా 36 మ్యాచ్‌లు ఆడితే అన్నింటిలోనూ పెర్రీ భాగం కావడం విశేషం.

# 13 ఏళ్ల తర్వాత... రంజీ ఫైనల్లో బెంగాల్

**సెమీస్‌లో కర్ణాటకపై గెలుపు**



బెంగాల్ ఆటగాళ్ల సంబరం

**కోల్‌కతా:** 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ... బెంగాల్ క్రికెట్ జట్టు దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో మళ్లీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. కర్ణాటకతో మంగళవారం ముగిసిన సెమీఫైనల్లో ఆతిథ్య బెంగాల్ జట్టు 174 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. తద్వారా 2007 తర్వాత తొలిసారి రంజీ ట్రోఫీ తుది పోరుకు అర్హత సాధించింది. 352 పరుగుల విజయలక్ష్యంతో... ఓవర్‌నైట్ స్కోరు 98/3తో నాలుగో రోజు ఛేదన కొనసాగించిన కర్ణాటక 55.3 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ బౌలర్ ముకేశ్ కుమార్ (6/61) కర్ణాటక బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించాడు. చివరి రోజు కర్ణాటక కోల్పోయిన ఏడు వికెట్లలో ఐదు ముకేశ్ దక్కించుకోవడం విశేషం. రాజ్‌కోట్ వేదికగా సౌరాష్ట్రతో జరుగుతోన్న మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌కు 327 పరుగుల భారీ లక్ష్యం ఎదురైంది. ఓవర్‌నైట్ స్కోరు 66/5తో ఆటను కొనసాగించిన సౌరాష్ట్రను అర్పిత్ (139; 16 ఫోర్లు, సిక్స్) సెంచరీతో ఆదుకోవడంతో... తమ రెండో ఇన్నింగ్స్‌లో 274 పరుగులకు ఆలౌటైంది. ఆట ముగిసే సమయానికి గుజరాత్ వికెట్ నష్టానికి 7 పరుగులు చేసింది.

# చైనా చేతిలో భారత్ ఓటమి

**దుబాయ్:** ఫెడ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌ను భారత్ ఓటమితో ప్రారంభించింది. చైనాతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0-3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో రుతుజా భోసలే 4-6, 2-6తో షుయె జాంగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 6-1, 2-6, 4-6తో కియాంగ్ వాంగ్ చేతిలో ఓడిపోగా... మూడో మ్యాచ్‌లో సౌజన్య-రియా భాటియా జంట 0-6, 1-6తో షుయె పెంగ్-జూ ఇఫాన్ జోడీ చేతిలో పరాజయం పాలైంది.

# తమీమ్ సెంచరీ: బంగ్లాదేశ్ విజయం



తమీమ్

**సిల్హెట్ (బంగ్లాదేశ్):** చివరి బంతి వరకు ఉత్కంఠగా జరిగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్ నాలుగు పరుగుల ఆధిక్యంతో జింబాబ్వేపై గెలుపొందింది. చివరి ఓవర్లో జింబాబ్వే విజయానికి 20 పరుగులు అవసరం కాగా... 15 పరుగులు చేయగలిగింది. టిరిపానో (28 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) 50వ ఓవర్ మూడు, నాలుగు బంతులను సిక్సర్లుగా మలచడంతో... జింబాబ్వే విజయం సమీకరణం రెండు బంతుల్లో ఆరు పరుగులకు మారింది. అయితే ఆ రెండు బంతులకు కేవలం ఒక్క పరుగు మాత్రమే సాధించిన జింబాబ్వే సంచలన విజయాన్ని దూరం చేసుకుంది. తొలుత బంగ్లాదేశ్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లకు 322 పరుగులు చేసింది. తమీమ్ ఇక్బాల్ (136 బంతుల్లో 158; 20 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీ చేశాడు. అనంతరం ఛేదనలో జింబాబ్వే 50 ఓవర్లలో 8 వికెట్లకు 318 పరుగులు చేసింది. సికిందర్ రాజా (66; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), మదెవెరె (52; 5 ఫోర్లు), తినాశే (51; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. తాజా విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0తో గెల్చుకుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
4-3-2020
WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 480 ▲ | 171 ▲ |
| 38,624 | 11,303 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తాలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,867 | ▼ | 84 |
| డోజోన్స్‌ | 26,388 | ▼ | 315 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,718 | ▲ | 63 |
| డాక్స్‌ | 11,985 | ▲ | 127 |
| షాంఘై | 2,993 | ▲ | 22 |
| నికాయ్‌ | 21,083 | ▼ | 261 |

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 72.10 | 73.75 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 91.64 | 94.88 |
| € | యూరో | ఎస్‌బీఐ | 79.81 | 82.78 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 66.40 | 68.89 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 46.72 | 48.86 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 51.50 | 53.25 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 18.73 | 20.34 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 19.47 | 20.68 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.47 | 11.13 |

# కోవిడ్‌పై ఫెడ్‌ అస్త్రం!



**అత్యవసరంగా వడ్డీ రేట్లను తగ్గించిన అమెరికా కేంద్ర బ్యాంకు**

**50 బేసిస్‌ పాయింట్ల కోత • కరోనా వైరస్‌ ప్రభావాన్ని నిలువరించేందుకే**

**వాషింగ్టన్‌:** యూఎస్‌ ఫెడరల్‌ రిజర్వ్‌ అత్యవసరంగా కీలక రేట్లను 50 బేసిస్‌ పాయింట్లు (అర శాతం) తగ్గిస్తూ మంగళవారం నిర్ణయాన్ని ప్రకటించింది. కరోనా వైరస్‌ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత విస్తరిస్తుండడంతో, దీన్నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచేందుకు రేట్లను 1–1.25 శాతం స్థాయికి తగ్గించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం తర్వాత ఫెడ్‌ అత్యవసరంగా రేట్ల కోతకు దిగడం మళ్లీ ఇదే మొదటిసారి. ''అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ బలంగా ఉంది. అయితే, కరోనా వైరస్‌తో ఆర్థిక కార్యకలాపాలకు సమస్యలు పొంచి ఉన్నాయి. ఈ రిస్కుల నేపథ్యంలో, గరిష్ట ఉపాధి కల్పనను సాధించేందుకు, ధరల స్థిరత్వ లక్ష్యం కోసం ఫెడరల్‌ ఓపెన్‌ మార్కెట్‌ కమిటీ 'ఫెడరల్‌ ఫండ్స్‌' రేటు లక్ష్యిత శ్రేణిని తగ్గించాలని నిర్ణయించింది'' అని ఫెడ్‌ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి మార్చి 17–18 తేదీల్లో ఫెడ్‌ పాలసీ సమావేశం జరగనుంది. దీనికి మరో 15 రోజుల వ్యవధి ఉంది. కానీ, కరోనా వైరస్‌ అంతర్జాతీయ మాంద్యానికి దారితీసే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో.. ఫెడ్‌ ఈలోపే అత్యవసర రేట్ల కోతకు దిగాల్సి వచ్చింది. గతేడాది రేట్ల కోత తర్వాత తొలి రేట్ల కోత ఇది. గతేడాది మూడు విడతలుగా ఫెడ్‌ రేట్లను తగ్గించి 1.5–1.75 స్థాయికి తీసుకొచ్చింది. 2020లో రేట్లలో ఎటువంటి మార్పులు ఉండవని గతంలో ప్రకటించిన ఫెడ్‌.. కరోనా కారణంగా విధానాన్ని మార్చుకుంది. కాగా, ఆరంభంలో భారీ నష్టాల్లో నడిచిన డౌజోన్స్‌ ఫెడ్‌ రేట్ల కోత ప్రకటన తర్వాత తీవ్ర ఆటుపోట్ల మధ్య ట్రేడయింది. కరోనా భయాలతో గత వారం డౌజోన్స్‌ 14% పడిపోవడం గమనార్హం.

### మాంద్యం భయాలవల్లే...

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 నాటి మాంద్యం నుంచి బయటపడింది కానీ, చెప్పుకోతగ్గ స్థాయిలో రికవరీ కాలేదు. దాదాపు అన్ని సెంట్రల్‌ బ్యాంకులు మళ్లీ మాంద్యంలోకి జారిపోకుండా.. సర్దుబాటు ధోరణులతో రేట్ల తగ్గింపుతోపాటు అన్ని రకాల సాధనాలను వినియోగిస్తున్నాయి. ఇప్పుడు కరోనా వైరస్‌ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారొచ్చన్న ఆందోళన విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో ఫెడ్‌ అత్యవసరంగా రేట్ల కోతను చూడాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మంగళవారం ఉదయం జీ–7 దేశాల(యూఎస్, జపాన్, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా) ఆర్థిక మంత్రులు, సెంట్రల్‌ బ్యాంకుల చీఫ్‌లు అత్యవసరంగా సమావేశం కావడం కూడా ఇందుకే. కరోనా వైరస్‌ను నిలువరించి, ఆర్థిక వ్యవస్థలకు మద్దతుగా ద్రవ్యపరమైన చర్యలు సహా అవసరమైతే అన్ని రకాల చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు జీ–7 దేశాలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. జీ–7 నుంచి ఈ తరహా సంయుక్త ప్రకటనలు 2001 సెప్టెంబర్‌ 11 దాడుల ఘటన, 2008 మాంద్యం సమయాల్లోనూ వెలువడడం గమనార్హం. కరోనా వైరస్‌ 60కుపైగా దేశాలకు వేగంగా విస్తరించిందని, ఇది ప్రస్తుత త్రైమాసికంలో ప్రపంచ ఆర్థిక వృద్ధిని దిగజార్చవచ్చని ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) కూడా ఇప్పటికే హెచ్చరించింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2020లో 2.4%కి తగ్గొచ్చని, వైరస్‌ మరింతగా విస్తరిస్తే 1.5%కి పడిపోయే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. 2% దిగువకు ప్రపంచ వృద్ధి పడిపోతే దాన్ని మాంద్యంగా పరిగణిస్తారు.

### ఆర్థిక వ్యవస్థపై వైరస్‌ ప్రభావం: పావెల్‌



అమెరికా ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్‌ ప్రభావం కొంత కాలం పాటు ఉంటుందన్నారు ఫెడ్‌ చైర్మన్‌ జీరోమ్‌ పావెల్‌. సెంట్రల్‌ బ్యాంకు చర్య ఆర్థిక వ్యవస్థకు తగినంత చేయూతనిస్తుందని తాను నమ్ముతున్నట్టు ఫెడ్‌ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ''ఆర్థిక వృద్ధి అంచనాలకు ఉన్న రిస్కును చూసే ఈ చర్య తీసుకున్నాం. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. బలమైన వృద్ధి, బలమైన లేబర్‌ మార్కెట్‌లోకి తిరిగి మళ్లీ మనం ప్రవేశిస్తామని నేను సంపూర్ణంగా భావిస్తున్నాను'' అని పావెల్‌ పేర్కొన్నారు.

### ఇది సరిపోదు



''ఫెడరల్‌ రిజర్వ్‌ రేట్లను తగ్గిస్తోంది కానీ మరింత తగ్గించాలి. మరీ ముఖ్యంగా ఇతర దేశాలు, పోటీదేశాల స్థాయికి రేట్లు దిగి రావాలి. మనం సహేతుక స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడం లేదు. మరింత రేట్ల కోత దిశగా ఫెడరల్‌ రిజర్వ్‌ అడుగులు వేయాల్సిన సమయం ఇది''

– డొనాల్డ్‌ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

# పసిడి పరుగో... పరుగు!

**అంతర్జాతీయంగా 50 డాలర్లకుపైగా పెరుగుదల • దేశంలోనూ రూ.1,200 అప్‌!**



ఆర్థిక మందగమనం, కరోనా కష్టాల నేపథ్యంలో సరళతర ద్రవ్య విధానాలు అవలంబించడానికి సంబంధించి మీమాంస తగదని అమెరికా సెంట్రల్‌ బ్యాంక్‌– ఫెడ్‌పై అధ్యక్షుడు ట్రంప్‌ సోమవారంనాటి విమర్శలు, దీంతో ఫెడ్‌ వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయంతో పసిడి మళ్లీ భారీగా దూసుకెళ్లింది. ఈ వార్త రాసే సమయంలో(మంగళవారం రాత్రి 10.30కు) అంతర్జాతీయ ఫ్యూచర్స్‌ మార్కెట్‌ నైమెక్స్‌లో ఔన్స్‌ (31.1గ్రా) ధర 50 డాలర్ల పెరుగుదలతో 1,644 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నిజానికి వారం క్రితం ఏడేళ్ల గరిష్టం 1,691 డాలర్లకు చేరిన పసిడి గత వారం ముగిసేనాటికి 1,565 డాలర్ల వరకూ పడిపోయింది.

**రూపాయి...గరిష్టానికి 100 పైసలు దూరంలో..**

ఇక అంతర్జాతీయ ధోరణికి తోడు, దేశంలో రూపాయి బలహీనత పసిడికి వరంగా మారుతోంది. మంగళవారం ఇంటర్‌ బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్‌లో రూపాయి విలువ 43 పైసలు పడిపోయి, 16 నెలల కనిష్ట స్థాయి 73.19కి జారింది. 2018 అక్టోబర్‌ 9న రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. తాజా రూపాయి బలహీనత కూడా తోడు కావడంలో ఈ వార్త రాసే సమయానికి దేశీయ ఫ్యూచర్స్‌ మార్కెట్‌లో పసిడి 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర సోమవారం ముగింపుతో పోల్చితే (రాత్రి 10.30 గంటల సమయంలో) రూ.1,289 లాభంతో రూ.43,245 వద్ద ట్రేడవుతోంది. ఇదే ధోరణి కొనసాగితే బుధవారం పలు పట్టణాల్లోని స్పాట్‌ మార్కెట్లలో పసిడి 10 గ్రాములు స్వచ్ఛత ధర రూ.44,000 దాటిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఫైనాన్షియల్‌ మార్కెట్లు సాఫీగా పనిచేసేందుకు చర్యలు

• కరోనా ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం : ఆర్‌బీఐ ప్రకటన

**ముంబై:** దేశీయంగా, అంతర్జాతీయంగా కరోనా ప్రభావాన్ని పర్యవేక్షిస్తున్నామని, ఫైనాన్షియల్‌ మార్కెట్లు సాఫీగా పనిచేసేందుకు అవసరమైతే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్‌బీఐ ప్రకటించింది. ''దేశీయంగా, అంతర్జాతీయంగా కొనసాగుతున్న పరిణామాలను ఆర్‌బీఐ నిరంతరం సునిశితంగా పరిశీలిస్తోంది. ఫైనాన్షియల్‌ మార్కెట్లు సజావుగా నడిచేందుకు, మార్కెట్లలో విశ్వాసాన్ని కాపాడేందుకు, ఆర్థిక స్థిరత్వం కోసం చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంది'' అంటూ ఆర్‌బీఐ ప్రకటన తెలియజేసింది. అవసరమైతే ప్రభుత్వంతో కలసి ఆర్థిక కార్యకలాపాలు మరింత మందగించకుండా విధానపరమైన చర్యలకు అవకాశం ఉంటుందన్న ఆర్‌బీఐ సంకేతాలు మంగళవారం క్యాపిటల్‌ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్‌కు దారితీయడం గమనార్హం.



''కరోనా వైరస్‌ వ్యాప్తితో అంతర్జాతీయంగా ఫైనాన్షియల్‌ మార్కెట్లు అస్థిరతలను చవిచూస్తున్నాయి. రిస్క్‌ తీసుకునేందుకు వెనుకాడే సెంటిమెంట్‌ ఏర్పడడం తోపాటు, సురక్షిత సాధనాల వైపు ప్రయాణం చేసేలా చేస్తున్నాయి''అని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది. దేశీయంగా రెండు కొత్త కరోనా వైరస్‌ కేసులు నమోదు కావడం, అంతకుముందు అంతర్జాతీయంగా మరిన్ని దేశాలకు కరోనా చేరిందన్న వార్తలతో గత పది రోజుల్లో స్టాక్‌ మార్కెట్లు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే.

## ఆర్‌కామ్‌ దివాలా ప్రణాళికకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం



**న్యూఢిల్లీ:** రిలయన్స్‌ కమ్యూనికేషన్స్‌ దివాలా పరిష్కార ప్రణాళికకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. ఆర్‌కామ్‌ రుణదాతల కమిటీ (సీవోసీ) లోనూ ఎస్‌బీఐ బోర్డు సానుకూలంగా ఓటు వేయనుందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. సీవోసీలో ఆర్‌కామ్‌ పరిష్కార ప్రణాళికపై ఓటింగ్‌ మొదలైందని, ఈ నెల 4న ముగుస్తుందని పేర్కొన్నాయి. పరిష్కార ప్రణాళిక కింద బ్యాంకులకు రూ.23,000 కోట్లు వసూలు కానున్నాయి. యూవీ అస్సెట్‌ రీకన్‌స్ట్రక్షన్‌ కంపెనీ రూ.14,700 కోట్లకు బిడ్‌ వేయగా, రిలయన్స్‌ ఇన్‌ఫ్రాటెల్‌ టవర్, ఫైబర్‌ ఆస్తుల కోసం రిలయన్స్‌ జియో రూ.4,700 కోట్ల బిడ్‌ వేసింది.

## హైదరాబాద్‌లో ర్యాన్‌ రెండవ కేంద్రం

**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** అమెరికాకు చెందిన ట్యాక్స్‌ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్‌ ప్రొవైడర్‌ కంపెనీ ర్యాన్‌ హైదరాబాద్‌లో రెండవ కేంద్రాన్ని ప్రారంభించింది. మాదాపూర్‌లోని సలార్పూరియా సత్వా నాలెడ్జ్‌ సిటీలో 19 వేల చ.అ.ల్లో నూతన సెంటర్‌ను మంగళవారం ర్యాన్‌ చైర్మన్‌ అండ్‌ సీఈఓ బ్రింట్‌ ర్యాన్‌ ప్రారంభించారు. ఈ సెంటర్‌ నుంచి డాటా ప్రాసెసింగ్, మార్కెట్‌ రీసెర్చ్, అసెట్‌ రికవరీ, హ్యూమన్‌ రిసోర్స్‌ అనలిటిక్స్, రొబొటిక్‌ ప్రాసెస్, బిజినెస్‌ ప్రాసెస్‌ మేనేజ్‌మెంట్‌ వంటి సేవలను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. 2013లో అసెండస్‌ వీ పార్క్‌లో తొలి సెంటర్‌తో సేవలను ప్రారంభించిన ర్యాన్‌కు ప్రస్తుతం 500 మంది ఉద్యోగులున్నారు. ఈ ఏడాది అదనంగా 50–60 మందిని నియమించుకుంటామని బ్రింట్‌ తెలిపారు. ఇప్పటివరకు దేశంలో 3 మిలియన్‌ డాలర్ల పెట్టుబడులు పెట్టామన్నారు.

## మరో రూ. 8వేల కోట్లు కట్టిన టెల్కోలు




**న్యూఢిల్లీ:** ఏజీఆర్‌ బకాయిలకు సంబంధించి టెలికం సంస్థలు మంగళవారం మరో రూ. 8,000 కోట్లు కేంద్రానికి చెల్లించాయి. వొడాఫోన్‌ ఐడియా రూ. 3,043 కోట్లు, భారతి ఎయిర్‌టెల్‌ రూ. 1,950 కోట్లు, రిలయన్స్‌ జియో రూ. 1,053 కోట్లు, టాటా టెలీసర్వీసెస్‌ రూ. 2,000 కోట్లు కట్టాయి. ఇప్పటికే పూర్తి సెటిల్‌మెంట్‌ కోసం రూ. 2,197 కోట్లు కట్టామన్న టాటా టెలీసర్వీసెస్‌.. ఒకవేళ లెక్కల్లో వ్యత్యాసాలేమైనా వచ్చినా సర్దుబాటు చేసేందుకు వీలుగా అదనపు మొత్తం కట్టినట్లు వెల్లడించింది. మరోవైపు, వొడాఫోన్‌ ఐడియా(వీఐఎల్‌) సీఈవో రవీందర్‌ టక్కర్‌ మరోసారి టెలికం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాష్‌తో భేటీ అయ్యారు. అయితే, సమావేశం వివరాలు ఆయన వెల్లడించలేదు. అటు.. వీఐఎల్‌ ఎప్పట్లోగా బాకీల స్వీయ మదింపు పూర్తి చేస్తుందన్న ప్రశ్నకు స్పందించేందుకు టక్కర్‌ నిరాకరించారు. సవరించిన స్థూల ఆదాయ (ఏజీఆర్‌) లెక్కల ప్రకారం లైసెన్సు ఫీజు, స్పెక్ట్రం యూసేజీ చార్జీ (ఎస్‌యూసీ) బాకీల కింద 15 టెలికం సంస్థలు.. సుమారు రూ. 1.47 లక్షల కోట్లు కట్టాల్సి ఉంది. ఏజీఆర్‌ బాకీల విషయంలో టెల్కోల స్వీయ మదింపు, తమ లెక్కల్లో వ్యత్యాసాలు వచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై ఆయా సంస్థలకు టెలికం శాఖ త్వరలోనే లేఖలు పంపనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## జీప్‌ రాంగ్లర్‌ రూబికాన్‌ @ రూ.68.94 లక్షలు



**న్యూఢిల్లీ:** ఎఫ్‌సీఏ ఇండియా కంపెనీ జీప్‌ రాంగ్లర్‌ రూబికాన్‌ ఎస్‌యూవీ మోడల్‌ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ధర రూ.68.94 లక్షలుగా నిర్ణయించామని ఎఫ్‌సీఏ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ పార్థ దత్తా తెలిపారు. ఐదు డోర్ల, ఈ ఫోర్‌–వీల్‌ ఎస్‌యూవీని దిగుమతి చేసుకొని విక్రయిస్తామని, ఈ నెల 15 నుంచి డెలివరీలు మొదలవుతాయని వివరించారు. తమ సీబీయూ(కంప్లీట్లీ బిల్ట్‌ యూనిట్‌) అమ్మకాల్లో జీప్‌ రాంగ్లర్‌ వాటా 67 శాతమని తెలిపారు. జీప్‌ రాంగ్లర్‌ రూబికాన్‌ను నాలుగు సిలిండర్ల, టర్బోచార్జ్‌డ్‌ టూ–లీటర్‌ పెట్రోల్‌ ఇంజిన్‌తో రూపొందించామని దత్తా పేర్కొన్నారు. డ్రైవర్‌కు, ముందు వరుస ప్రయాణికుడికి ఎయిర్‌బ్యాగ్‌లు, ప్యాసింజర్‌ సైడ్‌ ఎయిర్‌బ్యాగ్‌లు, పార్క్‌ అసిస్ట్, యాంటీ–లాక్‌ బ్రేకింగ్, హిల్‌ డిసెంట్‌ కంట్రోల్‌ తదితర ఫీచర్లున్నాయని పేర్కొన్నారు.

## మహిళలకు రూ. 17వేల కోట్ల రుణాలు

**స్టాండప్‌ ఇండియా స్కీమ్‌ కింద మంజూరు**




**న్యూఢిల్లీ:** 'స్టాండప్‌ ఇండియా' పథకం కింద రుణాలు పొందిన వారిలో దాదాపు 81 శాతం మంది మహిళలు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. నాలుగేళ్ల వ్యవధిలో వారు రూ. 16,712 కోట్ల రుణాలు పొందినట్లు వివరించింది. '2020 ఫిబ్రవరి 17 నాటికి స్టాండప్‌ ఇండియా స్కీమ్‌ కింద ఖాతాదారుల్లో 81 శాతం మంది మహిళలు ఉన్నారు. 73,155 ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయి. మహిళలు సాధికారతతో మరింత మెరుగైన జీవితాన్ని సాగించేందుకు, వ్యాపారవేత్తలుగా తమ ఆకాంక్షలను సాకారం చేసుకునేందుకు ఈ పథకాలు తోడ్పడ్డాయి' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి బ్యాంకు శాఖ పరిధిలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు కొత్తగా సంస్థను ప్రారంభించేందుకు.. కనీసం ఒక్కరికైనా రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి దాకా రుణాలిచ్చే ఉద్దేశంతో 2016 ఏప్రిల్‌ 5న స్టాండప్‌ ఇండియా స్కీమ్‌ను కేంద్రం ప్రారంభించింది.

## కోపరేటివ్‌ బ్యాంకుల పటిష్టతకు బిల్లు

**లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం**



**న్యూఢిల్లీ:** డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు వీలుగా కోపరేటివ్‌ బ్యాంకులను ఆర్‌బీఐ నియంత్రణల పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో మంగళవారం 'బ్యాంకింగ్‌ రెగ్యులేషన్‌ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టింది. ఉభయసభల ఆమోదం అనంతరం ఇది చట్టంగా అమల్లోకి రానుంది. పంజాబ్‌ అండ్‌ మహారాష్ట్ర కోపరేటివ్‌ బ్యాంకు (పీఎంసీ బ్యాంకు) తరహా సంక్షోభాలు భవిష్యత్తులో జరగకుండా చూసేందుకు ఈ బిల్లు తక్షణావసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ సభకు తెలిపారు. పీఎంసీలో జరిగిన పరిణామాలు దురదృష్టవశాత్తు చిన్న డిపాజిటర్లను సమస్యలపాలు చేశాయన్నారు. ఈ బిల్లుతో కోపరేటివ్‌ బ్యాంకులు ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి వచ్చినప్పటికీ.. పాలనాపరమైన అంశాల పర్యవేక్షణ రిజిస్ట్రార్‌ ఆఫ్‌ కోపరేటివ్స్‌ పరిధిలోనే ఉండనుంది. సరైన నియంత్రణ, మెరుగైన నిర్వహణ ద్వారా కోపరేటివ్‌ బ్యాంకులను వాణిజ్య బ్యాంకుల మాదిరిగా పటిష్టం చేయడం బిల్లు లక్ష్యంగా ప్రభుత్వం తెలియజేసింది.

## ఐటీ ఎగుమతులకు డిజిటల్‌ దన్ను

**సాఫ్ట్‌వేర్‌ ఎగుమతుల్లో 9% వృద్ధి అంచనా**

**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** దేశానికి డిజిటల్‌ వెన్నెముకగా మారిందని, ప్రధానంగా ఐటీ ఎగుమతుల వృద్ధికి బ్లాక్‌ చెయిన్, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ), క్లౌడ్‌ కంప్యూటింగ్‌ వంటి డిజిటల్‌ టెక్నాలజీ దన్నుగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అరుణ్‌ గోయల్‌ తెలిపారు. గత దశాబ్ద కాలంగా దేశంలో బలమైన ఐటీ మౌలిక వసతులను ఏర్పాటైందని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ బ్యాంక్‌ ఖాతాలు, మొబైల్, ఇంటర్నెట్‌ సేవల వినియోగం పెరిగిందని చెప్పారు. రెండు రోజుల ఇండియాసాఫ్ట్‌ ఇంటర్నేషనల్‌ ఐసీటీ ఎగ్జిబిషన్‌ మంగళవారమిక్కడ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ రావు మాట్లాడుతూ.. దేశీయ ఐటీ ఎగుమతులు 8 శాతం వృద్ధి రేటులో ఉంటే.. తెలంగాణ ఐటీ ఎగుమతులు 17–18 శాతం వృద్ధిలో ఉన్నాయని తెలిపారు. గతేడాది ఐటీ పరిశ్రమ 14 మిలియన్‌ చ.అ. ఆఫీస్‌ స్పేస్‌ లావాదేవీలను నిర్వహించాయని పేర్కొన్నారు. 2019–20 సంవత్సరంలో దేశీయ సాఫ్ట్‌వేర్‌ ఎగుమతుల్లో 9 శాతం వృద్ధి ఉంటుందని ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌ ఎక్స్‌పోర్ట్‌ ప్రమోషన్‌ కౌన్సిల్‌ (ఈఎస్‌సీ) చైర్మన్‌ మణ్‌దీప్‌ సింగ్‌ పురీ తెలిపారు. 1980లో 80 మిలియన్‌ డాలర్లుగా ఉన్న సాఫ్ట్‌వేర్‌ ఎగుమతులు ప్రస్తుతం 150 బిలియన్‌ డాలర్లకు చేరాయని.. ఇందులో ఈఎస్‌సీ కీలక పాత్ర వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా దేశీయంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు ఐసీటీ వ్యాపార విస్తరణతో పాటూ ఆఫ్రికా, లాటిన్‌ అమెరికా, సార్క్‌ దేశాల్లో ఎంట్రీకి మార్గం సులువవుతుందని ఇండియాసాఫ్ట్‌ చైర్మన్‌ నలిన్‌ కోహ్లి తెలిపారు.




సదస్సులో పాల్గొన్న అరుణ్‌ గోయల్‌ తదితరులు

## బులియన్‌ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,050 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,000 | | 0 |
| వెండి (కిలో) | 48,500 | ▼ | 100 |
| **హైదరాబాద్‌/చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,260 | ▲ | 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,250 | ▲ | 200 |
| వెండి (కిలో) | 48,500 | ▼ | 100 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,600 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,450 | | 0 |
| వెండి (కిలో) | 46,400 | ▼ | 100 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,270 | ▲ | 350 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,250 | ▲ | 330 |
| వెండి (కిలో) | 46,000 | ▲ | 1000 |
| **ఏపీ బులియన్‌ అసోసియేషన్‌** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,500 | ▲ | 230 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,250 | ▲ | 200 |
| వెండి (కిలో) | 46,300 | | 0 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్‌ -నెక్‌/100కు రూ.లలో) 4-3-2020

| | |
|---|---|
| విశాఖ | 350–00 |
| చిత్తూరు | 343–00 |
| వరంగల్‌ | 298–00 |
| విజయవాడ | 310–00 |
| గోదావరి | 310–00 |
| **3–3–2020 ఫామ్‌ ధర...** | |
| హైదరాబాద్‌ | 295–00 |

## ఔషధాల ఎగుమతులపై ఆంక్షలు

• 26 ఏపీఐలు, మందులకు వర్తింపు
• జాబితాలో పారాసెటమల్, బీ1, బీ12



**న్యూఢిల్లీ:** చైనాలో కరోనా వైరస్‌ ప్రబలిన నేపథ్యంలో దేశీయంగా ఔషధాల లభ్యతకు సమస్యలు లేకుండా చూడటంపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 26 యాక్టివ్‌ ఫార్మా ఇంగ్రీడియంట్స్‌ (ఏపీఐ), ఔషధాల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. పారాసెటమల్, విటమిన్‌ బీ1, బీ12 మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. తాజా ఆంక్షలతో ఇకపై వీటి ఎగుమతుల కోసం డైరెక్టరేట్‌ జనరల్‌ ఆఫ్‌ ఫారిన్‌ ట్రేడ్‌ (డీజీఎఫ్‌టీ) నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. తదుపరి ఆదేశాలిచ్చే వరకూ ఆంక్షలు కొనసాగుతాయని డీజీఎఫ్‌టీ మంగళవారం ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఔషధాల తయారీలో కీలకమైన ఏపీఐల కోసం భారత్‌ ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతున్నప్పటికీ .. పరిమిత స్థాయిలో ఎగుమతులు కూడా చేస్తోంది. కరోనా వైరస్‌ ధాటికి చైనా నుంచి సరఫరా దెబ్బతిన్న కారణంగా .. దేశీయంగా ఏపీఐలు, ఔషధాల కొరత తలెత్తకుండా కేంద్రం తాజా చర్యలు తీసుకుంది. కేంద్ర ఫార్మా విభాగం ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి కమిటీ.. ఈ మేరకు సిఫార్సులు చేసింది.

# ఏడు రోజుల నష్టాలకు బ్రేక్‌

• వివిధ కేంద్ర బ్యాంక్‌ల ఉద్దీపన చర్యలపై ఆశలు
• తగిన చర్యలు తీసుకుంటామని అభయమిచ్చిన ఆర్‌బీఐ
• 480 పాయింట్ల లాభంతో 38,624కు సెన్సెక్స్‌
• 11,303కు నిఫ్టీ; 171 పాయింట్లు అప్‌

ఏడు రోజుల వరుస నష్టాల అనంతరం మంగళవారం స్టాక్‌మార్కెట్‌ లాభాల్లో ముగిసింది. కోవిడ్‌–19(కరోనా) వైరస్‌ కల్లోలంతో తలెత్తిన ఆర్థిక ప్రతికూలతలను అధిగమించడానికి వివిధ దేశాల కేంద్ర బ్యాంక్‌లు ఉద్దీపన చర్యలు ఇవ్వనున్నాయన్న ఆశలతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. ఈ సానుకూలతతో మన మార్కెట్‌ కూడా భారీగా లాభపడింది. అయితే ట్రేడింగ్‌ ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగింది. సెన్సెక్స్‌ చివరకు 480 పాయింట్లు లాభపడి 38,624 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 171 పాయింట్లు పెరిగి 11,303 పాయింట్ల వద్ద ముగిశాయి. ముడి చమురు ధరలు 2.9 శాతం మేర పెరిగినా, మన మార్కెట్‌ ముందుకే దూసుకుపోయింది. ఆర్థిక మార్కెట్లు కోలుకోవడానికి తగిన చర్యలు తీసుకోగలమని ఆర్‌బీఐ అభయమివ్వడం సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ అర శాతం రేట్లను తగ్గించడంతో యూరప్‌ మార్కెట్లు 1% మేర లాభపడ్డాయి.



**ఫార్మా షేర్ల జోరు....**

కోవిడ్‌–19(కరోనా) వైరస్‌ చికిత్సలో ఉపయోగపడే కొన్ని ఔషధాల తయారీ విషయంలో పురోగతి సాధించామని ఫైజర్‌ మాతృకంపెనీ వెల్లడించింది. మరోవైపు కొన్ని ఔషధాల ఎగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించడంతో దేశీయ మార్కెట్లో సరఫరాలు పుంజుకోనున్నాయి. ఈ రెండు అంశాల కారణంగా ఫార్మా షేర్లు జోరుగా పెరిగాయి. ఇంట్రాడేలో ఆల్‌టైమ్‌ హై, రూ.4,930ను తాకిన ఫైజర్‌ చివరకు 4 శాతం లాభంతో రూ. 4,416 వద్ద ముగిసింది. మెట్రోపాలిస్‌ హెల్త్‌కేర్, బ్లిస్‌ జీవీఎస్‌ ఫార్మా, ఆర్‌పీజీ లైఫ్‌ సైన్సెస్, డాక్టర్‌ లాల్‌ పాథ్‌ ల్యాబ్స్, బయకాన్, తదితర షేర్లు 3 శాతం మేర ఎగిశాయి.

### 3 ఐపీఓలకు సెబీ ఓకే..

హోమ్‌ ఫస్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ, ఈక్విటాస్‌ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్, ఇండియన్‌ రైల్వే ఫైనాన్స్‌ కార్పొరేషన్‌(ఐఆర్‌ఎఫ్‌సీ) ఐపీఓలకు సెబీ గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. ఈ ఐపీఓల ద్వారా హోమ్‌ ఫస్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ రూ.1,500 కోట్లు, ఈక్విటాస్‌ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌ రూ.1,000–1,100 కోట్లు, ఐఆర్‌ఎఫ్‌సీ రూ.2,500 కోట్లమేర నిధులు సమీకరిస్తాయని అంచనా.



## వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

**యాదగిరిగుట్ట:** శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రధాన ఘట్టాలకు చేరుకున్నాయి. మంగళవారం రాత్రి బాలాలయంలో స్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని జగన్మోహిని అలంకార సేవలో ఊరేగించారు. రాత్రి 9 గంటలకు అశ్వవాహనంపై పెళ్లికొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై అమ్మవారిని సేవోత్సవంగా ఊరేగించారు. కల్యాణోత్సవానికి టీటీడీ పక్షాన బోర్డు సభ్యుడు కె.శివకుమార్, డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్‌లు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.



ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డు

## ఎంజీఎంలో ‘కరోనా’ వార్డు

**ఎంజీఎం:** కోవిడ్ –19 (కరోనా) వైరస్ బాధితుల కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. 25 పడకలతో కూడిన ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఆర్‌ఎంఓ హరీశ్‌రాజు పర్యవేక్షణలో వైద్య బృందం పర్యవేక్షిస్తుందన్నారు.



డీజే సౌండ్స్‌తో ప్రవీణ్ అంతిమ యాత్ర నిర్వహిస్తున్న మిత్రులు

## అంత్యక్రియల్లో డీజే

**ముత్తారం (మంథని):** ‘రాజధాని నగరంలో చావు కూడా పెళ్లిలాంటిదే బ్రదర్..’అన్నాడు మహాకవి శ్రీశ్రీ.. ఆయన ఎప్పుడో రాసిన పాట.. ఇప్పుడు పల్లెల్లోనూ నిజమైంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన సామల ప్రవీణ్ (23) ప్రియురాలికి మరొకరితో పెళ్లి నిశ్చయమైందని ఫిబ్రవరి 28న ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. అతడి మిత్రులు కూడా గ్రామానికి వచ్చి.. ప్రాణస్నేహితుడి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించేందుకు డీజే సౌండ్స్ ఏర్పాటు చేసి అంతిమయాత్ర నిర్వహించారు.



## మ్యూజియంగా పీవీ ఇల్లు

- వంగరలోని నివాస గృహం సుందరీకరణ

**భీమదేవరపల్లి:** మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావు స్వగ్రామమైన వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని ఆయన స్వగృహం ఇక మ్యూజియంగా మారనుంది. పీవీ శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని ఆయన తనయుడు పీవీ ప్రభాకర్ రావు చేపట్టనున్నారు. పీవీ నివసించిన ఇల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని సుందరీకరించడంతోపాటు సమీపంలోనే మరో నూతన గృహాన్ని నిర్మించారు. మ్యూజియంలో పీవీ ఉపయోగించిన సుమారుగా 150 రకాల వస్తువులు ప్రదర్శనకు ఉంచనున్నారు. కాగా, వచ్చే నెల 13, 14, 15వ తేదీల్లో నూతన గృహప్రవేశంతో పాటుగా మ్యూజియాన్ని గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు.



పూరిగుడిసెలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో కూర్చున్న చిన్నారులు

## అవునూ.. ఇది అంగన్‌వాడీ కేంద్రమే!

**మెదక్ రూరల్:** ఈ చిత్రంలో ఉన్నది గుడిసే కాదు.. అంగన్‌వాడీ కేంద్రం. మెదక్ జిల్లా వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని తండాలో కొన్నేళ్లుగా ఈ పూరి గుడిసెలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరిపడా గదులు, మరుగుదొడ్లు, నీరు, విద్యుత్ లాంటి వసతులు కల్పించాల్సి ఉండగా అది జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు.

## గిరిజన సంఘం అధ్యక్షుడిగా ధర్మానాయక్

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** గిరిజన సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మూడావత్ ధర్మానాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ శ్రీరాంనాయక్, ఉపాధ్యక్షులుగా దీరావత్ రవినాయక్, గుగులోత్ ధర్మానాయక్, గుగులోతు భీమాసాహెబ్‌తోపాటు మరో 53 మందితో కమిటీని ఎన్నుకున్నారు.



ధర్మానాయక్



## పచ్చదనాల పల్లె సీమ

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి ప్రాంతంలో ఎటు చూసినా పచ్చని పొలాలు ఉండటంతో కోనసీమలా కనపడుతోంది. ఈసారి సాగునీరు సమృద్ధిగా ఉండటం వల్ల రైతులు అధిక శాతం వరిని సాగు చేశారు. దీంతో కనుచూపు మేర పచ్చదనం ఉట్టి పడుతోంది. పంటలు బాగా పండుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సుల్తానాబాద్ రూరల్

# టెర్రర్.. ట్రాన్స్‌ఫర్!

## టెర్రరిస్టు లింకుతో జమ్మూలో రాకేశ్ అరెస్టు

- రాకేశ్ అకౌంట్‌కు డబ్బులు పంపిన జగిత్యాల జిల్లా వాసి
- విచారణకు జిల్లాకు చేరుకున్న జమ్మూ పోలీసులు
- రెండు రోజులుగా విచారణ సాగిస్తున్న వైనం



సరికెల లింగన్న

**సాక్షి, జగిత్యాల:** టెర్రరిస్టు లింకులపై విచారణలో భాగంగా జమ్మూకశ్మీర్ పోలీసులు జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు రావడం స్థానికంగా కలకలం రేపింది. మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన సరికెల లింగన్నను రెండు రోజులుగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. జమ్మూ జిల్లాలోని అర్నియా పట్టణంలో ఉన్న ఆర్మీబేస్ క్యాంపులో కూలీగా పనిచేసే రాకేశ్‌కుమార్‌పై ఆర్మీ అంతర్గత సమాచారాన్ని ఉగ్రవాదులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలతో జనవరి 5న కేసు నమోదైంది. రాకేశ్‌ను జమ్మూ పోలీసులు అదే నెల 20న అదుపులోకి తీసుకుని విచారించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన సరికెల లింగన్న బ్యాంకు ఖాతా నుంచి రాకేశ్‌కుమార్ ఖాతాకు ఫిబ్రవరి 13న రూ.ఐదు వేలు, 25న రూ.4 వేల చొప్పున రెండు సార్లు నగదు జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. విచారణ నిమిత్తం సోమవారం ఉదయం జిల్లాకు చేరుకున్న జమ్మూ పోలీసుల బృందం లింగన్నను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. లింగన్న బావ శ్రీనివాస్‌ది మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామం. శ్రీనివాస్ పదేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నాడు. అక్కడ తనకు తెలిసిన ఓ పాక్ మిత్రుడు డబ్బు అవసరమని కోరితే శ్రీనివాస్ విన్నపం మేరకు లింగన్న తేజ్ యాప్ ద్వారా రెండుసార్లు డబ్బులు పంపినట్లు లింగన్న కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

### హనీట్రాప్ కలకలం

జమ్మూ జిల్లాలోని అర్నియా ఆర్మీ క్యాంపు సమీపంలోని పావల్‌కు చెందిన రాకేశ్‌కుమార్ ఆర్మీ శిబిరంలోనే కూలి పనులు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనితజెట్టి అనే మహిళ రాకేశ్‌కుమార్‌తో ఫేస్‌బుక్‌లో పరిచయం అయినట్లు తెలుస్తోంది. తనకు తాను జర్నలిస్టుగా పరిచయం చేసుకున్న అనితజెట్టి వృత్తిరీత్యా ఆర్మీకి సంబంధించిన సమాచారం తనకు ఇవ్వాలని కోరడంతోపాటు డబ్బు ఆశ చూపినట్లు సమాచారం. ఆమె ట్రాప్‌లో పడ్డ రాకేశ్‌కుమార్.. ఆర్మీక్యాంపు ప్రాంతంలో ఉన్న ఎత్తయిన ప్రాంతాలు, వాటర్ ట్యాంకులు, రైల్వేలైన్లు, రోడ్లు తదితర కీలక సమాచారం, ఫొటోలను ఫేస్‌బుక్ ద్వారా అనితజెట్టికి పంపడంతోపాటు తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### విచారణ సాగుతోంది: ఎస్‌ఐ

ఆర్మీ క్యాంపు సమాచారం ఇతరులకు చేరవేసినందుకు జనవరి 5న రాకేశ్‌కుమార్‌పై జమ్మూలోని అర్నియాలో కేసు నమోదైంది. రాకేశ్‌కుమార్ బ్యాంకు ఖాతాకు మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన లింగన్న ఖాతా నుంచి రెండుసార్లు నగదు జమైనట్లు తేలడంతో జమ్మూ పోలీసులు విచారణ చేపడుతున్నారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.

## జవాబుదారీతనం పెరిగింది

- కొత్త మున్సిపల్ చట్టంపై మంత్రి హరీశ్‌రావు
- స్వచ్ఛ తెలంగాణ లక్ష్యమే పట్టణ ప్రగతి కార్యక్రమం



కూరగాయలు విక్రయించే మహిళతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**సాక్షి, సిద్దిపేట:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అద్దంలా తయారు అవుతున్నాయని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరిగి మహిళలు, పట్టణ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సమీకృత మార్కెట్, మటన్, కూరగాయల విక్రయ కేంద్రాలను ప్రారంభించి అక్కడున్న రైతులతో మాట్లాడారు. కొత్త మున్సిపల్ చట్టంతో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారుల్లో జవాబుదారీతనం పెరిగిందని అన్నారు. గతంలో ఉన్న మున్సిపల్ చట్టంతో ఒక్కసారి గెలిచిన ప్రజాప్రతినిధి ఐదేళ్ల వరకు ప్రజల సమస్యలు పట్టించుకోక పోయినా పదవి అలాగే ఉండేదని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. కొత్త చట్టం ప్రకారం ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, ప్రజలకు కనీస అవసరాలు తీర్చలేని వార్డు కౌన్సిలర్లను తొలగించే అవకాశం ఉందన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వంతో పల్లెలు, పట్టణాలు మురికి కూపాలుగా మారాయని అన్నారు. దీనిని గమనించిన సీఎం కేసీఆర్ ముందుగా పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టి పల్లెలను అందంగా మార్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పుడు పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల ప్రధాన లక్ష్యం స్వచ్ఛ తెలంగాణ ఏర్పాటే అని అన్నారు. బెంగళూరు వంటి నగరాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని, అక్కడ ప్రజలతోపాటు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఉందని చెప్పారు. ప్రతీ వార్డులో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్ ఉందని వివరించారు. బెంగళూరును స్ఫూర్తిగా తీసుకొని సిద్దిపేటలో 6 వార్డుల్లో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముజామీల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి శరీరం నుంచి సూదులు బయటకు తీసిన డాక్టర్లు

**వీపనగండ్ల:** మూడేళ్ల బాలుడి శరీరంలో నుంచి 8 సిరంజీ సూదులను వనపర్తి వైద్యులు చికిత్స చేసి బయటకు తీశారు. వీపనగండ్లకు చెందిన అశోక్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు లోక్‌నాథ్ (3) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యులకు చూపించగా స్కానింగ్ చేయడంతో బాలుడి శరీరంలో పది సిరంజీ సూదులు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం రాత్రి ఆపరేషన్ చేసి 8 సూదులను బయటకు తీశారు. బొడ్డుకు సమీపంలో మరో రెండు సూదులు ఉన్నాయని, మరికొంత సమయం తీసుకొని వాటిని కూడా తొలగిస్తామని వైద్యులు చెప్పారు. తన కుమారుడి శరీరంలోకి సూదులు ఎక్కించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





1) బాలుడి శరీరంలో సూదులు..
2) శస్త్ర చికిత్సచేసి బయటకు తీసిన సూదులు

## యువతిపై లైంగికదాడి

- మాట్లాడుతామని పిలిచి కిడ్నాప్
- నాలుగు రోజుల పాటు నిర్బంధం
- సహకరించిన మరో ముగ్గురు
- ఫోన్‌సిగ్నల్ ఆధారంగా పట్టుకున్న పోలీసులు

**దండేపల్లి:** మంచిర్యాల జిల్లా దండేపల్లికి చెందిన ఓ యువతిని నిర్బంధించిన ఓ యువకుడు నాలుగు రోజులుగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. లక్సెట్టిపేట సీఐ నారాయణనాయక్ దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. దండేపల్లికి చెందిన ఓ యువతి (19) ఇంటర్ వరకు చదువుకుని కూలీ పనులకు వెళ్తోంది. ఫిబ్రవరి 25న అదృశ్యం కావడంతో అదే నెల 27న దండేపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమె కోసం ఫోన్ నంబర్ ఆధారంగా ట్రేస్ చేయగా ఈ నెల 2వ తేదీన మంచిర్యాల మెడ్‌లైఫ్ ఆసుపత్రి సమీపంలో ఉన్నట్లు మెసేజ్ వచ్చింది. యువతి ఆచూకీ తెలుసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. నిందితుల ఆకృత్యాలు వెలుగు చూశాయి. మంచిర్యాల తిలక్‌నగర్‌కు చెందిన బొడ్డ సాయికృష్ణ నంబర్ నుంచి కొద్దిరోజుల క్రితం యువతికి ఫోన్ వచ్చింది. ఎవరు మాట్లాడేది అని అడగగా.. తాను సాయికృష్ణ అని పరిచయం చేసుకున్నాడు. రాంగ్‌కాల్ అని యువతి చెప్పినా వినకుండా పదేపదే ఫోన్ చేసి వేధిస్తున్నాడు. గత నెల 25న ఫోన్ చేసి తాను దండేపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్నానని, ఇక్కడకొస్తే మాట్లాడుదామని సూచించగా.. వార్నింగ్ ఇద్దామని ఆ యువతి వెళ్లింది. అయితే.. సాయికృష్ణ, మంచిర్యాల తిలక్‌నగర్‌కు చెందిన బందెల శివకృష్ణ (28) ఇద్దరూ కలిసి ఓ ట్రాలీ ఆటోలో ఎక్కించుకుని రామకృష్ణాపూర్ బీజోన్‌లో మూతపడిన సీవీ రామన్ స్కూల్‌కు తీసుకెళ్లారు.



సీఐ నారాయణనాయక్

అక్కడ బీజోన్‌కు చెందిన శశికాంత్ (22), మరో బాలుడు (17) ఉన్నారు. శశికాంత్ సదరు యువతిపై లైంగిక దాడి చేశాడు. మిగిలిన ముగ్గురు బయట కాపలా ఉంటూ అతడికి సహకరించారు. గత నెల 27న యువతిని మంచిర్యాలలోని శివకృష్ణ బంధువుల ఇంట్లో ఉంచి బయటకు వెళ్లవద్దని బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకుని బయటకు రావడంతో అప్పటికే ఆమె ఫోన్‌ను ట్రేస్ చేస్తున్న పోలీసులకు సిగ్నల్ వచ్చింది. దాని ఆధారంగా పోలీసులు ఆమె ఆచూకీ తెలుసుకుని పట్టుకున్నారు. మంగళవారం నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ‘సన్న’గా దోపిడీ..!

- సన్న బియ్యం కొనుగోళ్లలో అవకతవకలు
- యూపీ, కర్ణాటక నుంచి బీపీటీని పోలిన బియ్యం దిగుమతి
- వాటినే సర్కారుకు అంటగడుతున్న వైనం

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** సన్నబియ్యం కొనుగోళ్లలో భారీగా అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. ఉత్తరప్రదేశ్, కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వంటి ప్రాంతాల నుంచి నాన్ బీపీటీ రకాల బియ్యాన్ని దిగుమతి చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా సర్కారుకు అంటగడుతున్నారు. నిబంధనల ప్రకారం స్థానిక రైతుల వద్దే బీపీటీ రకం ధాన్యాన్ని కొనుగోలు చేసి, సర్కారుకు విక్రయించాలి. రాష్ట్రంలోని రైతులకు కనీస మద్దతు ధర దక్కుతుందనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ నిబంధనను చేర్చింది. కానీ అక్రమాల్లో ఆరితేరిన కొందరు బడా రైస్‌మిల్లర్లు నిబంధనను తుంగలో తొక్కి ఇతర రాష్ట్రాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకుని సర్కారును బురిడీ కొట్టిస్తున్నారు. ప్రభుత్వ బడులు, హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన భోజనం పెట్టేందుకు ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే.

### క్వింటాలుపై రూ.500

మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం బీపీటీ బియ్యాన్ని క్వింటాలుకు రూ.3,350 (స్టీమ్), రూ.3,250 (రా) చొప్పున కొనుగోలు చేస్తోంది. ఈ ధరకు విక్రయించిన మిల్లర్లకు మంచి లాభాలు ఉన్నాయి. ఇలా ప్రభుత్వానికి సరఫరా చేసే మిల్లర్లు స్థానికంగా రైతులు పండించిన బీపీటీ ధాన్యాన్నే కొనుగోలు చేయాలి. కానీ అధిక లాభాల కోసం బీపీటీని పోలి ఉండే యూపీ నుంచి రూపాలి, కర్ణాటక నుంచి నాన్ బీపీటీ, నెల్లూరు నుంచి ఎన్‌ఎల్‌ఆర్ రకాలను దిగుమతి చేసుకుంటున్నారు. ఈ రకం బియ్యం ఒక్కో క్వింటాలుకు రూ.2,800, రూ.2,700 మాత్రమే ఇక్కడికి తెప్పించుకుని సర్కారుకు అంటగడుతున్నారు. దీంతో ఒక్కో క్వింటాపై సుమారు రూ.500 వరకు లాభాలను ఆర్జిస్తున్నారు. ఇలా నిజామాబాద్ జిల్లాలోనే ఈ ఏడాది ఇప్పటి వరకు స్టీమ్, రా రెండు రకాలు కలిపి సుమారు 4,873 టన్నుల బీపీటీ బియ్యం కొనుగోలు చేశారు. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న బియ్యమే అధికంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్మల్ జిల్లా విద్యార్థుల అవసరాల కోసం కూడా నిజామాబాద్ నుంచే బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

### బోగస్ ఎమ్మెస్పీ పత్రాలు

ఇతర రాష్ట్రాల్లో బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న మిల్లర్లు జిల్లాలోనే ధాన్యం కొనుగోలు చేసినట్లు బోగస్ ఎమ్మెస్పీ పత్రాలను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో రైతు వద్ద లారీల కొద్దీ బీపీటీ ధాన్యం కొన్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఎమ్మెస్పీ పత్రాలను పరిశీలిస్తే ఈ కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు వెలుగు చూసే అవకాశముంది.

### నాణ్యతలో భారీగా తేడాలు

నూకలున్న సన్న బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలంటే ఎవరూ కొనుగోలు చేయరు. అలాగే డిస్‌కలర్ (మెరిగ), బియ్యం ఏ మాత్రం తేడాగా ఉన్నా కొనేందుకు ఇష్టపడరు. కానీ సర్కారుకు విక్రయిస్తున్న ఈ బియ్యంలో నూక శాతం ఒకటి, డిస్ కలర్, 5 శాతం వరకు డ్యామేజీ ఉన్నా.. అధికారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొందరు మిల్లర్లు నాణ్యత లేని సన్న బియ్యాన్ని సర్కారుకు అంటగట్టి పెద్ద మొత్తంలో దండుకుంటున్నారు.

### విద్యార్థులు, రైతులకు నష్టం

అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం ధాన్యం దిగుమతి చేసుకుని సర్కారుకు అంటగట్టడం ద్వారా స్థానికంగా రైతులు పండించిన బీపీటీ రకం ధాన్యానికి డిమాండ్ ఉండటం లేదు. దీంతో రైతులు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. దీనికి తోడు నాణ్యమైన బియ్యం సరఫరా కాకపోవడంతో విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న బియ్యంతో వండిన అన్నంలో నాణ్యత ఉండదు. దీంతో సర్కారు నిధులు ఖర్చవుతున్నప్పటికీ, పథకం నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదు.



### నాణ్యతలో రాజీ లేదు

బియ్యం నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు. నాణ్యమైన బియ్యాన్నే తీసుకుంటున్నాం. బియ్యం శాంపిల్‌ను తీసి వంట చేసి చూస్తున్నాం. అన్నం బాగా అయితేనే ఆ బియ్యాన్ని సేకరిస్తున్నాం. ఇతర రాష్ట్రాల బియ్యాన్ని తీసుకోవడం లేదు. జిల్లాలోనే బీపీటీ ధాన్యం అందుబాటులో ఉంది.

– గౌరీశంకర్, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌చార్జి

## పరిశ్రమలో ప్రమాదం ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**మనోహరాబాద్:** ప్రమాదవశాత్తు బంకర్లలోని ఇనుప చూర్ణం ఇద్దరి కార్మికులపై పడటంతో వారు మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోని మహాలక్ష్మి ప్రొఫైల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని ఓ పరిశ్రమ నుంచి స్పాంజ్ ఐరన్ చూర్ణం మెటీరియల్‌ను కాళ్లకల్ పరిశ్రమకు నిత్యం రవాణా చేస్తారు. అందులో భాగంగా లారీలో లోడ్‌తో వెలిమినేడుకు చెందిన నర్సింహా చిన్న కుమారుడు సుమన్ (25) పరిశ్రమకు వచ్చి బంకర్‌లో లోడ్ చేశాడు. తర్వాత లారీలో ఉన్న డస్ట్‌ను ఊడ్చేందుకు అక్కడే పనిచేసే మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్నా జిల్లాకు చెందిన కార్మికుడు మహేశ్ జాదవ్ (26) వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న క్రేన్ ఒక్కసారిగా విరిగి బంకర్లపై పడటం, ఆ బంకర్లు పెద్ద శబ్దంతో అక్కడే ఉన్న లారీపై పడ్డాయి. దీంతో లారీలో ఉన్న సుమన్, మహేశ్‌జాదవ్‌లు మృతి చెందారు. క్రేన్ నడుపుతున్న వ్యక్తి, మరో కార్మికుడికి తీవ్రగాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు.

# పార్లమెంట్ న్యూస్

## మరిన్ని కందులు కొంటాం..

**లోక్‌సభలో కేంద్రమంత్రి తోమర్ వెల్లడి**



**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో పెరిగిన కందుల పంట తాజా అంచనాల మేరకు కొనుగోలు లక్ష్యాన్ని 51,625 మెట్రిక్ టన్నులకు పెంచినట్టు కేంద్రం వెల్లడించింది. ధరల మద్దతు పథకం కింద కందుల కొనుగోలు చేయాలని కేంద్ర నోడల్ సంస్థలైన నాఫెడ్, ఎఫ్‌సీఐలకు అనుమతులు ఇచ్చామని కేంద్రం తెలిపింది. తెలంగాణలో కందుల సేకరణపై లోక్‌సభలో మంగళవారం కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ సమాధానం ఇచ్చారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 2.07 లక్షల టన్నుల కంది ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వినతి మేరకు తొలుత 47,500 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చామని, ఫిబ్రవరి 22 నాటికి 45,500 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామని వివరించారు. తదుపరి రెండో అంచనా మేరకు ఉత్పత్తి పెరుగుతున్నందున కొనుగోలు పరిమాణాన్ని 47,500 మెట్రిక్ టన్నుల నుంచి 51,625 మెట్రిక్ టన్నులకు పెంచినట్టు తెలిపారు. కనీస మద్దతు ధరగా క్వింటాల్ కందులకు రూ.5,800 చెల్లిస్తున్నట్లు చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి రూ.125 అధికంగా రైతులకు చెల్లిస్తున్నామని తోమర్ వివరించారు.

## నాణ్యత లేని పురుగు మందుల తయారీ కంపెనీలపై కేసులు

**టీఆర్‌ఎస్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు బదులిచ్చిన తోమర్**

గడిచిన మూడేళ్లలో దేశవ్యాప్తంగా 1,91,365 పురుగు మందుల నమూనాలను విశ్లేషిస్తే, ఇందులో 2,584 నమూనాలను నాణ్యత లేనివిగా గుర్తించినట్లు కేంద్రం తెలిపింది. నాణ్యతా లోపంతో పురుగు మందులు ఉత్పత్తి చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించామని కేంద్రం తెలిపింది. పురుగుమందుల వ్యాపార క్రమబద్ధీకరణ, నకిలీ వ్యవసాయ రసాయనాల వాడకంతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను ప్రతిపాదిస్తుందా..? అని మంగళవారం లోక్‌సభలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రాతపూర్వక సమాధానమిచ్చారు. నకిలీ పురుగుమందుల అమ్మకాలు తనిఖీ చేయడం, పురుగుమందుల నాణ్యతను పర్యవేక్షించడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 191 మంది, కేంద్రం నుంచి 10,946 మంది ఇన్‌స్పెక్టర్లు పురుగు మందుల నాణ్యతను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్–1986 కింద నష్టపోయిన రైతు పరిహారం పొందవచ్చని తెలిపారు.

## ఐదుగురు విదేశీయులను దేశం వదిలి వెళ్లాలని కోరాం

**సీఏఏ వ్యతిరేక నిరసనలపై ఎంపీ ఉత్తమ్ ప్రశ్నకు కేంద్రం సమాధానం**

సీఏఏ వ్యతిరేక నిరసనలో పాల్గొని వీసా నిబంధనలను ఉల్లంఘించిన ఐదుగురు విదేశీ పౌరులను దేశం విడిచి వెళ్లాలని సూచించినట్టు కేంద్రం తెలిపింది. దేశవ్యాప్తంగా సీఏఏ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్న వారిలో ఎంతమందిపై దేశద్రోహం, ఉగ్రవాదం నిరోధక చట్టం కింద నమోదైన కేసులు నమోదు చేశారని, ఇందులో ఎంతమంది విదేశీయులను దేశం వదిలి వెళ్లాలని సూచించారని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ రాత పూర్వక సమాధానం ఇచ్చారు. పోలీస్ వ్యవస్థ, శాంతి భద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశమని వివరించారు. అందువల్ల పలు రాష్ట్రాల్లో ఐపీసీ సెక్షన్ 124–ఏ (దేశద్రోహం), ఉగ్రవాద నిరోధక చట్టం కింద నమోదైన కేసుల వివరాలు కేంద్రం వద్ద అందుబాటులో లేవని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనపై అదనపు కేంద్ర బలగాలను మోహరించినట్లు వెల్లడించారు.

**'రైతుల ఆదాయం'పై పర్యవేక్షణకు సాధికారత సంస్థ**

రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యాల పురోగతిని సమీక్షించడానికి సాధికారిత సంస్థను ఏర్పాటు చేసినట్లు కేంద్రం తెలిపింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశలో కేంద్రం వద్ద ఉన్న ప్రణాళిక, రైతుల పరిస్థితిపై వార్షిక నివేదిక విడుదల అంశంపై లోక్‌సభలో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్ సమాధానం ఇచ్చారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ సమగ్రాభివృద్ధికి ముసాయిదా సిద్ధం

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ సమగ్రాభివృద్ధికి సంబంధించి జాతీయ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ముసాయిదా సిద్ధం చేసినట్టు ఆ శాఖ మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ తెలిపారు. టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి మంగళవారం రాతపూర్వక సమాధానం ఇచ్చారు. మెగా ఫుడ్ పార్క్‌లు, ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్లు, ఫుడ్ పార్కుల ప్రాసెసింగ్ యూనిట్లకు 3.90 శాతం నుంచి 7.10 శాతం మధ్య రుణాలిచ్చేలా నాబార్డ్ వద్ద రూ.2 వేల కోట్ల మేర స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ ఫండ్ ఏర్పాటు చేసినట్టు మంత్రి వివరించారు.

## పీఎంకేఎస్‌వై కింద పలు ప్రాజెక్టులకు సాయం

ప్రధాన్‌మంత్రి కిసాన్ సంపద యోజన (పీఎంకేఎస్‌వై) కింద తెలంగాణలో పలు ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. టీఆర్‌ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన మంగళవారం రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుపై కేంద్రం ఎలాంటి అధ్యయనం చేయలేదని వివరించారు. మెగా ఫుడ్ పార్క్ స్కీంలో భాగంగా నిజామాబాద్‌లోని స్మార్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల గ్రాంటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపినట్టు వివరించారు. ఖమ్మంలోని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ యూనిట్‌కు రూ.50 కోట్ల గ్రాంటుకు ఆమోదం తెలిపినట్టు వివరించారు. ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ అండ్ వాల్యూ అడిషన్ స్కీంలో 11 సంస్థలు, ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్స్ పథకంలో రెండు సంస్థలకు ఆర్థిక సహకారం అందించినట్టు తెలిపారు.

## కేంద్రమంత్రి తోమర్‌తో మంత్రి కొప్పుల భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌తో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం ఇక్కడ సమావేశమయ్యారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో 157.90 కి.మీ. పొడవైన 44 పంచాయతీరాజ్ రహదారులను మంజూరు చేయాలని కోరారు. ఈమేరకు ఆయన ఒక వినతిపత్రం సమర్పించారు.



రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో ఉన్న ఖ్వాజా మోయినుద్దీన్ చిస్తీ దర్గాలో జరిగే ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చే భక్తుల కోసం భారీ సంఖ్యలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడారాలు. ఈ ఏడాది 808వ ఉర్సు ఉత్సవాలు జరుగుతున్నాయి.

# 'బయ్యారం' ఎప్పటికయ్యేనో..?

- స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై మెకాన్ నివేదిక
- సమీకృత ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై కేంద్రం మౌనం
- సొంతంగా నిర్మించడంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు
- ఎటూ తేల్చలేకపోతున్న కేంద్ర ఉక్కుశాఖ టాస్క్‌ఫోర్స్
- బైలదిల్లా నుంచి బయ్యారానికి రైల్వేలైన్‌పై ఆర్‌వీఎన్‌ఎల్ నివేదిక

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 నిబంధనల మేరకు పదేళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పురోగతి, స్థిరమైన వృద్ధి సాధించేందుకు తెలంగాణ, ఏపీలో రెండు సమీకృత ఉక్కు కర్మాగారాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ఖమ్మం జిల్లాలో స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను ఆరు నెలల్లో పరిశీలించాల్సిన బాధ్యతను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)కు కేంద్రం అప్పగించింది. పూర్వపు ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించిన సెయిల్ ఉల్వనూరు (పాల్వంచ), కురనం (కొత్తగూడెం), బయ్యారం ప్రాంతాలను ప్రాథమికంగా ఎంపిక చేసింది. ముడి ఖనిజం లభ్యత, నీరు, విద్యుత్ లభ్యత, విద్యుత్ సరఫరా లైన్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు బయ్యారం (ఖమ్మం), గూడూరు (వరంగల్), కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ముడి ఖనిజం నిక్షేపాలు ఉన్నట్లు గతంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అధ్యయన నివేదికలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముడి ఖనిజం లభ్యతకు సంబంధించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తేనే ముడి ఖనిజం వెలికితీతకు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు సాధ్యమవుతాయని సెయిల్ పేర్కొంది.

**అధ్యయన బాధ్యత మెకాన్ లిమిటెడ్‌కు..**

సెయిల్, జీఎస్ఐతో పాటు రాంచీకి చెందిన మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (మెకాన్)తో బయ్యారంలో ముడి ఖనిజం నిక్షేపాల లభ్యతకు సంబంధించి పలు దఫాలుగా రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ చర్చలు జరిపింది. చివరకు బయ్యారం, ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వంద చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ముడి ఇనుప ఖనిజం లభ్యతకు సంబంధించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేసే బాధ్యతను మెకాన్‌కు అప్పగిస్తూ 2015 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పలు దఫాలుగా సందర్శించిన మెకాన్ సమీకృత ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సంబంధించిన భూ లభ్యత, నీరు, విద్యుత్ వనరుల లభ్యత, అందుకు అయ్యే ఖర్చు, ముడి ఖనిజం లభ్యత, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలు, సబ్సిడీలు తదితరాలకు సంబంధించిన వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అయితే ఏ ప్రదేశంలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేయాలనే అంశంపై మాత్రం మెకాన్ నివేదిక స్పష్టత ఇవ్వలేదు.

**రైల్వేలైన్ పైనా అధ్యయన నివేదిక**

బయ్యారం ప్రాంతంలో లభ్యమయ్యే ముడి ఖనిజం నాణ్యత లేనందున కేవలం పెల్లెట్ల (పరిశ్రమల కొలిమిలో వాడే ఇంధనం) తయారీకి మాత్రమే ఉపయోగపడుతుందని అధ్యయనాలు వెల్లడించాయి. దీంతో సమీపంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని సెయిల్‌కు చెందిన బైలదిల్లా గనుల నుంచి ఇనుప ఖనిజం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. బైలదిల్లా నుంచి బయ్యారం వరకు రైల్వే లైను ఏర్పాటులో ఉన్న సాధ్యాసాధ్యాలను రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. మరోవైపు సెయిల్ ఆధ్వర్యంలో బయ్యారం స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర గనుల శాఖ పలు పర్యాయాలు టాస్క్‌ఫోర్స్ సమావేశాలు ఏర్పాటు చేసింది. టాస్క్‌ఫోర్స్ కోరిన వివరాలను అందజేస్తున్నా స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. ఏపీ తరహాలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మించాలనే ప్రతిపాదన తెరమీదకు రావడంతో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా నేతృత్వంలో కమిటీ వేసింది. బయ్యారంలో ఉక్కు కర్మాగారం నిర్మాణానికి రూ.7 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు అవసరమవుతాయనే అంచనా నేపథ్యంలో సొంత నిధులతో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. కేంద్రం కనీసం 50 శాతం నిధులను గ్రాంటు రూపంలో ఇచ్చినా స్టీల్ ప్లాంటు పనులు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం నుంచి నిధుల విషయంలో స్పష్టత వస్తే తప్ప బయ్యారం సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణం పట్టాలెక్కే సూచనలు కనిపించడం లేదు.



పేట్లబురుజులోని సిటీ పోలీసు ట్రైనింగ్ సెంటర్

## ముగ్గురు ట్రైనింగ్ కానిస్టేబుళ్లకు స్వైన్‌ఫ్లూ

- సిటీ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో 9 మందికి అనారోగ్యం
- వైద్య పరీక్షల ద్వారా ముగ్గురికి ఫ్లూ సోకినట్లు నిర్ధారణ
- ముగ్గురికి కేర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు

**హైదరాబాద్:** పాతబస్తీ పేట్లబురుజులోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం స్వైన్ ఫ్లూ కలకలం రేపింది. సంగారెడ్డి జిల్లా నుంచి ట్రైనింగ్ కోసం వచ్చిన వారిలో 9 మందికి రెండు రోజులుగా తీవ్ర జలుబు, జ్వరం, దగ్గుతో అనారోగ్యానికి గురయ్యారు. అధికారులు మంగళవారం వారిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురికి హెచ్1ఎన్1 వైరస్ (స్వైన్ ఫ్లూ) సోకిందని డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసు ట్రైనింగ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు తెలిపారు. దీంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం కేర్ ఆసుపత్రికి తరలించి ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారన్నారు. మిగతా ఆరుగురిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ట్రైనింగ్ సెంటర్‌లో అందరికి మాస్కులు ఇవ్వడంతో పాటు మందులు కూడా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాగా, దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వ్యక్తికి కరోనా వైరస్ ఉందని తేలడంతో భయాందోళనలో ఉన్న ప్రజలకు పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో 9 మందికి స్వైన్‌ఫ్లూ సోకిందని ప్రచారం కావడంతో సిటీ కాలేజ్, చార్మినార్, మూసాబౌలి, ఘాన్సీబజార్, హుస్సేనీఆలం, పురానాపూల్, దూద్‌బౌలి, సిప్లిగంజ్, ముర్గీచౌక్, చెలాపురా తదితర ప్రాంతాల్లోని ప్రజలు మరింత భయాందోళనకు గురయ్యారు. అక్కడ నివసించే ప్రజల్లో చాలా మంది మాస్కులు ధరించి జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

## సీతారామ పంపులపై 'కోవిడ్' ప్రభావం

- చైనా నుంచి రావాల్సిన పంపులు, మోటార్లలో జాప్యం
- ప్రాజెక్టు ఇంజనీర్లు చైనా వెళ్లి పరీక్షించాల్సి ఉన్నా, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యటన రద్దు

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచాన్ని కలవరపెడుతున్న కోవిడ్ వైరస్ ప్రభావం సీతారామ ఎత్తిపోతలపైనా పడుతోంది. ఎత్తిపోతల పథకంలోని పంప్‌హౌస్‌లలో ఏర్పాటు చేస్తున్న పంపులు, మోటార్లు చైనా నుంచే రావాల్సి ఉన్నా కోవిడ్ ప్రభావం కారణంగా వాటి రాక ఆలస్యమవుతోంది. రాష్ట్ర ఇంజనీర్లు చైనాలో పర్యటించి అక్కడి కంపెనీలు సరఫరా చేస్తున్న మోటార్లు, పంపులను పరీక్షించాల్సి ఉన్నా, ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని రద్దు చేసుకున్నారు. సీతారామ ఎత్తిపోతల్లో మూడు పంప్‌హౌస్‌లను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పనుల టెండర్లకు ముందే చైనా సాంకేతిక సహకారాన్ని తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో భాగంగా చైనాలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలను, అక్కడ ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అవలంబిస్తున్న పద్ధతులను అధ్యయనం చేయడానికి కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ఎత్తిపోతల పథకాల ఇంజనీర్లను గతంలోనే చైనాకు పంపింది. కాళేశ్వరం పరిధిలోని పంప్‌హౌస్‌లకు చైనా పంపులు, మోటార్లు, ఇతర సామగ్రిని సరఫరా చేయాల్సి ఉండగా వాటన్నింటినీ ఇప్పటికే షిప్పుల ద్వారా రాష్ట్రానికి పంపింది. ఇక సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన పంపులు, మోటార్లు చైనాలోని వుహాన్, షాంఘై, బీజింగ్ నుంచి రావాల్సి ఉంది. ఇప్పటికే మొదటి పంప్‌హౌస్‌కు చెందిన పంపులు, మోటార్లు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నాయి. రెండో పంప్‌హౌస్‌కు చెందిన పంపుల్లో కొన్ని చైనా కంపెనీల నుంచి బయల్దేరినా, అవి ఇంకా రాష్ట్రానికి చేరుకోలేదు. మూడో పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేయనున్న 30 మెగావాట్ల 3 పంపులు, మోటార్లు, 40 మెగావాట్ల మరో 5 పంపులు, మోటార్లు షాంఘై ఎలక్ట్రిక్ కంపెనీ నుంచి రావాల్సి ఉంది.

**చైనా వెళ్లడం సాధ్యం కాదు..**

కోవిడ్ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ పంపులను పరీక్షించేందుకు చైనా వెళ్లడం సాధ్యం కాదని ప్రాజెక్టు ఇంజనీర్లు ప్రభుత్వానికి లేఖ రాశారు. కోవిడ్ వైరస్ దృష్ట్యా వాటిని పరీక్షించకుండానే రాష్ట్రానికి తెప్పించేలా అనుమతులివ్వాలని కోరారు. పరీక్షించకుండానే పంపులు, మోటార్లు వచ్చినా ఇబ్బంది ఉండదని, లోటుపాట్లున్నా కంపెనీలే బాధ్యత వహిస్తాయని తెలిపారు. అయితే, ఈ పంపులు చైనా నుంచి ఎప్పట్లోగా చేరుతాయనేది ప్రశ్నగా మారింది.

## అనాథల హక్కుల కోసం 'ఫోర్స్' పోరాటం

**సాక్షి, న్యూఢిల్లీ:** అనాథల హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 11న 'మీట్ ది ఆర్ఫన్స్, డిన్నర్ విత్ ఆర్ఫన్స్' పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్లు 'ఫోర్స్ ఫర్ ఆర్ఫన్ రైట్స్ అండ్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్'(ఫోర్స్) సంస్థ వెల్లడించింది. ఈ నెల 12న తెలంగాణ భవన్‌లో అనాథల ప్రాథమిక, రాజ్యాంగహక్కుల గురించి ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫోర్స్ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి మంగళవారం వెల్లడించారు. కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీలు వంగ గీత, రాములు, ఆలోక్ కుమార్ సుమన్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా, ఎన్సీపీసీఆర్ సభ్యురాలు ప్రజ్ఞాపరాండేలను ఆహ్వానించామన్నారు.

## ఇంట్లోకి దూరి అడవిపందుల దాడి

**ముగ్గురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం**

**శంషాబాద్:** ఓ ఇంట్లోకి దూరిన 2 అడవిపందులు ముగ్గురిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బాధితుల కథనం ప్రకారం బహదూర్‌అలీ మక్తాలో జంగయ్య, తన కుమారుడు యాదయ్య, కోడలు మంజులతో కలిసి నివాసముంటున్నాడు. ఉక్కపోతగా ఉండటంతో వీరు ఇంటి తలుపులు తెరిచి నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున రెండు అడవిపందులు లోపలికి దూరాయి. వాటిని తరిమేందుకు జంగయ్య, ఆయన కుమారుడు యాదయ్య ప్రయత్నిస్తుండగా ఇంట్లో ఉన్న ముగ్గురిపై అవి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జంగయ్య పరిస్థితి విషమంగా ఉంది. జంగయ్య నివాసముంటున్న ఇంటికి దగ్గర ఎయిర్‌పోర్టు ప్రహరీ ఉంది. ఆ ప్రాంతమంతా అడవి ఉండటంతో అడవి పందులు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

## 'మత్స్యకారుల కుటుంబాలకు బీమా సొమ్ము చెల్లించాలి'

**సాక్షి, న్యూఢిల్లీ:** వృత్తిరీత్యా ప్రమాదంలో చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు బీమా సొమ్ము ఇప్పించాలని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం (టీఎంకేఎంఎస్) ఫిష్ కో–ఫెడ్‌కు విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఢిల్లీలోని సరితా విహార్‌లో జాతీయ మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిష్ కో ఫెడ్) ఎండీ బీకే మిశ్రాను కార్మిక సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం టీఎంకేఎంఎస్ అధ్యక్షుడు మొట్టక కుమార స్వామి మాట్లాడారు. 2009లో వృత్తి నిర్వహిస్తున్న సమయంలోనే 179 మంది ప్రమాదంలో మరణించారని వివరించారు. ఆయా కుటుంబాలకు ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పించాలని ఫిష్ కో– ఫెడ్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

## ముస్లిం రిజర్వేషన్లపై విచారణ వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ వాయిదా పడింది. ఉమ్మడి హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ దాఖలు చేసిన ఈ పిటిషన్ జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వద్దకు విచారణకు వచ్చింది. విచారణ జాబితాలో ఇతర ముఖ్య పిటిషన్లు ఉండటంతో ఈ కేసును తర్వాత విచారిస్తామని చెబుతూ విచారణ వాయిదా వేసింది.

## 1999 గ్రూప్-2 కేసు విచారణ వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** 1999 గ్రూప్–2 నియామకాల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ ఉదయ్ లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం వద్దకు ఈ పిటిషన్ విచారణకు రాగా, ఏపీపీఎస్సీ నుంచి మరిన్ని వివరాలు తీసుకోవాల్సి ఉందని, అఫిడవిట్ దాఖలు చేసేందుకు మరికొంత సమయం కావాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాది జి.నాగేశ్వరరెడ్డి ధర్మాసనాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణ మార్చి17కు వాయిదా వేసింది.

## 'టీఆర్‌ఎస్‌ది పక్షపాత ధోరణి'

**సాక్షి, న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఎస్) నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తోందని బీజేపీ ఎంపీలు బండి సంజయ్ కుమార్, ధర్మపురి అర్వింద్, సోయం బాబురావు ఆరోపించారు. కేంద్ర వాటా కింద వచ్చిన నిధుల కేటాయింపు సరిగా లేదని, తమ నియోజకవర్గాల పరిధిలో సిమెంట్, కాంక్రీట్ రోడ్లకు నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను కలసి మంగళవారం విజ్ఞప్తి చేశారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఉన్న చోట నిధులివ్వకుండా రాష్ట్ర సర్కారు పక్షపాత ధోరణి చూపుతోందని ఆరోపించారు.

## ఓటుకు కోట్లు కేసులో కోర్టుకు రేవంత్

**సాక్షి, హైదరాబాద్:** ఓటుకు కోట్లు కేసులో నిందితుడైన ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఏసీబీ కోర్టు ముందు హాజరయ్యారు. 2015లో ఓటుకు కోట్లు కేసులో అరెస్టైన రేవంత్ కొన్ని నెలలు జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు ఇస్తుండగా రేవంత్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ కేసులో ఏ–1 నిందితుడిగా ఉన్న రేవంత్‌తో పాటు పలువురుపై కేసులు నమోదయ్యాయి. మంగళవారం నిందితులు ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది.

## 'హెచ్‌పీవీ డీఎన్ఏ' టెస్ట్‌తో కేన్సర్ గుర్తింపు

**సాక్షి, హైదరాబాద్:** గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను గుర్తించేందుకు అత్యాధునిక 'హెచ్‌పీవీ డీఎన్ఏ'టెస్టును యశోద ఆస్పత్రి అందుబాటులోకి తెచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా పరీక్షలు అందుబాటులోకి తెచ్చిన ఆస్పత్రి తమదేనని ప్రకటించింది. గచ్చిబౌలిలో మంగళవారం యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ గోరుకంటి సహా సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శాంతకుమారి, హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లలితారెడ్డి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిలాషా బిస్త్‌లు 'హెచ్‌పీవీ డీఎన్ఏ' టెస్ట్ వైద్య పరికరాన్ని ప్రారంభించారు. తొలి దశలో కేన్సర్‌ను గుర్తించడం వల్ల వ్యాధి బారి నుంచి మహిళలను కాపాడొచ్చని వైద్య నిపుణులు పేర్కొన్నారు.

## నేటి నుంచి మూడో దశ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** గ్రూపు–4 పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మూడో దశ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల 4 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని, ఎంపికైన వారి జాబితా తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొంది. మొదటి దశ, రెండో దశ, మూడో దశలో హాజరయ్యేవారికి కూడా ఈనెల 8న కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపింది. పోస్టు, జోన్, జిల్లా ప్రాధాన్యతలపై వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని పేర్కొంది. ప్రొఫిషియెన్సీ టెస్టు మార్కులను ఎంపికలో పరిగణనలోకి తీసుకోబోమని పేర్కొంది.

## 5 నుంచి ఇంటర్వ్యూలు

**సాక్షి, హైదరాబాద్:** డిపార్ట్‌మెంటల్ పరీక్షలో (లాంగ్వేజ్ టెస్టు) అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 5వ తేదీన ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష) నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. అర్హత సాధించిన వారి జాబితాను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.